





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



ఎన్నికలప్పుడే ప్రతిపక్ష నేతలపై దాడులా? 05

జి రామ్ జి చట్టాన్ని వెంటనే రద్దుచేయాలి 03

అంతరాలు లేనినిర్మాణమే సిపిఐ ధ్యేయం 03



సంపుటి 28, సంచిక: 200 | ఆదివారం | 11-01-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00




అక్రిడిటేషన్ జిఒలో **02**

### మార్పులు చేర్పులు చేస్తాం

అక్రిడిటేషన్‌ల జారీ మార్గదర్శకాల విషయంలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారని, వారు ప్రస్తావించిన అంశాలను విజ్ఞప్తులను పరిశీలించి సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని, జిఓ 252లో మార్పులు చేర్పులు చేస్తామని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశంపై సిఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు ఎటువంటి కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తామన్నారు.



రోబో శునకాలతో **05**

### ఓట్ల వేట

మహారాష్ట్రలోని పుణె, పింప్రి-చించ్వాడ్ సహా 29 మున్సిపల్ కార్పొరేషన్లకు జనవరి 15న పోలింగ్ జరగనుం ది. ఈ నేపథ్యంలో ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు మునుపెన్న డూ లేని విధంగా అత్యాధునిక సాంకేతికతను వాడుతున్నాయి.

# పద పద.. పల్లెకు పోదాం

ఆర్‌టిసి ప్రత్యేక బస్సుల్లో అదనపు ఛార్జీలు ఉంటున్నా గరిష్టంగా 50 శాతానికి మించడం లేదు. ప్రైవేటు బస్సుల యజమానులు మాత్రం రెండు, మూడు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారు. హైదరాబాద్-విశాఖపట్టం రూట్‌లో ఆర్‌టిసిలో టికెట్ ధర రూ.1889 ఉంటే అదే ప్రైవేటులో రూ.5 వేల నుంచి రూ.5.998 వరకు ఉంది. అదే ప్రైవేటు స్లీపర్ బస్సుల్లో టికెట్ ధర రూ.6.988 వరకు పలుకుతుంది.

**సొంతూళ్లకు పయనమైన పట్నం వాసులు**



- ప్రయాణికులతో క్రిక్కిరిసిన బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు
- హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ
- రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న చోట్ల నెమ్మదిగా కదిలిన వాహనాలు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సిందిగా పోలీసుల సూచన
- సరిపడా బస్సులు లేక ప్రైవేట్ వెహికల్స్‌ను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

ప్రజాపక్షం/హైదరాబాద్

పల్లెకు పోదాం చలో చలో.. పండుగ చూద్దాం చలో చలో అంటూ పట్నం వాసులు సొంతూళ్లకు పయనమవుతున్నారు. దీంతో బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడం, ఉద్యోగులకు వారాంతపు సెలవులు కలిసి రావడంతో నగరంలో నివసిస్తున్న ప్రజలు సంక్రాంతి సంబురాలను తమ సొంత ఊళ్లలో జరుపుకునేందుకు పల్లెకు పయనమయ్యారు. సొంతూళ్లకు వెళ్లేవారితో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ క్రమంగా పెరుగుతోంది. శనివారం ఉదయం నుంచే హైవేపై దారి పొడవునా వాహనాలు బారులు తీరాయి. చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న చోట్ల వాహనాలు నెమ్మదిగా సాగుతున్నాయి. మరోవైపు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సిందిగా పోలీసులు సూచిస్తున్నారు. భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవాలని గుంటూరు, ఒంగోలు వైపు వెళ్లేవారు సాగర్ హైవే మీదుగా వెళ్లాలని అధికారులు సూచించారు. శుక్రవారం నుంచే ఎంజిబిఎస్, కూకట్‌పల్లి, దిల్ సుఖ్‌గర్, ఎల్‌బినగర్ బస్టాండ్లు రద్దీతో కిటకిటలాడాయి. సొంతూళ్లకు వెళ్తున్న వారితో బస్సులు నిండిపోయాయి. రద్దీకి అనుగుణంగా టిజిఎస్‌ఆర్‌టిసి అదనపు బస్సులు నడుపుతున్నా సరిపోవడం లేదని తరువాయి 2లో



**కేంద్ర బడ్జెట్ తయారీలో**

# రాష్ట్రాల భాగస్వామ్యం




- ఈ చర్య సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుంది
- వికసిత్ భారత్ లక్ష్య సాధనలో సహాయపడుతుంది
- కేంద్ర రాష్ట్రాల సమన్వయం ద్వారానే దేశం పురోగమనం
- తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి
- కేంద్ర ప్రీ బడ్జెట్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు. న్యూఢిల్లీలో శనివారం ప్రీ బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఒక దేశం కేంద్ర రాష్ట్రాల సమన్వయం ద్వారానే పురోగమిస్తుందని, కేంద్ర బడ్జెట్ తయారీలో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడం ముఖ్యమైన చొరవ అని, ఇది సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుంది. అభివృద్ధి చెందిన భారతదేశం (వికసిత్ భారత్) లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుందని విశ్వసిస్తున్నామన్నారు. 2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యం అభినందనీయమని, ప్రస్తుతం దేశ జిడిపిలో తెలంగాణ వాటా 5.1 శాతమని, తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించామని, దీని ద్వారా తెలంగాణను తరువాయి 2లో




**సిపిఐ వందేళ్ల ఉత్సవాల ముగింపు**

లక్షలాది మందితో.. ఖమ్మంలో

# 18న భారీ సభ

- సిఎం రేవంత్‌రెడ్డితో పాటు హాజరుకానున్న పలువురు వామపక్ష పార్టీల అగ్రనాయకులు
- సుమారు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు రాక
- జర్నలిస్టుల 'ఇష్టాగోష్ఠి'లో వివరాలు వెల్లడించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- ప్రజలు ఇప్పటికీ కమ్యూనిస్టులనే గుర్తు చేసుకుంటున్నారు : పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వందేళ్ల ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 18న ఖమ్మంలోని ఎస్‌ఆర్‌బిజిఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు లక్షలాది మందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్టు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు చెప్పారు. ఈ సభకు ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో పాటు వామపక్ష పార్టీల అగ్ర నాయకులు, సుమారు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నారని వివరించారు. భారతదేశంలో కమ్యూనిజం ఎక్కడ ఉన్నదనే వారికి 'సిపిఐ ఖమ్మం బహిరంగ సభ' ఒక రుజువుగా నిలువనుందన్నారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాల నేపథ్యంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తరువాయి 2లో

'టెక్నాలజీ' డిగ్రీలకే


# పరిమితమవ్వొద్దు

- దేశ సేవ, ఆత్మ నిర్భరతకు ఉపయోగపడాలి
- తెలంగాణ 'గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్'గా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పం
- గేమ్ చేంజర్‌గా తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హబ్, ఎఐ యూనివర్సిటీ బిట్స్ అల్యూమ్ని అసోసియేషన్ 'గ్లోబల్ మీట్'లో మంత్రి శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణను గ్లోబల్ 'ఇన్నోవేషన్ క్యాపిటల్'గా తీర్చిదిద్దాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. టెక్నాలజీ కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా, దేశ సేవకు, ఆత్మ నిర్భరతకు ఉపయోగపడాలన్నారు. బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో శనివారం నిర్వహించిన 'బిట్స్ అల్యూమ్ని అసోసియేషన్ 'గ్లోబల్ మీట్–2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఇతర దేశాలు ప్రైవేట్ గుత్తాధిపత్యాన్ని ప్రోత్సహిస్తే, భారత్ మాత్రం ఆధార్, యూపిఐ వంటి 'డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ద్వారా ప్రపంచానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. దేశంలోనే తొలి సారిగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఎఐ ఆధారిత 'తెలంగాణ డేటా ఎక్స్‌ఛేంజ్' పరిశోధనలకు గొప్ప ఊతమిస్తోందన్నారు. త్వరలో ప్రారంభించనున్న 'తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హబ్', 'ఎఐ యూనివర్సిటీ'లు గేమ్ ఛేంజర్‌గా మారి ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తాయన్నారు. ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో 'ఇంటెలిజెన్స్' కంటే కోఆర్డినేషన్ అత్యంత ఖరీదైనదిగా మారిందన్నారు. ఎఐ వినియోగంలో డేటా ప్రైవసీ, ఎథిక్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా పరిశోధనపై దృష్టి సారించాలని టెక్ కంపెనీలను కోరారు. ఒకప్పుడు స్కేల్, స్పీడ్, వాల్యుయేషన్ ప్రాతిపదికన కంపెనీల సక్సెస్ నిర్ణయించబడేదని, ఇప్పుడు ఆర్కిటెక్చర్, డేటా ఓనర్ షిప్, డెసిషన్ స్పీడ్, నమ్మకంపైనే వాటి మనుగడ ఆధారపడి ఉందన్నారు. రానున్న రోజుల్లో కేవలం కోడింగ్ తెలిసిన వారి కంటే, సమస్య మూలాలను గుర్తించి తరువాయి 2లో



**సైబర్ ఉచ్చులో మహిళ**

# రూ. 2.58 కోట్లు టోకరా

- ట్రేడింగ్‌లో చిట్కాలు చెబుతామంటూ వాట్సాప్ మెసేజ్
- 50శాతం లాభాలొస్తాయని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. తమ మాయమాటలతో అమాయకులకు వల విసిరి రూ. కోట్లు దోచుకుంటున్నారు. తాజాగా సైబర్ కేటుగాళ్ల వలకి ఓ మాజీ ఐపిఎస్ అధికారి భార్య చిక్కింది. వారి మోసపూరితమైన మాటలను నమ్మి ఏకంగా రూ.2.58 కోట్ల మేర నష్టపోయింది. తాజాగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ తరువాయి 12లో

# విషమిచ్చి చంపేయండి



- తప్పుడు ప్రచారాలు చేస్తూ నన్నెందుకు హింసిస్తున్నారు?
- మహిళా ఐఎఎస్ అధికారులను లక్ష్యంగా చేసుకోవడం దుర్మార్గం
- మీడియా ముందు కంటనీరు పెట్టుకున్న మంత్రి కోమటిరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

మీడియాలో వస్తున్న వార్తలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. తనను ఎందుకిలా ఇబ్బంది పెడుతుండ్రు.. ఇంత విషమిచ్చి చంపండంటూ ఎమోషనల్ అయ్యారు. నిప్పులా బతికిన తనను హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా ఐఎఎస్ అధికారులను లక్ష్యంగా చేసుకొని మీడియా, సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు, ఆధారంలేని ప్రచారాలను తరువాయి 2లో

# భారీ ఆపరేషన్



- హైదరాబాద్‌లోని మియాపూర్‌లో 15 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్న హైడ్రా
- రూ.3 వేల కోట్ల విలువైన భూమిచుట్టూ ఫెన్సింగ్

ప్రజాపక్షం/హైదరాబాద్

నగరంలోని భూ ఆక్రమణదారులపై హైడ్రా మరోసారి ఉక్కుపాదం మోపింది. మియాపూర్ ప్రాంతంలో శనివారం నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో సుమారు రూ. 3,000 కోట్ల విలువైన 15 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం, మియాపూర్ గ్రామం పరిధిలోని మక్తా మహబూబ్ పేట (సర్వే నంబర్ 44) లో తరువాయి 12లో

# శాంతించని ఇరాన్

**36 గంటలుగా ఇంటర్నెట్ బ్లాకౌట్**




- ఉధృత పోరుకు పెహ్లవి పిలుపు
- హింసకు పాల్పడితే దాడులు చేస్తాం: ట్రంప్

**తెహ్రాన్:** ఇరాన్ అట్టుడికిపోతోంది. ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా ప్రజాందోళనలు పెద్దఎత్తున సాగుతున్నాయి. 36 గంటలుగా ఇంటర్నెట్ బ్లాకౌట్ కొనసాగుతోంది. తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలంటూ అజ్ఞాతంలో ఉన్న ఇరాన్ యువ రాజు రెజా పెహ్లవి శనివారం సామాజిక మాధ్యమంగా పిలుపునిచ్చారు. ఇరాన్ ఆందోళనలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు మద్దతు ప్రకటించారు. ఆందోళనకారులపై కాల్పులు జరిపితే ఇరాన్‌పై దాడులు చేస్తామని బెదిరించారు. ఉద్రిక్తతల నడుమ మృతుల సంఖ్య 217కి చేరినట్లు స్థానిక వర్గాల సమాచారం. కాగా, 65 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంతర్జాతీయ మీడియా నివేదించింది. రాజధాని తెహ్రాన్‌లోనే ఎక్కువ మంది యువ ఆందోళనకారులు చనిపోయినట్లు నివేదికలు వెలువడ్డాయి. ఉత్తర తెహ్రాన్ పోలీస్ స్టేషన్ వెలుపల భద్రతా దళాలు నిరసనకారులపై కాల్పులు జరపడంతో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. శని, ఆదివారాల్లో మరింత ఉధృతంగా ఆందోళనలు చేపట్టాలని యువరాజు రెజా పెహ్లవి సామాజిక మాధ్యమం వేదికగా తరువాయి 12లో

# భారత్‌కు వెనిజులా చమురు విక్రయానికి అమెరికా సిద్ధం




**వాషింగ్టన్:** వెనిజులా అధ్యక్ష దంపతులను నిర్బంధించిన కొద్ది రోజులకు భారత్‌తో చమురు వాణిజ్యానికి సిద్ధమంటూ అమెరికా ప్రకటించింది. వాషింగ్టన్ నియంత్రణలోని నూతన కార్యాచరణ కింద భారత్‌కు వెనిజులా చమురు విక్రయానికి సానుకూలమని పేర్కొంది. రష్యా ముడిచమురు కొనుగోళ్లు ఆపాలంటూ భారత్‌పై ఒత్తిడి పెంచుతున్న నేపథ్యంలో తాజా పరిణామానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ ఏడాది ఆరంభంలో వాషింగ్టన్‌కు కారకస్‌కు మధ్య 2 బిలియన్ డాలర్ల విలువ చేసే ముడి చమురు ఒప్పందం జరిగింది. అమెరికా సుంకాలు విధిస్తున్నప్పటికీ రష్యాతో చమురు వాణిజ్యాన్ని భారత్ కొనసాగిస్తోంది. అయితే నూతన కార్యాచరణ ప్రకారం వెనిజులా చమురును తిరిగి కొనుగోలు చేసేందుకు భారత్‌కు అనుమతి ఉన్నదని, అయితే దానిని అమెరికా ప్రభుత్వం మార్కెట్ చేస్తుందని అధికారిక ప్రకటన వెల్లడించింది. గతంలో వెనిజులా నుంచి చమురు కొనుగోలు చేసే అతిపెద్ద దేశంగా భారత్ ఉన్నది కానీ ఇటీవల పరిణామాల క్రమంలో పెరిగిన అమెరికా ఆధిపత్యంతో పరిస్థితి మారింది. వెనిజులా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పటికే అమెరికా వర్గాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. రిలయన్స్ చివరిగా 2025 మేలో వెనిజులా చమురు కొనుగోలు చేసింది. తాజా పరిణామం భారత్‌కు ప్రయోజనమని, ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని అనేక నివేదికలు సూచిస్తున్నాయి. కేవలం భారత్‌కే కాదు ప్రపంచ దేశాలు అన్నింటికి వెనిజులా చమురును విక్రయించడం కోసం అమెరికా సిద్ధంగా ఉన్నట్లు ఆ దేశ ఇంధన శాఖ కార్యదర్శి క్రిస్టఫర్ రైట్ వెల్లడించారు. ఇదిలావుంటే, వెనిజులా చమురు ఆదాయం ఆ దేశంతో పాటు అమెరికాకూ లాభమని, అక్కడి చమురు నిల్వలను వెలికితీయడానికి ముందుకురావాలని అమెరికా కంపెనీలకు ట్రంప్ సూచించారు. తాజా చర్యల వల్ల ఇంధన ఉత్పత్తి పెరిగి, ధరలు తగ్గుతాయని అన్నారు.

# గ్రీన్‌లాండ్ అమెరికా సొంతం కావాల్సిందే

### ఆ అవకాశం రష్యా, చైనాకు ఇవ్వకూడదు: ట్రంప్



**వాషింగ్టన్:** గ్రీన్‌లాండ్ తమ సొంతం కావాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. గ్రీన్‌లాండ్‌కు ఇష్టమున్నా లేకపోయినా వెనక్కు తగ్గేదేలేదన్నారు. తాము బలవంతంగానైనా సరే గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని, లేకపోతే రష్యా లేదా చైనా ఆ పని చేస్తాయని ట్రంప్ అన్నారు. శ్వేతసౌధంలో అమెరికా చమురు కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. సైనిక నిర్బంధం పేరిట బెదిరించి... వెనిజులాలో విస్తారమైన చమురు నిల్వలను అమెరికా కంపెనీలు కొల్లగొట్టే పణాళికలను చర్చించారు. అమెరికా విదేశాంగ విధానం సామ్రాజ్యవాద విజన్‌తో ముందుకెళ్లబోతున్నట్లు తెలిపారు. ఇరుగు పొరుగు దేశాలపై అమెరికా వ్యూహాత్మక ఆధిపత్యం ఉండాలన్నారు. రష్యా, చైనాలు తమ పొరుగు దేశాలుగా ఉండాలని కోరుకోవడం లేదని... గ్రీన్‌లాండ్ స్వాధీనానికి కఠిన మార్గాలను అనుసరించాల్సి రావచ్చని అన్నారు. గ్రీన్‌లాండ్ చుట్టూ జలాల్లో చైనా, రష్యా నౌకలు మోహరించి ఉన్నాయన్నారు. అమెరికాకు గ్రీన్‌లాండ్ వ్యూహాత్మకంగా, రక్షణపరంగా కీలక ప్రాంతమని చెప్పారు. ఆర్కిటిక్‌లో ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి గ్రీన్‌లాండ్‌పై నియంత్రణ తమకు అవసరమని అన్నారు. గ్రీన్‌లాండ్, డెన్మార్క్‌తో అమెరికా మంత్రి రూబియో త్వరలో చర్చిస్తారని తెలిపారు.

**అమెరికన్లుగా ఉండబోం: గ్రీన్‌లాండ్**

తమ దేశాన్ని చేజిక్కించుకునేందుకు అమెరికా పావులు కదుపుతుండటంపై గ్రీన్‌లాండ్ ఆందోళన వ్యక్తంచేసింది. అమెరికాను ప్రతిఘటించేందుకు అక్కడి రాజకీయ పార్టీలన్నీ కూడా ఒక్కటయ్యాయి. అమెరికన్లుగా ఉండాలని లేదని, తమ భవిష్యత్తు నిర్ణయాధికారం తమదేనని తేల్చిచెప్పాయి. గ్రీన్‌లాండ్ భవిష్యత్తును ఇక్కడి ప్రజలే నిర్ణయిస్తారని ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి.

# నేను లేకుంటే భారత్–పాక్ పోరు తీవ్రమయ్యేది: ట్రంప్

**న్యూయార్క్:** తాను జోక్యం చేసుకొని ఉండకపోతే భారత్, పాకిస్థాన్ మధ్య పోరు మరింత తీవ్రరూపం దాల్చి అణు యుద్ధానికి దారితీసేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం ఆపినట్లు 70 సార్లకుపైగా చెప్పుకున్నారు. మొత్తం ఎనిమిది యుద్ధాలు ఆపాను... థాయిలాండ్ కంబోడియా యుద్ధాన్ని ఆపానుకానీ మళ్లీ ఉద్రిక్తతలు నెలకొన్నాయి అని ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ వెల్లడించారు. ఒక యుద్ధం ఆపినందుకు ఒకటి చొప్పున తనకు నోబెల్ శాంతి పురస్కారం వరించాలి కానీ 30 ఏళ్లకుపైగా సాగుతున్న పోరుకు తెరదించినప్పటికీ ఆ అవార్డు ఇవ్వలేదన్నారు. యుద్ధాలు ఆపాడటం, లక్షల మంది ప్రాణాలు కాపాడటం ఎంతో సంతృప్తినిస్తాయని చెప్పారు. భారత్–పాక్ మధ్య శాంతి కుదిర్చే లోపే ఎనిమిది యుద్ధ విమానాలు కూలిపోయాయని, వెంటనే యుద్ధం ఆపివుండకపోతే తీవ్ర పరిణామాలు తప్పేవి కాదని వెల్లడించారు. ఆపిన ప్రతి యుద్ధానికి ఒకటి తనకు నోబెల్ దక్కాలని ట్రంప్ చమత్కరించారు.

# అధికారమిస్తే ప్రజాస్వామ్య మార్గంలో బంగ్లాదేశ్

### తారిఖ్ రెహ్మాన్ ఉద్ఘాటన



**ఢాకా:** వచ్చేనెల జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తమ పార్టీకి అధికారం అప్పగిస్తే దేశాన్ని సరైన మార్గంలో నడిపిస్తానని బంగ్లాదేశ్ నేషనలిస్ట్‌పార్టీ (బిఎన్‌పి) ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ ప్రజలకు హామీ ఇచ్చారు. పార్టీ ఛైర్మన్, బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి ఖలీదా జియా మరణం తర్వాత శుక్రవారం (జనవరి 9)బిఎన్‌పి స్థాయీసంఘ సమావేశంలో తారిఖ్ రెహ్మాన్ పార్టీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆ మరునాడు ఢాకా సిటీ హోటల్‌లో శనివారం ఉదయం వివిధ పత్రికా సంపాదకులు, జర్నలిస్టులతో ఇష్టాగోష్ఠిలో తారిఖ్ రెహ్మాన్ మాట్లాడారు. 2024 ఆగస్టు ఐదోతేదీనాటి ముందు పరిస్థితులు దేశంలో తిరిగి తలెత్తకుండా దేశానికి దిశానిర్దేశం చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యమార్గంలో నడిపిస్తామని, జవాబుదారీని తీసుకువస్తామని ఆయన అన్నారు.

దేశంలో సానుకూల పరిస్థితులు తిరిగి తీసుకువచ్చేందుకు అన్ని రంగాలలో జవాబుదారీతనం, ప్రజాస్వామ్య ప్రక్రియను తిరిగి తీసుకువస్తామన్నారు. ఇప్పుడు మనకి ఎన్నో సమస్యలు ఉన్నాయి, ఇంతకు ముందు కూడా అనేక సమస్యలున్నాయి, కానీ తిరిగి ఆ సమస్యల దశకు దేశాన్ని వెళ్ళకుండా కాపాడతాం అన్నారు. తన జీవితంలో జరిగిన చేదు సంఘటనలను 1981లో తన తండ్రి హత్యకు దారి తీసిన పరిస్థితులు, తన తల్లి ప్రజాస్వామ్య పునరుద్ధరణకోసం ఎదుర్కొన్న సమస్యలను, 2024 ఆగస్టు ఐదోతేదీకి ముందు ఘట్టాలను ఆయన గుర్తుచేసుకున్నారు. "ఇది నా గురించి మాత్రమే కాదు, బిఎన్‌పి పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రాణత్యాగాలు చేసిన ప్రజల గురించి చెబుతున్నాను, కానీ ఇప్పుడు ఇక మనం వెనక్కు తిరిగి చూడాల్సిన అవసరం లేదు, బిఎన్‌పిని గెలిపిస్తే దేశాన్ని ప్రజాస్వామ్యపంథాలో దిశానిర్దేశం చేస్తాం, దేశంలో భిన్న రాజకీయపార్టీలు, భిన్నభావజాలం ఉన్నవారు ఉంటారు, భిన్నాభిప్రాయాలు తప్ప భిన్న విభజనల అవసరం ఉండకూడదన్నారు. వైరుధ్యాలు ఉంటాయి, మనం ప్రయత్నించాలి, చర్చల ద్వారా సమస్యలన్నీ పరిష్కరించుకోగలం అని చెప్పారు. 1971, 1990,2024 సంవత్సరాలలో జరిగిన సంఘటనలు,పరిణామాల గుణపాఠాలు నేర్చుకుని రాజకీయనాయకులు దేశ స్వాతంత్ర్యాన్ని, దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం పాటుపడాలని కోరారు.

# ఉక్రేన్‌లో పశ్చిమదేశాల సైన్యాన్ని ఒప్పకోం : రష్యా

### రేపు భద్రతా మండలి సమావేశం

**మాస్కో:** ఉక్రేన్‌లో పశ్చిమ దేశాల జోక్యాన్ని, ఆ దేశాలకు చెందిన సైన్యాల ఉనికినీ సహించేది లేదని రష్యా నిర్ద్వంద్వంగా స్పష్టం చేసింది. ఉక్రేన్ సమస్యపై సోమవారం భద్రతామండలి సమావేశం జరగనున్న నేపథ్యంలో రష్యా భద్రతా మండలి డిప్యూటీ ఛైర్మన్ ద్మీత్రీ మెద్వెదేవ్ శనివారం ప్రకటించారు. ఉక్రేన్‌లో శాంతి భద్రతలను నిర్వహించే విషయంపై సోమవారం మధ్యాహ్నం ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఉక్రేన్‌లో వ్యక్తిగతంగా ఏ యూరప్‌దేశంగానీ లేదా నాటో కూటమి దేశాలుగానీ సైన్యాన్ని మోహరించడానికి మాస్కో తిరస్కరిస్తోందని మెద్వెదేవ్ చెప్పారు. రష్యాతో శాంతి ఒప్పందం కుదిరితే ఉక్రేన్‌లో శాంతి దళాల పేరుతో సైన్యాన్ని మోహరించాలని బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ నిర్ణయించడంపై మెద్వెదేవ్ స్పందించారు. ఉక్రేన్‌లో ఓర్నెనిక్ క్షిపణులతో రష్యా తన దాడులను ఉద్ధృతం చేయడంతో శుక్రవారం నలుగురు మరణించారు. రష్యాలోని పలు ప్రాంతాల్లో ఉక్రేన్ కూడా డ్రోన్లతో దాడులు చేసింది. ఈ దాడుల్లో 33 ఉక్రేన్ డ్రోన్లను కూల్చివేసినట్టు కూడా మెద్వెదేవ్ చెప్పారు. ఈ పరిణామంపై యూరప్ దేశాల స్పందనకు ఆయన సమాధానం చెప్పారు. యూరప్‌దేశాలతో ఎలాంటి వైరుధ్యాన్ని రష్యా కోరుకోవడంలేదని, యూరప్‌పై మొదటి దాడి చేసే ఉద్దేశం తమకు లేదని, అలాగని ఉక్రేన్‌లో శాంతిదళం పేరుచెప్పి నాటో సేనలను మోహరిస్తే సహించబోమని ఎక్స్ వేదికగా ఆయన పోస్టింగ్ చేశారు. మరోవైపు ట్రంప్ కూడా స్పందిస్తూ, రష్యాపై ఆంక్షలు విధించడానికి ఎలాంటి శాసనం చేయాల్సిన అవసరం ఉండదని, కానీ తాము అందుకు సన్నద్ధంగా ఉన్నామని అన్నారు.

# విషమిచ్చి చంపేయండి (మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బంజారాహిల్స్‌లోని తన నివాసంలో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి, ఆ వార్తలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్, ఐఎఎస్ అధికారుల బదిలీల్లో మంత్రుల జోక్యం ఉండదని, అలాంటి నిర్ణయాలు పూర్తిగా ముఖ్యమంత్రి పరిధిలో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. అన్ని మీడియా యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ నాయకులు, ఐఏఎస్ అధికారులు, ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఒ) లోని మహిళా అధికారులు, ఇంచార్జ్ మంత్రులపై కూడా ఆధారంలేని కథనాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై డిజిపితో చర్చించామని, సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డిజిపి, ఇంటెలిజెన్స్ అధికారులను కోరినట్లు తెలిపారు. నివేదిక వచ్చిన అనంతరం చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

**తెలంగాణ ఉద్యమం కోసం మంత్రి పదవినే త్యాగం చేశా..**

తెలంగాణ ఉద్యమం కోసం మంత్రి పదవినే త్యాగం చేశానని, వ్యక్తిగతంగా ఎన్నో బాధలు ఎదుర్కొన్నానని మంత్రి గుర్తు చేశారు. తన కుమారుని కోల్పోయిన బాధను దాచుకుని, ఆయన పేరుతో ప్రజాసేవ చేస్తున్నా నని, పేద ప్రజలకు సేవచేస్తున్న తనపై అసత్య ప్రచారాలు చేయడం అన్యాయమని అన్నారు.

**సంక్రాంతి ప్రయాణాలపై విస్తృత ఏర్పాట్లు..** సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు వెళ్లే ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా సమగ్ర చర్యలు చేపట్టా మని మంత్రి తెలిపారు. ఈసారి సుమారు 12 లక్షల వాహనాలు ఊర్లకు వెళ్లి తిరిగి వస్తాయని అంచనా వేస్తున్నామని, గత ఏడాది 9 లక్షల వాహనాలు ప్రయాణించాయని గుర్తు చేశారు. టోల్ గేట్ల వద్ద భారీ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడితే వెంటనే టోల్ గేట్లు తెరవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. పంతంగి టోల్ గేట్ వద్ద తరచుగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో అక్కడ టోల్ గేట్ ఓపెన్ చేయాలని సూచించామని తెలిపారు.

**సినిమా ఇండస్ట్రీ గురించి పట్టించుకోవట్లేదు..**

తాను సినిమా ఇండస్ట్రీ గురించి పట్టించుకోవడం మానేశానని మంత్రి చెప్పారు. సినిమా టికెట్ల రేట్ల పెంపుపై మంత్రి స్పందిస్తూ సినిమా టికెట్ల ధరల పెంపుపై తన దగ్గరకు రావొద్దని చెప్పానని, దీంతో ఎవరూ తనను కలవడానికి రావడం లేదని చెప్పారు. పుష్ప సినిమా సందర్భంగా ఓ మహిళ చనిపోవడం బాధాకర మన్నారు. అప్పటి నుంచే టికెట్ల రేట్ల పెంపుకోసం తన దగ్గరకు రావొద్దని చెప్పానని, ఇటీవల విడుదలవుతున్న సినిమాలకు సంబంధించిన టికెట్ల ధరల పెంపు విషయం తనకు తెలీదని చెప్పారు. టికెట్ల రేట్ల పెంపుపై తాను సంతకం చేయలేదని స్పష్టం చేశారు. ఆ విషయంలో ఏం జరుగుతుందో తెలీదని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు.

# అమెరికన్ సిటిజన్లుగా గుర్తింపు ఇష్టం లేదు

### గ్రీన్‌లాండ్ ప్రజల తిరస్కృతి

**నూక్:** గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేసే విషయంపై డెన్మార్ నాయకులతో వచ్చేవారం సమావేశం నిర్వహిస్తామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో ప్రకటించిన తర్వాత గ్రీన్‌లాండ్ ప్రజల్లో మరింత భయాందోళన ప్రారంభమైంది. తాము గ్రీన్‌లాండ్ దేశీయులుగానే బ్రతకదలుచుకున్నామని, ఎలాంటి ప్రలోభాలకు గురయ్యేదిలేదని పాత్రికేయు ల ఇంటర్వ్యూలలో ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అమెరికన్లుగా గుర్తింపు పొందడం తమకు ఇష్టంలేదని స్పష్టం చేశారు. డెన్మార్క్‌లో ఒక స్వయంప్రతిపత్తి ద్వీపంగా ఉన్న గ్రీన్‌లాండ్‌లో నివసిస్తున్న 57,000 మంది ప్రజలు అభద్రతాభావంతో ఉన్నారని ఆ ప్రాంతాన్ని సందర్శించిన బిబిసి ప్రతినిధి వ్యాఖ్యానించారు. తాము అటు డెన్మార్ పాలనలోగానీ, ఇటు అమెరికన్ ప్రజలుగాగానీ గుర్తింపు పొందడానికి ఇష్టపడటంలేదని, గ్రీన్‌లాండ్ ప్రజలుగా ఉండటానికే ఇష్టపడుతున్నామని ఇంటర్వ్యూ లో పలువురు దుకాణదారులు, పౌరులు చెప్పారు. గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకునేందుకు ఆ దేశంలో ప్రజలకు తలకు 10,000 డాలర్లు లేదా 20,000 ఇస్తామని ట్రంప్ ఆశచూపిస్తున్నారు. ఇలాంటి ప్రలోభాలకు గురయ్యేది లేదని వారు స్పష్టంగా చెప్పారు. వ్యూహాత్మకంగా చైనా, రష్యా, ఉత్తర కొరియా తదితర శత్రుదేశాలను నిలువరించడానికి గ్రీన్‌లాండ్ అనివార్యంగా అమెరికాలో భాగంగా ఉండాల్సిందేనని ట్రంప్ శుక్రవారం పొద్దుపోయాక మరోసారి ఉద్ఘాటించారు. గ్రీన్‌లాండ్ దేశం పూర్తిగా మంచుతో కప్పబడి ఉంటుంది. ఎంతో ప్రశాంతంగా ఐసుగడ్డలతో ఉండే ఈ ప్రాంతంలో ప్రజలు ఇప్పుడు భయాందోళనలు, ఉద్రిక్తతలు నెలకున్నాయి.

# జిఒ 252లో మార్పులు చేర్పులు చేస్తాం

* జర్నలిస్టు సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం
* 14 జర్నలిస్టు సంఘాలతో సమావేశం నిర్వహించిన రాష్ట్ర హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అక్రిడిటేషన్‌ల జారీ మార్గదర్శకాల విషయంలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారని, వారు ప్రస్తావించిన అంశాలను విజ్ఞప్తులను పరిశీలించి సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని, జిఒ 252లో మార్పులు చేర్పులు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. గతంలో ఉన్న సుమారు 23 వేల అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య కంటే ఈసారి ఇచ్చే కార్డుల సంఖ్య ఎక్కువ ఉంటుందని వెల్లడించారు. మీడియా కార్డుకు, అక్రిడిటేషన్ కార్డుకు ఎలాంటి వ్యత్యాసం లేదని అక్రిడిటేషన్ కార్డుదారులకు ప్రభుత్వ పరంగా అందే ప్రతి ప్రయోజనం మీడియా కార్డుదారులకు కూడా అందుతాయని ఇందులో ఎలాం టి అనుమానాలకు తావులేదని మరోమారు స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్‌ల జారీ మార్గదర్శకాల ఉత్తర్వుల (జీఓ 252) పై శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో 14 జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి, ఐపిఆర్ కమిషనర్ సిహెచ్.ప్రియాంక, సిఎం సిపిఆర్‌ఓ జి.మల్సూర్, టియుడబ్ల్యుజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్‌నారాయణ, వివిధ జర్నలిస్టుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిజం గౌరవాన్ని నిలబెట్టి ఆ వృత్తికి వన్నెతెచ్చే జర్నలిస్టులందరికీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. ఏ ఒక్కరి గౌరవాన్ని తగ్గించాలని గానీ, చిన్నబుచ్చాలని గానీ ప్రభుత్వ ఉద్దేశ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటివరుసలో ఉందని అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలనే సదుద్దేశంతో శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేయడం జరిగిందని, పలుమార్లు సమావేశాలు నిర్వహించామని, దేశ వ్యాప్తంగా ఉన్న నియమనిబంధనలను పరిశీలించామని, ఫలితంగా కొత్త కార్డుల మంజూరులో కొంత జాప్యం జరిగిందని అన్నారు. అక్రిడిటేషన్ కార్డు ల మంజూరు విషయంలో ఎటువంటి భేషజాలకు పోవడంలేదని, కానీ ఈ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు గాను ప్రభుత్వ పరంగా సర్క్యులేషన్, ఇతర సంబంధిత వివరాలను ఖచ్చితంగా సేకరిస్తామని, ఛార్టెడ్ అకౌంటెంట్ సర్టిఫికేట్ల పరిశీలన కూడా చేస్తామని దీని వల్ల అసలైన పత్రికలు, పాత్రికేయలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మండలానికో విలేకరి ప్రాతిపదికన కాకుండా జనాభా వారీగా అక్రిడిటేషన్లు మంజూరు చేస్తే ఎలా ఉంటుందన్న విషయంలో కూడా ఆలోచిస్తామని, దీనిపై పాత్రికేయ సంఘాలు స్పందించాలని అన్నారు. అక్రిడిటేషన్ కమిటీలలో ఉర్దూ జర్నలిస్టులకు అవకాశం కల్పిస్తామని, క్రీడా, సాంస్కృతిక, క్రైమ్, కేబుల్ టీవీ తదితర విభాగాల పాత్రికేయులకు అక్రిడిటేషన్ సౌకర్యం తప్పక ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు అక్రిడిటేషన్ కార్డుల జారీలో ప్రత్యేక కోటా కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

**జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తాం**

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు ఎటువంటి కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తామని మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇండ్ల స్థలాల కొంతమంది ప్రతినిధులు అడిగిన ప్రశ్నలపై మంత్రి స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశాన్ని పరిష్కరించి జవహర్ లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీకి భూమిని అప్పగించినట్లు చెప్పారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు ఈ అంశాన్ని కొట్టివేయడంతో సమస్య మొదటికి వచ్చిందని, అయినా కూడా ఇండ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం ఎప్పుడూ సానుకూలంగా ఉంటుందన్నారు.

# పల్లెకు పోదాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా రద్దీ పెరగడంతో ప్రయాణికులకు సరిపడా బస్సులు లేక ప్రైవేట్ వెహికల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు. ఇదే అదునుగా ప్రైవేట్ వెహికిల్స్ వారు టికెట్ ధరలను డబుల్ చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండుగ నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కోలాహలంగా మారింది. సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారి సంఖ్య పెరగడంతో రైల్వే స్టేషన్ ప్రాంగణమంతా ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. దీంతో రైల్వే అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు.

**సంక్రాంతి రద్దీ దృష్ట్యా 6431 స్పెషల్ బస్‌లు :** సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా టిజిఎస్ ఆర్‌టిసి 6432 స్పెషల్ బస్సులను నడిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు 1000 బస్సులను, మిగతా వాటిని తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలకు నడిపిస్తోంది. నిన్నటి నుంచి ప్రారంభమైన ప్రత్యేక బస్సులు ఈనెల 13వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని రంగారెడ్డి ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ శ్రీలత ఇప్పటికే తెలిపారు. తిరిగి 18, 19 తేదీల్లోనూ స్పెషల్ బస్సులు నడుస్తాయని వివరించారు. కాగా ప్రత్యేక బస్సులకు 50 శాతం అదనపు చార్జీలు వసూలు చేయనున్నారు.

# పరిమితమవ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కరించ గల 'క్రియేటివ్ థింకర్స్'కే జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందన్నారు. ఎఐ ఫలితాలు కేవలం నగరాలకే పరిమితం కాకూడదని, వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లోని గ్రామీణ సమస్యలకు పరిష్కారం చూపే విధంగా పరిశోధనలు జరగాలని, అప్పుడే టెక్నాలజీ ఫలాలు సామాన్యులకు కూడా అందుతాయన్నారు. 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యం కావాలని బిట్స్ పిలానీ పూర్వ విద్యార్థులను, యాజమాన్యాన్ని మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. ఎఐ, ఇన్నోవేషన్, అకడమిక్ రీసెర్చ్ వంటి అంశాల్లో బిట్స్ పిలానీతో కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో బిట్స్ అలుమ్ని అసోసియేషన్ ఛైర్ పర్సన్ ప్రేమ్ జైన్, మ్యాప్ మై ఇండియా ఫౌండర్ అండ్ ఛైర్మన్ రాకేష్ వర్మ, బిజిఎం–2026 ఛైర్ పర్సన్ అనిత తదితరులు పాల్గొన్నారు.

# 18న భారీ సభ (మొదటి పేజీ తరువాయి)

ఇ.టి.నర్సింహ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి హైదరాబాద్‌లో జర్నలిస్టులతో శనివారం కూనంనేని సాంబశివరావు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఖమ్మం బహిరంగ సభకు ఎపి, కేరళ, తమిళనాడుతో పాటు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరానున్నారని, ప్రజలు స్వచ్ఛందంగా రవాణ సౌకర్యాన్ని కల్పించుకుని వస్తున్నారని ఆయన తెలిపారు. బహిరంగ సభకు ముందు పదివేల మందితో 'జనసేవాదళ్ కవాతు'ను నిర్వహించనున్నామని, ఆ తర్వాత సభ జరుగుతుందని తెలిపారు. మరుసటి రోజు 19వ తేదీన జాతీయ సదస్సును నిర్వహిస్తామని, అలాగే ఈనెల 19, 20,21 న సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం, కార్యవర్గ, సమితి సమావేశాలను నిర్వహించనున్నట్టు కూనంనేని వివరించారు. కమ్యూనిస్టు సిద్ధాంతానికి భిన్నంగా కాకుండా మారుతున్న కొత్త పద్ధతులు, వివిధ దేశాల పరిస్థితులకు అనుగుణం గా మార్పులు చేసుకుంటూ శ్రీలంక, నేపాల్ ఇలా పలు దేశాలలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చాయని, చిన్నపాటి సమస్యలు వచ్చినా పరిష్కరించుకూంటూ ఐక్యంగా ముందుకు వెళుతున్నారని ఆయన వివరించారు. భారతదేశంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామా లు, పరిస్థితులు, కగార్ ఆపరేషన్, కార్మిక హక్కులను కాలరాస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు ఇలాంటి సందర్భంలో కమ్యూనిస్టు పార్టీలన్నీ కలిస్తే బాగుటుందని అందరూ కోరుకుంటున్నారని, కమ్యూనిస్టు పార్టీలలో ఐక్యత రావాలని చాలా మంది చెబుతున్నారని కూనంనేని సాంబశివ రావు తెలిపారు.

**ఇప్పటికీ ప్రజలు కమ్యూనిస్టులనే గుర్తు చేసుకుంటారు : పల్లా వెంకట రెడ్డి**

పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ సిపిఐ 99వ సంవత్సరం నుంచి వందేళ్లు పూర్తి చేసుకునే ఒక సంవత్సరం వరకు ఏడాది పొడవునా సిపిఐ వందేళ్ల ఉత్సవాలు నిర్వహించుకున్నామని వివరించారు. సమస్యల పరిష్కారాన్ని కోరుకున్నప్పుడు ప్రజలు కమ్యూనిస్టులను గుర్తు చేసుకుంటున్నారని, తాము నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఖమ్మం సభకు ప్రజలు స్వచ్ఛందంగా హాజరుకానున్నారని తెలిపారు.

**వందేళ్లలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాం... మౌలిక అంశాలను సాధించాం: డాక్టర్ నారాయణ**

డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలు వందేళ్ల కాలంలో ఏం సాధించారని కొందరు హేళన చేస్తున్నారని, వందేళ్ల కాలంలో తాము అధికారంలోకి రాకపోయినప్పటికీ భారతదేశ సమైక్యతకు విఘాతం కలగకుండా, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ, మౌలిక అంశాలను నిలబెట్టామని స్పష్టం చేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో సంపూర్ణ స్వాంత్ర్యం ప్రతిపాదన చేసింది భారత కమ్యూనిస్టు పార్టీ యే అని, దున్నేవాడికి భూమి, పేదలకు భూమి పై హక్కు, తెలంగాణ సాయుధ పోరాటం ఇలా అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించిందని నారాయణ గుర్తు చేశారు. తమ దేహం ముక్కలైనా దేశాన్ని ముక్కలుగా కానివ్వబోమని నినదించిందే కమ్యూనిస్టు పార్టీ అని చెప్పారు. భవిష్య త్తు ప్రజలదేనని, కమ్యూనిస్టు పార్టీదేనని అన్నారు.

# రాష్ట్రాలు భాగస్వామ్యం (మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం ఉన్న 200 బిలియన్ డాలర్ల నుండి 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రయత్నిస్తున్నామని, తద్వారా దేశ జిడిపిలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా నిర్ణయించామని వివరించారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణలో పెట్టుబడి రేటును ప్రస్తుత 37 శాతం నుంచి 50 శాతానికి (జిఎస్‌డిపి) పెంచాల్సి ఉందని, రాష్ట్రాల ద్రవ్య లోటు పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలని డిప్యూటీ సిఎం కోరారు. రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చాలని, ఆ సహాయాన్ని రెట్టింపు చేయాలని కోరారు. విద్య, ఆరోగ్య రంగాల కోసం సేకరించే వనరులను ఎఫ్‌ఆర్‌బిఎం పరిమితుల నుంచి మినహాయించాలన్నారు. తెలంగాణలో ప్రస్తుతం 1000కి పైగా కులాల వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో ఆధునిక వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోందని, ఇక్కడ అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకుంటారని తెలిపారు. కేంద్రం తన మొత్తం వ్యయంలో 20 శాతం కంటే ఎక్కువ రాష్ట్ర, ఉమ్మడి జాబితా అంశాలపై ఖర్చు చేస్తోందని, ఇందులో 25 శాతం తగ్గించి, ఆ రూ.2.21 లక్షల కోట్లను నేరుగా రాష్ట్రాలకు బదిలీ చేయాలని సూచించారు. ప్రస్తుతం సెస్‌లు, సర్‌ఛార్జీల వాటా కేంద్ర పన్ను రాబడిలో 20 శాతానికి చేరిందని, దీని వల్ల 15వ ఆర్థిక సంఘం 41 శాతం పన్ను బదిలీని సిఫార్సు చేసినప్పటికీ రాష్ట్రాలకు కేవలం 30 శాతం మాత్రమే అందుతోందని డిప్యూటీ సిఎం కేంద్రం దృష్టికి తీసుకువచ్చారు. దాదాపు రూ.1,55,000 కోట్ల సర్ ఛార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించాలని లేదా వాటిని ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని సూచించారు. తెలంగాణలో ప్రాంతీయ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) ప్రాజెక్టును నిదులను తక్షణమే మంజూరు చేయాలని, హైదరాబాద్ మెట్రో ఫేజ్ –2కు సంబంధించి త్వరగా నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాలని, హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటును ప్రకటించాలని, మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సిఎం కేంద్రాన్ని కోరారు. పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలను మంజూరు చేయాలని, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పిఆర్‌ఎల్‌ఐ) ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ.14,100 కోట్లు, రేడియల్ రోడ్ల కోసం రూ.45,000 కోట్లు, హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ.17,212 కోట్లు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్ర అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నామన్నారు.

# జి రామ్ జి చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

**18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలి : సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి**

**ఎర్రజెండాలతో ఎరుపెక్కిన పెద్దపల్లి**



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన జిరాంజీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం నేతృత్వంలో పెద్దపల్లి కేంద్రంలోనీ జూనియర్ కళాశాల గ్రౌండ్ నుండి ఎర్రజెండాలతో వందలాదిమంది సిపిఐ కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం సిరి ఫంక్షన్ హాల్లో సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, కలవేన శంకర్ హాజరై మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డపై 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ముగింపు బహిరంగ సభ జనవరి 18న ఖమ్మంలో సభ ఏర్పాటు చేస్తున్నట్లు దానిని జిల్లాలోని పార్టీ ప్రజా సంఘాలు ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో జరిగే అనేక పోరాటాలకు భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించిందని నాటి స్వతంత్ర పోరాటం నుండి నేటి వరకు ప్రతి పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర ప్రధానంగా ఉందని వారు అన్నారు. కానీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మూడోసారి గెలిచిన బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని జిరాంజీ అనే పేరుతో చట్టం చేసి గతంలో 90 శాతం నిధులు కేంద్రం ఇచ్చే పరిస్థితి ఉంటే నేడు దాన్ని 60 శాతానికి కుదించి మిగతా 40 శాతం రాష్ట్రమే భరించుకునే విధంగా చట్టాన్ని చేసి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం లేకుండా చేయాలనే కుట్రలు పన్నుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ దేశంలో కార్మికుల హక్కులను కాలరాస్తూ 44 చట్టాలు ఉంటే నాలుగు కోట్లుగా విభజించి దుర్మార్గపు పాలన చేస్తున్న మోడీ ప్రభుత్వం జిరాంజీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం చేస్తూ ఎల్ఐసి లాంటి సంస్థల నిధులను కార్పొరేట్లకు దారతత్వం చేసి దుర్మార్గపు పాలన చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోసిక మోహన్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.కనకరాజు, తాళ్లపల్లి మల్లయ్య ,కడారి సునీల్, మడ్డి ఎల్లయ్య, మార్కపురి సూర్య, తాళ్లపల్లి లక్ష్మ ణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పూసాల రమేష్, బాలసాని లెనిన్, రేణిగుంట్ల ప్రీతం, ఆరేపల్లి మానస్, కల్లేపల్లి నవీన్, కన్నం లక్ష్మి నారాయణ, మాటేటి శంకర్, శనిగరపు చంద్రశేఖర్, రాజారత్నం, ఆసాల రమ, తొడుకునూరి రమేష్ కుమార్, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతరాలు లేని సమాజ నిర్మాణమే సిపిఐ ధ్యేయం

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు**

**హనుమకొండలో జనసేవా దళ్ శిక్షణా శిబిరం**



**ప్రజాపక్షం/హనుమకొండ:** అంతరాలు లేని సమ సమాజ నిర్మాణమే సిపిఐ ధ్యేయం అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాలలో పాల్గొననున్న హనుమకొండ జిల్లా జనసేవా దల్ వాలంటీర్ల శిక్షణా శిబిరం శనివారం హనుమకొండ కుమార్‌పల్లిలోని యూత్ భవన్ జరిగింది. ఈ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థలో పేదలు, ధనికుల మధ్య తారతమ్యం పెరుగుతూ పోతున్నదని, అయినా పాలకులు పేదల అభివృద్ధిని విస్మరించి కార్పొరేట్, పెట్టుబడిదారీ శక్తుల కోసమే పని చేస్తున్నారని అన్నారు. ఒకే దేశంలో ఒకేసారి స్వాతంత్ర్యం వచ్చిన ప్రజల మధ్య రోజూ వారి ఆదాయం వ్యత్యాసం వేల రెట్లు ఎక్కువగా ఉందని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు. కేంద్రంలో గత పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేందుకే పని చేసిందని, తిరిగి మరోసారి వారి అండతోనే అధికారంలోకి వచ్చి వారి మేలుకోసమే పనిచేస్తున్నదని విమర్శించారు. పేదలు, మధ్య తరగతి వర్గాల ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. దళితుల, గిరిజనుల, మైనారిటీలపై బీజేపీ పాలిత రాష్ట్రాలలో దాడులు పెరిగాయని, చివరకు రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలను కూడా ధ్వంసం చేసే ప్రయత్నం చేశారన్నారు. కమ్యూనిస్టులు, లౌకిక శక్తులతోనే ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణ సాధ్యమని, గడిచిన లోక్‌సభ ఎన్నికలలో దేశ ప్రజలు మోడీకి గుణపాఠం చెప్పినా ఆయన వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ శిక్షణా శిబిరానికి ఇన్‌స్ట్రక్టర్‌గా జనసేవా దల్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్ వ్యవహరించగా కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్.అశోక్ స్టాలిన్, కర్రె లక్ష్మ ణ్, ఉట్కూరి రాములు, ఏదునూరి వెంకట్రాజం, మునిగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్, కొట్టెపాక రవి, మంచాల రమాదేవి, మాలోతు శంకర్, యాళ్ల సంజయ్, ఎం.శ్యామ్ సుందర్ రెడ్డి, కండె నర్సయ్య, కామెర వెంకటరమణ, గుంటి రాజేందర్, గడ్డం లలిత, కొత్తపల్లి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ జర్నల్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జర్నలిస్టుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ రూపొందించిన ప్రెస్‌క్లబ్ జర్నల్‌ను మంత్రి శనివారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ప్రతినెలా ప్రెస్‌క్లబ్ జర్నల్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన సమకాలీన అంశాలను ఈ జర్నల్‌లో పొందుపరచడం సంతోషకరమన్నారు. ఇటువంటి ప్రయత్నాలు మీడియా వర్గాలకు ఉపయోగకరంగా ఉండటంతో పాటు వృత్తి నైపుణ్యాన్ని మరింత పెంపొందిస్తాయని తెలిపారు. ప్రెస్‌క్లబ్ నూతన పాలకమండలి ఏర్పడి కేవలం మూడు నెలలే అయినప్పటికీ, జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి దిశగా పలు కార్యక్రమాలను చేపట్టామని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్.విజయకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు రాజేష్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రటరీ చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి రమేష్ వైట్ల, కార్యవర్గ సభ్యులు శంకర్ శీగ, ఎన్. ఉమాదేవి, రచన ముదుంబై, వనం నాగరాజు, అమిత్ బట్టు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సమస్యలపై నిత్యపోరాట చరిత్ర ఐఎఎల్‌ది




**దుస్సా జనార్ధన్‌ను రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులుగా గెలిపించాలని ఐఎఎల్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ పిలుపు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** న్యాయవాదుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన సంక్షేమం కోసం నిరంతరం ఉద్యమిస్తున్న ఐఎఎల్ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ అభ్యర్థి దుస్సా జనార్ధన్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర అధక్షుడు బొమ్మగాని ప్రభాకర్ కోరారు. హైదరాబాద్‌లోని అమృత ఎస్టేట్స్‌లో శనివారం ఐఎఎల్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలోని న్యాయవాదుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న చరిత్ర ఐఎఎల్‌కు ఉందన్నారు. ఈ చరిత్రాత్మకమైన సంఘానికి నాయకుడైన దుస్సా జనార్ధన్ పోరాట రంగంలో ముందున్నారన్నారు. బార్ కౌన్సిల్ సభ్యులుగా మొదటిసారి ఎన్నికైనప్పుడు రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఆయన ఉద్యమాలు చేశారని తెలిపారు. న్యాయవాదుల వృత్తి నైపుణ్యతకు ఐఎఎల్ ఆధ్వర్యంలో నిరంతర శిక్షణ తరగతులు నిర్వహించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. దుస్సా జనార్ధన్ గెలించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కమిటీలు, ఐక్యంగా శక్తి వంచన లేకుండా కృషి చేయాలని బొమ్మగాని ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఐఎఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి.కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే ఐఎఎల్ అభ్యర్థుల పట్ల మంచి అభిప్రాయం ఉందని, జూనియర్, సీనియర్ న్యాయవాదులంతా జనార్ధన్ గెలుపు కోసం మరింత కృషి తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు కెవిఎల్, పి.రాములు, గుర్రం రాజశేఖర్‌రెడ్డి, ఓరుగంటి శేషగిరిరావు, పరమేశ్, బొమ్మగాని శ్రీనివాస్, బత్తిని రాము, టి.మురళి, రాజారామ్, మల్లేపల్లి ఆది రెడ్డి, బి.భగత్‌సేన్, విల్సన్, మారగోని అనిత, కె.వీరబాబు పాల్గొన్నారు.

# కార్మికుల శ్రమ దోపిడీ




**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్స్, స్కావెంజర్లకు ప్రభుత్వం నెలకు రూ.26వేల వేతనాన్ని చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల సర్వీస్ పర్సన్స్, స్వీపర్ యూనియన్ (ఎఐటియుసి) సమావేశాన్ని యూనియన్ అధ్యక్షులు మాసన్న అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్లకు, స్కావెంజర్లకు రాష్ట్ర వ్యాపితంగా ఒకే రకమైన వేతనాలను చెల్లించకుండా, కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామని, అందరికీ గౌరవ ప్రదమైన వేతనాలు చెల్లిస్తామని చేస్తున్న ప్రభుత్వ ప్రకటనలకు, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి చెల్లిస్తున్న వేతనాలకు పొంతన లేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు, స్కావెంజర్లకు వేతనాలను ప్రతి నెలా 1వ తేదీన నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వారందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఎండకాలం సెలవులలో టీచర్లకు వేతనాలు చెల్లిస్తూ స్వీపర్లకు, స్కావెంజర్లకు మధ్యాహ్న భోజన వంట కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడం ప్రభుత్వ దివాళా కోరు తనానికి నిదర్శనమన్నారు. సర్వీస్ వర్కర్స్కు స్వీపర్లను 240 రోజులు పనిచేస్తే పర్మినెంట్ చేయాలన్న సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూముల ఇండ్లు ఇవ్వాలని, కార్మికులందరికీ యూనిఫాం ఇవ్వాలని, సంవత్సరానికి 20 రోజులు సెలవులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య, ఎన్.కరుణ కుమారి, రాంమూర్తి, చక్రపాణి, జి.సురేష్, టి.రమేష్, రాంచంద్రయ్య, కె.శోభారాణి, ముస్తఫ్ఫా పాల్గొని ప్రసంగించారు.

## అనుచిత వ్యాఖ్యలు ఆందోళనకరం

**మహిళా ఐఎఎస్ అధికారిపై వచ్చిన అసభ్య, అనుచిత ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం: మంత్రి సీతక్క**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా ఐఏఎస్ అధికారులను లక్ష్యంగా చేసుకుని కొంతమంది వ్యక్తులు, కొన్ని మీడియా వేదికలు అసభ్యంగా, అనుచితంగా, దూషణాత్మకంగా వార్తలు, వ్యాఖ్యలు చేయడం అత్యంత ఆందోళనకరమైన విషయం అని తెలంగాణ పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజాసేవలో నిమగ్నమైన మహిళా ఐఏఎస్ అధికారుల గౌరవాన్ని దెబ్బతీయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆమె అన్నారు. మహిళలు ఉన్నత స్థాయిలకు చేరితే వాటిని తట్టుకోలేని ఫ్యూడల్ మానసికతే ఈ రకమైన దుష్ప్రచారాలకు మూలమని ఆమె విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తోందని, అటువంటి పరిస్థితుల్లో మహిళా అధికారులను కించపరిచే వ్యాఖ్యలను, వారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రచారాన్ని సహించబోమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ తరహా దూషణలు, అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని సీతక్క హెచ్చరించారు.

**ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల సంఘాలు ఖండన**

ఎన్‌టివి ఛానల్లో ఇటీవల ప్రసారమైన ఒక కార్యక్రమంలో విధి నిర్వహణలో ఉన్న మహిళా ఐఏఎస్ అధికారిపై చేసిన వ్యాఖ్యలను ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఆ కార్యక్రమంలో చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యమైనవిగా, ఆధారాలు లేనివని అధికారులు పేర్కొన్నారు. పోస్టింగ్‌లు, విధి నిర్వహణ, వ్యక్తిగత అంశాలకు సంబంధించినట్టు చేసిన వ్యాఖ్యలు అధికారుల గౌరవ మర్యాదలకు, వారి గోప్యతకు, వృత్తిపరమైన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని తెలిపారు. జర్నలిజం పేరుతో నిర్ధారణలేని ఆరోపణలను వార్తలుగా ప్రసారం చేయడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. సంబంధిత మహిళా అధికారులకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పి, ఆ కంటెంట్ తొలగించాలని డిమాండ్ చేశారు. మహిళా అధికారుల గౌరవాన్ని కాపాడేందుకు తమ సహచర అధికారులకు పూర్తి మద్దతు ఇస్తామని ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల సంఘాలు పేర్కొన్నాయి.




# ప్రజాస్వామ్య పథంలోకి పార్టీ (1947-1958)

స్వతంత్ర భారతదేశంలో తొలి దశాబ్దం భారత కమ్యూనిస్టు పార్టీ ప్రస్థానంలో ఉజ్వల ఘట్టమనవచ్చు. వలసపాలన కాలంలో బ్రిటిషు పాలకుల నుంచీ, తప్పు విధానాల స్వయం కృతాపరాధం వల్ల అనుభవించిన కష్టనష్టాలు, ప్రాణత్యాగాలనుంచి దిద్దుబాటు చర్యలతో తేరుకున్న పార్టీ 1952 తొలి సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొన్నది. సిపిఐ పార్లమెంటులో కాంగ్రెస్ తర్వాత రెండవపార్టీగా ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. సిపిఐ అభ్యర్థి రావి నారాయణరెడ్డికి ఆ పార్లమెంటు ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక ఓట్లు పోలైనాయి. పండిట్ నెహ్రూది రెండవస్థానం. నెహ్రూ ఆర్ఎన్ చేత పార్లమెంటు సభామందిరం ప్రారంభోత్సవం చేయించారు. ఆ ఎన్నికల్లో సిపిఐకి మొత్తం 55 లక్షల ఓట్లు పోలు (5.2శాతం) కాగా 27 లోక్‌సభ స్థానాలు లభించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో 6.2 శాతం ఓట్లు పోలైనాయి. 'బూర్జువావర్గ ఎన్నికలు' బూటకం అన్న బిటిఆర్ ఒంటెత్తు పంథా తప్పు అని ఈ ఎన్నికలు నిరూపించాయి. 1957 సార్వత్రిక ఎన్నికల్లో కూడా సిపిఐకి పోలైన ఓట్లు 1 కోటి 20 లక్షలకు (10.9 శాతం) పెరిగాయి, సీట్లు 30కి చేరాయి. అసెంబ్లీల్లో కూడా ఓట్లు, సీట్లు పెరిగాయి. అసోంలో 10, పంజాబ్‌లో 14, పశ్చిమబెంగాల్‌లో 18, ఆంధ్రాలో 27 శాతం, కేరళలో 40శాతం ప్రత్యేకించి గమనించదగినవి. ఆంధ్రలో 1955 మధ్యంతర ఎన్నికల్లో అధికారంలోకి వచ్చే వాతావరణంలో, పార్టీ ఒంటెత్తు ఎత్తుగడలు, ప్రత్యర్థులందరూ ఐక్యం కావటం వల్ల తీవ్రమైన ఎదురుదెబ్బ తగిలింది. కేరళలో 1957లో కమ్యూనిస్టు పార్టీ బ్యాలెట్ ద్వారా అధికారం చేబట్టి సిద్ధాంతానికి సరికొత్త కోణం సమకూర్చింది.




అమృత్‌సర్ మహాసభలో పాల్గొన్న ముఖ్య నాయకులను చిత్రంలో చూడవచ్చు

1951 అక్టోబర్‌లో కలకత్తాలో అజ్ఞాతంగా జరిగిన పార్టీ మహాసభ పార్టీ చరిత్రలో మలుపు. పార్టీ వైఖరుల సాధారణీకరణను మొదలుపెట్టింది. '1948 లైన్' మార్పు క్రమం 1949 చివరలో ప్రారంభమై 1952లో ఎన్నికల్లో పాల్గొనాలని పార్టీ నిర్ణయించేవరకు పరిసమాప్తమైంది. అది తొలిసారి పూర్తిస్థాయి 'పార్టీ కార్యక్రమం' ఆమోదించింది. 1951 అక్టోబర్‌లో అజయ్‌ఘోష్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికోబడ్డారు. 1952 డిసెంబర్ 30 నుంచి 1953 జనవరి 10 వరకు జరిగిన కేంద్ర కమిటీ విస్తృత ప్లీనం శాంతికై పోరాటం విషయంలో గత వైఖరిని మార్చుకుని శాంతి కోసం పోరాటాన్ని పార్టీ కీలకమైన కర్తవ్యంగా నొక్కిచెప్పింది. సోవియట్ యూనియన్, చైనాలతో వృద్ధిచెందుతున్న మైత్రిని వక్కాణించింది. పంచవర్ష ప్రణాళిక పట్ల వ్యతిరేక వైఖరి కూడదని చెప్పింది. ఆంధ్రలో ప్రజా ఉద్యమం దృష్ట్యా, భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటును స్వాగతించింది.

1953లో మదురైలో జరిగిన మూడవ పార్టీ కాంగ్రెస్ స్వతంత్ర ప్రజా ఉద్యమంగా వృద్ధిచెందిన ప్రపంచ శాంతి ఉద్యమాన్ని పార్టీ స్వాగతిస్తూ, మూడవ ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లకుండా అది నిరోధక శక్తిగా పనిచేస్తుందని భావించింది. శాంతి ఉద్యమంలో భారతదేశం పాత్రను, నెహ్రూ ప్రభుత్వ దోహదకారి చర్యలను హర్షించింది. గోవా, పుదుచ్చేరి విముక్తి పోరాట ఉద్యమం ప్రాముఖ్యతను వక్కాణించింది. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం కోసం దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమం నిర్మించాలని నిర్ణయించినట్లు అజయ్‌ఘోష్ తెలిపారు. రైతు సంఘంతో సంబంధం లేకుండా వ్యవసాయ కార్మికులను విడిగా ఆర్గనైజ్ చేయాలని నిర్ణయించారు.

భాష ప్రాతిపదికపై రాష్ట్రాలను పునర్‌నిర్మాణం చేయాలని సిపిఐ 1954లోనే కేంద్ర కమిటీ సమావేశంలో తీర్మానం ఆమోదించింది. అందుకు జరుగుతున్న జాప్యం పట్ల విచారం వ్యక్తం చేసింది. ప్రజా ఒత్తిడి కింద కేంద్ర ప్రభుత్వం రీ ఆర్గనైజేషన్ కమిషన్ ఏర్పాటు చేశాక, 19 రాష్ట్రాలు ఏర్పాటు చేయాలని, జాప్యం చేయకుండా 1954 సెప్టెంబర్ ఆఖరులోపు నివేదిక ఇవ్వాలని కమిషన్‌ను పార్టీ డిమాండ్ చేసింది. రాజ్ ప్రముఖ్ వ్యవస్థను, మాజీ రాజులకు చెల్లిస్తున్న రాజభరణాలు తదితర ప్రత్యేక సదుపాయాలు రద్దుచేయాలని కోరింది.



అమృత్‌సర్ మహాసభలో వేదికనలంకరించిన నాయకులు

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు డిమాండ్ స్వాతంత్ర్య పోరాటంలో భాగం. కాంగ్రెస్ పార్టీ తమ పార్టీ నిర్మాణాన్ని భాషా ప్రావిన్సుల ప్రాతిపదికగా పునర్నిర్మించాలని 1921లోనే తీర్మానించింది.

### పార్టీ వైఖరిలో కీలకమైన మలుపు

1955 జూన్ 14–26 తేదీల్లో ఢిల్లీలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం సిపిఐ చరిత్రలో అత్యంత ముఖ్యమైన సైద్ధాంతిక – రాజకీయ మైలురాయి. అది ఆమోదించిన పత్రాలు భారతదేశ పరిస్థితిపై సమగ్ర విశ్లేషణను, పార్టీకి స్పష్టమైన వ్యూహాత్మక మార్గదర్శకాలు అందించాయి. సిపిఐ పునరుజ్జీవనంలో అది కీలకమైన పత్రం. పార్టీ తొలిసారి జాతీయ ఆర్థిక వ్యవస్థ పునర్‌నిర్మాణానికై సత్వర పారిశ్రామికీకరణను, భూ సంస్కరణలను చేపట్టాలని కోరింది. ప్రభుత్వ రంగాన్ని, భారీ పరిశ్రమలను, పంచవర్ష ప్రణాళికను పార్టీ బలపరిచింది. ప్రభుత్వరంగానికి జనసంఘ్–ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని మితవాద శక్తులతో పాటు మరీ అతివాదులు కూడా వ్యతిరేకం. ప్రజా(మాస్) కమ్యూనిస్టు పార్టీ, ప్రజా ప్రజాస్వామిక సంఘటన రెండూ అంతర్ సంబంధం కలిగినవిగా పేర్కొంటూ వాటి నిర్మాణానికి మార్గదర్శకాలు పొం దుపరిచింది. ఈ తీర్మానం ''ఐక్యత – పోరాటం'' భావనను సృజనాత్మకంగా అభివృద్ధి చేసింది. ప్రభు త్వ పథకాలు, ప్రాజెక్టులకు దూరంగా ఉండటం మానుకోవాలంటూ అదే సమయంలో వాటి సక్రమ అమలుకు ప్రజలను సమీకరించాలని కోరింది.

### సిపిఎస్‌యు 20వ కాంగ్రెస్ ప్రభావం

పార్టీ విశాల దృక్పథంతో, మరింత వెసులుబాటు వైఖరులు చేబట్టడానికి మార్క్సిస్టు సిద్ధాంతం ఆచరణ అభివృద్ధి చేయడానికి అనేక ప్రపంచ ఘటనలు తోడ్పడ్డాయి. 1956లో జరిగిన సిపిఎస్‌యు (సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ) 20వ కాంగ్రెస్‌తో ఆ క్రమం ఆరంభమైంది. ఆ కాంగ్రెస్ డీస్టాలినైజేషన్‌తోపాటు పార్లమెంటరీ పంథా ద్వారా సోషలిజంలోకి శాంతియుత పరివర్తన, జాతీయ ప్రజాస్వామిక విప్లవం గూర్చి కొత్త భావన వగైరాలు ముందుకు తెచ్చింది. 1956లో పాల్ఘాట్‌లో జరిగిన సిపిఐ 4వ కాంగ్రెస్‌లో చర్చలు, సిపిఎస్‌యు కాంగ్రెస్ నిర్ణయాల చుట్టూ కేంద్రీకరించాయి. సిపిఐ, 'వ్యక్తి పూజ'ను వ్యతిరేకిస్తూనే, సోవియట్ సమాజ నిర్మాణంలో స్టాలిన్ పాత్రపై సిపిఎస్‌యు వైఖరిపై మరింత అధ్యయనం చేయాలని సిపిఐ కాంగ్రెస్ భావించింది.

1957లో కేరళలో బ్యాలెట్ ద్వారా కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి రావడం అత్యంత ప్రాముఖ్యత గల ఘటన. చరిత్రలో అటువంటి తొలి దృష్టాంతం 1953లో గయానాలో పీపుల్స్ ప్రోగ్రెసివ్ పార్టీ ఎన్నికల ద్వారా అధికారంలోకి రావడం. రాడికల్ పరివర్తనకు ఎన్నికలు, పార్లమెంటరీ సంస్థలను ఉపయోగించుకునే అవకాశాలపై విస్తృత చర్చకు కేరళ తెరతీసింది. రాడికల్ చర్యలు అమలు చేయడానికి బూర్జువా రాజ్యాంగాన్ని ఉపయోగించుకోగలమా అని అంతకుముందున్న అనుమానాలను కేరళ అనుభవం పటాపంచలు చేసింది. కేరళ ఫలితాలు: ''భారతదేశంలోని కమ్యూనిస్టు ఉద్యమానికే గాక యావత్ ప్రపంచానికీ ఒక కొత్త అంశం, కొత్త ప్రయోగం'' అని సిపిఐ ప్రకటించింది.

### నిబంధనావళిలో కొత్త పుంతలు : ఐదవ (అసాధారణ) కాంగ్రెస్, అమృత్‌సర్ 1958

1958 ఏప్రిల్ 6–13 తేదీల్లో జరిగిన అమృత్‌సర్ పార్టీ కాంగ్రెస్ సిపిఐ చరిత్రలో పలు విధాల మైలురాయి. అది పార్టీకి పునరుత్సాహం తెచ్చింది. పార్టీ సిద్ధాంతం, ఆచరణలో, దాని సంస్థాగత నిర్మాణం, నిబంధనావళిలో వ్యవస్థాగతంగా అనేక కొత్త లక్షణాలు ప్రవేశపెట్టింది. వాటిలో కొన్ని ప్రపంచంలోనే మొదటిసారి నిర్ణయాలు. కేరళ అనుభవం వెలుగులో ఈ నిర్ణయాలు మార్క్సిజం థియరీకి కొత్త లక్షణాలను చేర్చాయి.

**ఇది అసాధారణం ఎందుకంటే, ఒకటి, పార్టీ నిబంధనావళిలో ముఖ్యమైన మార్పులు చేసింది; రెండు, మాస్ కమ్యూనిస్టు పార్టీకి పిలుపు ఇచ్చింది; మూడు, పాల్ఘాట్ కాంగ్రెస్ సూత్రీకరణలను ముందుకు తీసుకెళ్లింది; రాజకీయ తీర్మానం, ఇతర పత్రాల్లో అనేక రాజకీయ సైద్ధాంతిక భావనలు వక్కా–ణించింది. నాలుగు, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రభావవంతమైన మార్పుల నేపథ్యంలో మహాసభ జరి–గింది. ఐదు, కార్మిక వర్గ నియంతృత్వ భావనను పార్టీ విడనాడింది; ఆరు, భారతదే–శంలో భవిష్యత్ సోషలిజంలో ప్రతిపక్షపార్టీలు అస్థిత్వం కలిగి ఉంటాయని అది ఊహించింది; ఏడు, సోషలిజంలోకి పరివర్తనకు పార్లమెంటరీ సంస్థలను ఉపయోగించుకోవా–లని అది వక్కాణించింది.**

పార్టీ నిర్మాణంలో ప్రస్తుత మూడు అంచెల పద్ధతిని ఆమోదించింది అమృత్‌సర్‌లోనే. అవి– జాతీయ సమితి, కేంద్ర కార్యవర్గ కమిటీ, కేంద్ర కార్యదర్శి వర్గం. రాష్ట్రాలు, జిల్లాలకు కూడా వాటి పరిమాణాన్ని బట్టి ఇది అనుమతించబడింది.

కార్మికవర్గ నియంతృత్వం భావనను విడనాడిన ప్రపంచంలోని కొద్దిపార్టీల్లో సిపిఐ ఒకటి అయింది. మదురై పార్టీ కాంగ్రెస్ ఆమోదించిన నిబంధనావళి పీఠికలో ''కార్మిక వర్గ నాయకత్వంలో ప్రజాస్వామ్య రాజ్య స్థాపన కోసం, కార్మికవర్గ నియంతృత్వాన్ని సాధించటం కోసం.... సిపిఐ పని చేస్తుంది'' అని ఉంది.

వ్యక్తి స్వేచ్ఛ, వాక్, పత్రికా స్వేచ్ఛలు, అసోసియేషన్‌గా ఏర్పడే స్వేచ్ఛ, ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వారికి సైతం (రాజ్యాంగానికి బద్ధులై ఉన్నంతవరకు) రాజకీయ పార్టీలు పెట్టుకునే హక్కు వక్కాణించబడింది.

పార్టీ ఛైర్మన్ పదవి అవసరం లేదని తీర్మానించింది. మూడంచెల నిర్మాణ వ్యవస్థతోపాటు డిపార్టుమెంట్ లు, సబ్ కమిటీల ఏర్పాటుకు అవకాశం కల్పించింది. అజయ్ ఘోష్‌ను ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకుంది.

**పార్టీ నిబంధనావళి పార్టీ చిహ్నం, పతా కానికి సంబంధించి ముఖ్యమైన మార్పు చేసింది. సిపిఐ ఈనాటికీ ఆచరిస్తున్నది అదే. పార్టీ పతాకం నుంచి ఐదు కోణాల నక్షత్రం తొలగించబడింది. ఎరుపురంగులోని జెండామ–ధ్యలో అడ్డంగా సుత్తి కొడవలి ఉంటాయి.**

*(పార్టీలో చీలిక దిశగా ప్రయాణం రేపు)*

**– ఎమ్మెస్సార్**

తెలంగాణ ఎప్ సెట్ పోటీ పరీక్షల కోసం

## టి-సాట్ డిజిటల్ కంటెంట్

మే రెండవ తేదీ వరకు నిర్వహణ

సిఇఒ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే ఎప్ సెట్ 2026–27 పోటీ పరీక్షల కోసం టిసాట్ అందించే డిజిటల్ కంటెంట్ జనవరి 12వ తేది నుండి ప్రసారమౌతోందని టిసాట్ సిఇఒ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ విద్యను పూర్తి చేసుకొని ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విద్యను ఎంచుకునే విద్యార్థుల కోసం టిసాట్ నెట్‌వర్క్ నాణ్యత కలిగిన డిజిటల్ కంటెంట్ అందిస్తోందని, వచ్చే విద్యా సంవత్సరంలో ఆయా కోర్సులు ఎంచుకునే విద్యార్థులు పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు డిజిటల్ కంటెంట్ తోడ్పడుతుందన్నారు. పేద, మారుమూల ప్రాంత విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం టిసాట్ వేదికగా కంటెంట్ అందిస్తూ విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత సేవలందిస్తోందని, తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే ఎప్ సెట్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు ఈ నెల 12 నుండి మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బొటని, జువాలజీ తదితర సబ్జెక్టులకు సంబంధించి 112 రోజుల పాటు 450 పాఠ్యాంశ భాగాలను టిసాట్ విద్య ఛానల్ లో ఉదయం ఏడు గంటలకు, నిపుణ ఛానల్ లో సాయంత్రం ఏడు గంటలకు ప్రసారం చేయనున్నామని సిఇఒ తెలిపారు. ప్రసారాలు టిసాట్ శాటి లైట్ ఛానళ్లతో పాటు యాప్, యూట్యూబ్ లోనూ అందుబాటులో ఉంటాయని, విద్యార్థినీ, విద్యార్థులు డిజిటల్ పాఠాలను సద్వినియోగం చేసుకోవాలని వేణుగోపాల్ రెడ్డి కోరారు.



పురపాలక ఎన్నికల్లో ప్రజలు

## కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారు

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రానున్న పురపాలక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. రెండేళ్ల కాలంలో పట్టణాలలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, విడుదల చేసిన నిధుల వివరాలను కాంగ్రెస్ ప్రభుత్వం వివరించి ఓట్లు అడగాలని సవాలు విసిరారు. బిఆర్ఎస్ నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల నాయకుల సమావేశం హైదరాబాద్‌లో శనివారం జరిగింది. ఈ సమావేశంలో బిఆర్ఎస్ఎల్‌పి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు, మాజీ మంత్రులు జి.జగదీశ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, ఎంపి వద్దిరాజురవిచంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కేటాయించిన అభివృద్ధి కార్యక్రమాలకు మరోసారి శిలాఫలకాలు వేయడం తప్పితే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని ఒకటి కూడా లేదన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన అనేక మౌలిక వసతుల ప్రాజెక్టులు, రోడ్లు, కమ్యూనిటీ హాల్, మోడల్ మార్కెట్ల వంటి ప్రతి ఒక్క కార్యక్రమానికి నిధులు నిలిపివేయడంతో అన్ని కార్యక్రమాలూ అర్ధాంతరంగా ఆగిపోయాయని కెటిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

## టెక్నో పెయింట్స్ ప్రచారకర్తగా సచిన్ టెండూల్కర్

కంపెనీ చైర్మన్ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెయింట్స్ తయారీ రంగంలో టాప్ టెన్ స్థానంలో ఉన్న టెక్నో పెయింట్స్ అండ్ కెమికల్స్ ప్రచారకర్తగా ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ నియమితులయ్యారనీ ఆ కంపెనీ చైర్మన్ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దేశీయ పెయింట్స్ రంగంలో 25 ఏళ్లుగా సుస్థిర స్థానం సంపాదించి, ఎనిమిది రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న టెక్నో పెయింట్స్ సచిన్ చేరికతో దేశవ్యాప్తంగా విస్తరించాలని ముందుకెళ్తున్నట్లు తెలిపారు. అలాగే 2026–27లో ఐపిఒకు రానున్నట్టు, ఐపిఒ ద్వారా రూ.500 కోట్ల నిధులు సమీకరించనున్నట్టు వెల్లడించారు. బంజారాహిల్స్‌లోని ది లీలా హోటల్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెక్నో పెయింట్స్ ఇప్పటికే 1,250కి పైగా ప్రాజెక్టులు పూర్తి చేసిందని తెలిపారు. 180 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్, హాస్పిటాలిటీ రంగంలో ఉన్న భవనాలకు రంగులు అద్దిందని, వివిధ రాష్ట్రాల్లో ప్రస్తుతం 175 పెయింటింగ్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయన్నారు. అలాగే తెలంగాణలో 26,065 పాఠశాలలకు పెయింటింగ్ పనులు ప్రారంభం అయ్యాయని, 5 వేల మందికిపైగా నిపుణులైన పెయింటర్లు తమ కంపెనీ సేవల్లో నిమగ్నమయ్యారని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి నాణ్యత, సమయానికి ప్రాజెక్టులు పూర్తి చేయడం వల్లే మార్కెట్లో టాప్ బ్రాండ్‌గా నిలిచామని వెల్లడించారు. 2029–30 నాటికి రూ.2వేల కోట్ల స్థాయికి వెళ్లాలని లక్ష్యంగా చేసుకున్నామని శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సివిఎల్ఎన్ మూర్తి, డిప్యూటి సిఇఒ సాకేష్ రెడ్డి, దీప్తి, శివరెడ్డి, అనిల్ కొండూరి, శ్రీకాంత్‌రెడ్డి, హరీష్‌వర్మ పాల్గొన్నారు.




## రెడ్డిగాండ్ల బిసిలు కాదనటం సరికాదు

అయిత ప్రకాశ్‌రెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** కొంతమంది రాజకీయ దురుద్దేశంతో తాము బిసిలను కాదంటూ తమ సామజిక వర్గాన్ని అనేక రకాలుగా ఇబ్బందిపెడుతున్నారని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, రెడ్డి గాండ్ల సంఘం కన్వీనర్ కుంభం రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ తమ కులవృత్తిరీత్యా పూర్వీకులు గానుగ నూనె తీసూ జీవనోపాధి పొందేవారన్నారు. రెండేడ్లతో గానుగ తీయగా రెండేడ్ల గాండ్లోలుగా పేరు మారిందని, అది క్రమేణా రెడ్డిగాండ్లగా పిలుస్తున్నారని తెలిపారు. 1920 కులగణనలోనే నైజాం ప్రభుత్వం గాండ్ల వారిని బిసిలుగా నమోదు చేశారని స్పష్టం చేశారు. కానీ, ఇటీవల ఓ బిసి సంఘం నేత పాలూరి రామకృష్ణయ్య రెడ్డి గాండ్లు బిసిలుగా చలామణి అవుతున్నారనడాన్ని ఖండిస్తున్నామన్నారు. అంతేగాక, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటి సిఎం రోశయ్య ప్రభుత్వం రెడ్డి గాండ్లోళ్లు గాండ్ల కులస్థులేనని బిసి సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రొసీడింగ్ కూడా ఇచ్చిందని గుర్తుచేశారు. పాలూరి తన మాటలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెడ్డిగాండ్ల సంఘం నేతలు భాస్కర్‌రెడ్డి, వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాలకు

# చట్టసభల్లో ప్రాతినిధ్యం

మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వెనుకబడిన వర్గాలను చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించేలా చేయడమే రాహుల్ గాంధీ లక్ష్యమని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. తెలంగాణ సగర సంఘం క్యాలెండర్ మంత్రుల అధికారిక నివాసంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆలోచన మేరకు 100 ఏళ్ల తరువాత దేశంలో ఎక్కడలేని విధంగా శాస్త్రీయంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులగణన చేశారని అన్నారు. బిసిలలో ఒక్కో సామాజిక వర్గాలకు ఒక్కొక్క లక్ష్యాలు ఉండొచ్చు కానీ, సమయం వచ్చినప్పుడు బిసిలంతా ఏకతాటిపై రావాలని పిలుపునిచ్చారు. బిసిలు, ఎస్‌సిలు, ఎస్‌టిల సామాజిక వర్గాలు ఇద్దరు పిల్లల కన్నా ఎక్కువగా ఉండటం వల్ల రాజకీయాల్లో రాణించాలని ఉన్నా, నిబంధన అడ్డువచ్చి ఎన్నికల్లో పోటీలో చేయలేకపోతున్నారని, ఈ నిబంధన ఎత్తివేస్తే ఎక్కువమందికి అవకాశం వస్తుందని తన దృష్టికి వచ్చిందని, బిసి బిడ్డగా తాను క్యాబినెట్ సభ్యునిగా ఈ నిబంధన ఎత్తివేయాలని కేబినెట్‌లో మాట్లాడి ఒప్పించాలిగానన్నారు. బిసిలు రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు కృషి చేస్తామన్నారు. చట్ట సభల్లో సగర సామాజిక వర్గం ప్రాతినిధ్యం ఉండాలన్నారు. సగర కార్పొరేషన్ చైర్మన్ భవన నిర్మాణానికి కావాల్సిన నిధులకోసం ముఖ్యమంత్రితో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, సగర సంఘం అధ్యక్షుడు శేఖర్, చెన్నయ్య సాగర్, ఆస్కాని మారుతి, రవి, వెంకటస్వామి, రాములు, ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరుబాట

జాక్టో చైర్మన్ సదానందం గౌడ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉపాధ్యాయులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని జాక్టో చైర్మన్ జి. సదానందం గౌడ్ హెచ్చరించారు. కాచిగూడలోని ఎస్‌టియు భవన్‌లో శనివారం జరిగిన జాక్టో అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని సదానందం గౌడ్ విమర్శించారు. బదిలీలు, పదోన్నతులు, ఒకటో తేదీన వేతనాలు మినహా ఇతర ప్రధాన డిమాండ్‌లను ప్రభుత్వం విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే పీఆర్సీ సిఫార్సులు అమలు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి అమలు చేయాలని, బకాయి పడిన ఐదు డిఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆరోగ్య కార్డులు జారీ చేసి వాటిని సక్రమంగా అమలు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కోసం నెలకు రూ.1500 కోట్లను కేటాయించాలని, రిటైర్ అయిన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడల్, గురుకుల, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కెజిబివి, యుఆర్ఎస్ ఉపాధ్యాయులకు సమ్మె కాలపు వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం జాక్టో ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధం కావాలని ఆయన ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జాక్టో ప్రధాన కార్యదర్శి కె. కృష్ణుడు, నాయకులు పి. రాజ భాను చంద్ర ప్రకాష్, కె. మల్లికార్జున్ రెడ్డి, పర్వత్ సత్యనారాయణ, జుట్టు గజేందర్, జయబాబు, సయ్యద్ అస్గర్, జి. నగేష్ యాదవ్, యు. విఠల్, మోనుద్దీన్, మీర్ ముంతాజ్, గీతాంజలి, శర్మ పాల్గొన్నారు.



తెలంగాణ 'విత్తన' విధానాలపై

## జార్ఖండ్ అధికారుల అధ్యయనం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో విత్తనాభివృద్ధి సంస్థ (టిఎస్ఎస్‌డిసి) అనుసరిస్తున్న విధానాలు, కార్యకలాపాలను అధ్యయనం చేసేందుకు జార్ఖండ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్, జెఎస్ఎడిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ భోర్ సింగ్ యాదవ్‌తో కూడిన ఐదుగురు అధికారుల బృందం తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, సంస్థ ఉన్నతాధికారులు,మేనేజర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో విత్తన ఉత్పత్తి విధానం, నాణ్యత నియంత్రణ వ్యవస్థ, రైతులకు సరసమైన ధరలకు నాణ్యమైన విత్తనాల సరఫరా, సంస్థ నిర్వహణలో అవలంభిస్తున్న ఆధునిక విధానాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ సాధిస్తున్న విజయాలు, అనుసరిస్తున్న ఉత్తమ ఆచరణలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని జార్ఖండ్ అధికారుల బృందం ప్రశంసించింది.రెండు రాష్ట్రాల మధ్య వ్యవసాయ రంగంలో పరస్పర సహకారం, అనుభవాల పరస్పర మార్పిడి ద్వారా రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చే దిశగా ఈ పర్యటన ఉపయోగకరంగా ఉంటుందని సమావేశంలో వారు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపునకు 'యువాఫ్లేర్ 26'



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** విద్యార్థుల్లో విద్యతోపాటు సాంస్కృతిక వ్యక్తీకరణ, జట్టు భావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే 'యువాఫ్లేర్ 26' లక్ష్యమని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.ఉమా జోసెఫ్ తెలిపారు. శనివారం బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కాలేజీలో వార్షిక యువ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ నటులు అర్జున్ సర్జా, వినయ్ వర్మ, నటి ఐశ్వర్య అర్జున్, సంగీత దర్శకులు, గాయకులు అనూప్ రూబెన్స్ హాజరయ్యారు. ప్రిన్సిపల్ ఉమా జోసెఫ్ మాట్లాడుతూ రేపటి సమాజానికి మార్గదర్శకులుగా ఎదగగల యువతను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా 'ఎక్స్‌ప్రెస్ టు ఎస్కేప్' అనే థీమ్‌తో జరిగిన ఈ వేడుకల్లో వివిధ కాలేజీల విద్యార్థులు సృజనాత్మకత ప్రతిభను ప్రదర్శించారు. విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు.

## ఎరువుల కొరత లేకుండా తగు జాగ్రత్తలు

మంత్రి పొన్నం

**ప్రజాపక్షం / హుస్నాబాద్:** నియోజకవర్గంలో రైతులకు ఎక్కడ ఎరువుల కొరత లేకుండ వ్యవసాయ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే రైతులు ఎరువుల కోసం ఎక్కడాక్యూలైన్లు కనిపించ వద్దని వ్యవసాయ అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ అదేశించారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మూడు జిల్లాల డి విఎఒ లు ఎడి లు,డిహెచ్ ఎస్ ఒలుఎఇఒలు విఎఒలు, హెచ్ ఒలు ,ఎఒలు అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. మండలాల వారిగా వ్యవసాయ అధికారులను రైతులకు అందుతున్న ఎరువులు, మరియు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులకు ఎప్పటికప్పుడు వివరించాలని కోరారు. ముఖ్యంగా రైతలకు నూతన యాంత్రీకరణ విధానం ,నూతన వరి వంగడాలు, అంతర్ పంటలు సాగుపై వారికి వివరించి అమలు చేసే విధంగా చూడాలని కోరారు.



సిఎం కప్ 2025లో

## క్రీడా సంఘాల భాగస్వామ్యం

**ప్రజా పక్షం /హైదరాబాద్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న రెండవ విడత సిఎం కప్ 2025 విజయవంతంలో క్రీడా సంఘాల సహకారం, సమన్వయం ఎంతో ముఖ్యమని తెలంగాణ రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒలంపిక్ అసోసియేషన్, క్రీడా సంఘాల సమన్వయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, మండల, అసెంబ్లీ నియోజకవర్గం, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో 44 క్రీడాంశాల్లో 5 అంచల్లో జరుగుతున్న క్రీడా పోటీలు విజయవంతం కావాలంటే, క్రీడా సంఘాల భాగస్వామ్యం తప్పనిసరి అని అన్నారు. దాదాపు దశాబ్ద కాలం పాటు నిర్లక్ష్యానికి గురైన క్రీడారంగం సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండేళ్లలోనే రెట్టింపు అభివృద్ధి వైపు కొనసాగుతుందన్నారు. వివిధ క్రీడా సంఘాలు, వివిధ జిల్లా సంఘాలు నిర్వహించే క్రీడా కార్యక్రమాలలో పాల్గొనడానికి రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన సిఎం కప్ 2024 విజయవంతంలో క్రీడా సంఘాల సహకారం ఎంతో ఉందని, అదే క్రీడా స్పూర్తితో క్రీడా సంఘాలు తమ సొంత కార్యక్రమంలా భావించి సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు, తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఎపి జితేందర్ రెడ్డి మాట్లాడుతూ సిఎం కప్ 2025 నిర్వహణలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సభ్యులు క్రియాశీలకంగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి, ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్.వేణుగోపాల చారి, కార్యదర్శి మల్లారెడ్డి, కోశాధికారి సతీష్ గౌడ్, వివిధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అల్మాంట్-కిడ్ సిరప్‌లో ప్రమాదకర రసాయనాలు

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** పిల్లల కోసం వినియోగించే అల్మాంట్‌కిడ్ సిరప్‌లో మోతాదుకు మించి ప్రమాదకర రసాయనాలు (ఇథిలీన్ గ్లైకాల్) ఉన్నట్లు గుర్తించామని, ఆ సిరప్‌ను వాడొద్దని తెలంగాణ ఔషధ నియంత్రణ మండలి (డిసిఎ) ప్రజలను హెచ్చరించింది. బిహార్‌కు చెందిన ట్రిడస్ రెమెడీస్ సంస్థ తయారు చేసిన ఎల్24002 బ్యాచ్ సిరప్‌లలో కల్తీ జరిగినట్లు బెంగాల్‌లో గుర్తించారని వెల్లడించింది. ఈ బ్యాచ్ సిరప్ ఎవరి వద్దనైనా ఉంటే వెంటనే వాడకం ఆపేయాలని, మార్కెట్‌లో దీని విక్రయాలను నిలిపివేయాలని తెలంగాణ డిసిఎ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం ఆదేశించారు. మందు పేరు అల్మాండ్ –కిడ్ సిరప్, బ్యాచ్ నంబర్ : ఎల్ 24002, తయారీ తేదీ: జనవరి2025గడువు తేదీ: డిసెంబర్ 2026 ఉంటుందని తెలిపారు.దీనిపై సమాచారం లేదా ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబరు 1800 5996969లో సంప్రదించాలని సూచించారు.

## హిజాబ్ ధరించిన మహిళ ప్రధాని కావాలన్నదే నా కల

సోలాపూర్ ర్యాలీలో ఒవైసీ వెల్లడి

**సోలాపూర్:** హిజాబ్ ధరించిన మహిళ ఎప్పటికైనా భారతదేశ ప్రధానమంత్రి కావాలన్నదే తన కల అని ఎఐఎంఐఎం అధినేత, పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం ఆయన మహారాష్ట్ర సోలాపూర్‌లో స్థానిక ఎన్నికల ప్రచార ర్యాలీలో ప్రసంగిస్తూ, ఒకే మతానికి చెందిన వ్యక్తి దేశానికి ప్రధానమంత్రి కావాలని పాకిస్థాన్ రాజ్యాంగం నిర్దేశించిందని, కానీ ఏ మతానికి చెందినవారైనా భారతదేశానికి ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి లేదా మేయర్ కావచ్చునని డా.బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగం చెబుతోందని గుర్తుచేశారు. హిజాబ్ ధరించిన కూతురు ఈ దేశానికి ప్రధానమంత్రి అయ్యేరోజు వస్తుందన్నదే తన కల అన్నారు. ఆ దేవుడి దయవల్ల ఆరోజు రావాలని ఆయన ఆకాంక్షించారు. ''నేను చాలా విశ్వాసంతో ఉన్నా, ఆ రోజు ఖచ్చితంగా వస్తుంది, ముస్లింలపై మీరు జల్లుతున్న విషయం ఎంతో కాలం కొనసాగదు'' అని అధికార బిజెపిని లక్ష్యంగా చేసుకుని ఒవైసీ వ్యాఖ్యానించారు. దేవేంద్ర ఫడ్నవీస్ (ముఖ్యమంత్రి), ఏక్‌నాథ్ షిండే (ఉపముఖ్యమంత్రి), అజిత్ పవార్ (ఎన్‌సిపి)లు నిలబెట్టిన అభ్యర్థులకు ఓటు వేయవద్దని ఆయన కోరారు. ఒవైసీ వ్యాఖ్యలపై బిజెపి ఎంపీ అనిల్ బొండే స్పందిస్తూ, ఆయన అర్ధసత్యాలు మాట్లాడుతున్నారన్నారు. హిజాబ్ ధరించడానికి ముస్లిం మహిళలు వ్యతిరేకమని, ఇరాన్‌లో మహిళలు హిజాబ్ ధరించేందుకు వ్యతిరేకంగా ఉన్నారని అన్నారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పందిస్తూ, భారతదేశంలో హిందూ నాగరికత ఉందని, ఎన్నటికీ ఒక హిందువే భారతదేశ ప్రధానమంత్రిగా ఉంటారని అన్నారు.

# సంక్రాంతికి అదనపు ప్రత్యేక రైళ్లు

సిపిఆర్ఒ ఎ.శ్రీధర్



ప్రజాపక్షం/హైదరాబాద్: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని సౌత్ సెంట్రల్ రైల్వే కీలక నిర్ణయం తీసుకున్నట్లు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ. శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని నియంత్రించడంతో పాటు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించేందుకు హైదరాబాద్ సిర్పూర్ కాగజ్‌నగర్, హైదరాబాద్ విజయవాడ మార్గాల్లో అదనపు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ఆయన చెప్పారు. జనవరి 10 నుంచి 19 మధ్య వివిధ తేదీల్లో ఈ ప్రత్యేక రైళ్లు నడవనున్నట్లు శ్రీధర్ తెలిపారు.

హైదరాబాద్ సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రత్యేక రైళ్లు..

హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు రైలు నం. 07473 ఉదయం 7.55 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.15 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలు జనవరి 11, 12 తేదీల్లో ప్రయాణిస్తుంది. అదే విధంగా సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు రైలు నం. 07474 మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి రాత్రి 10.20 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలు జనవరి 10, 11 తేదీల్లో నడుస్తుంది. ఈ రైళ్లు సికింద్రాబాద్, చర్లపల్లి, భువనగిరి, ఆలేర్, జనగాం, ఘనపూర్, కాజీపేట, ఉప్పల్, జమ్మికుంట, ఒడెల, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, గోదావరిఖని, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ స్టేషన్లలో ఆగుతాయి.

**హైదరాబాద్ విజయవాడ ప్రత్యేక రైళ్లు..**

హైదరాబాద్ నుంచి విజయవాడకు రైలు నం. 07475 ఉదయం 6.10 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.40 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలు ఈ నెల 11, 12, 13, 18, 19 తేదీల్లో ప్రయాణిస్తుంది. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు రైలు నం. 07476 మధ్యాహ్నం 2.40 గంటలకు బయలుదేరి రాత్రి 10.35 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలు ఈ నెల 10, 11, 12, 17, 19 తేదీల్లో నడుస్తుంది. ఈ ప్రత్యేక రైళ్లు సికింద్రాబాద్, చర్లపల్లి, భువనగిరి, జనగాం, ఘనపూర్, కాజీపేట, వరంగల్, నెకొండ, కేసముద్రం, మహబూబాబాద్, దోర్నకల్, ఖమ్మం, మధిర స్టేషన్లలో నిలుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. ఈ అన్ని ప్రత్యేక రైళ్లలో జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు మాత్రమే ఉంటాయని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఈ అదనపు రైళ్లను వినియోగించుకోవాలని సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ. శ్రీధర్ కోరారు.


# బెటాలియన్ సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** 15వ బెటాలియన్‌కు సంబంధించిన సమస్యలను న్యాయపరంగా పరిశీలించి, అతి త్వరలో పరిష్కరిస్తానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. మండల పరిధిలోని గంగారంలో గల 15వ బెటాలియన్‌లో నిర్వహించిన ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్ 2026 ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ యన్ పెద్దబాబు మంత్రి సీతక్కను సాధరంగా స్వాగతించి పుష్పగుచ్ఛం అందజేశా రు. అనంతరం మంత్రి 100 మీటర్ల పరుగు, టగ్ ఆఫ్ వార్ వంటి క్రీడా పోటీలను ప్రారంభించారు. వివిధ క్రీడా పోటీలలో ప్రతిభ చూపిన పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు బ హుమతులు అందజేశారు. మంత్రి సీతక్క మా ట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఉద్యోగరీత్యా ఎన్నో ఒత్తిడులను ఎదుర్కొంటారని, ఇలాంటి క్రీడా పోటీలు వారికి మానసిక ఉత్సాహం, శారీరక ఆరోగ్యం, పని ఒత్తిడి నుంచి ఉపశమనాన్ని కలిగిస్తాయని తెలిపారు. వివిధ కంపెనీల కంటిన్జెంట్లు నిర్వహించిన కవాతు తనను ఎంతగానో ఆకట్టుకుందని, అలాగే 15వ బెటాలియన్‌కు సంబంధించిన సమస్యలను న్యాయపరంగా పరిశీలించి అతి త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇ చ్చారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే మ ట్టా రాగమయి దయానందు మాట్లాడుతూ మం త్రి సూచించిన విధంగా బెటాలియన్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తాము పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో క మాండెంట్‌యన్ పెద్దబాబు మాట్లాడుతూ తెలంగాణ స్పెషల్ పోలీస్ అదనపు డీజీ సంజయ్ కు మార్ జైన్ ఆదేశాల మేరకు ఈ ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించామని తెలిపారు. ఇం దులో పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యు లు, మినిస్టీరియల్ స్టాఫ్, ఫోర్త్ క్లాస్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్కకు ఆయన కృతజ్ఞత లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఎసిపి వసుందర యాదవ్ ఐపీఎస్, అడిషనల్ కమాండెంట్ ఏ. అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్. శ్రీధరరాజ్, పి. వేణుగోపాల్ రెడ్డి, ఆర్ఐ లు, ఆర్ఎస్ఐలు, మినిస్టీరియల్ స్టాఫ్, హోంగార్డులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుల ధీరత్వాన్ని...
# యువత పుణికిపుచ్చుకోవాలి

**జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఉద్బోధ**



**న్యూఢిల్లీ :** భారతదేశం సరిహద్దుల వద్ద మాత్రమే కాకుండా దాడుల, అభివృద్ధిలలో బాధాకరమైన చరిత్రకు 'ప్రతీకారం తీర్చుకోవడానికి' అర్థవంతంగా సహా అన్నివిధాలుగా తనను తాను బలోపేతం చేసుకోవాలని జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ పేర్కొన్నారు. శనివారం ఇక్కడ జరిగిన 'వికసిత్ భారత్ యంగ్‌లీడర్స్ డైలాగ్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన గౌరవ అతిథిగా హాజరై ప్రసంగించారు. మనదేశ చరిత్ర నుంచి యువత పాఠాలు నేర్చుకోవాలని ఆయన యువతకు సూచించారు. ప్రతీకారం మంచిది కాదని దానిని ప్రేరణశక్తిగా మలుచుకోవాలని దోవల్ పిలుపు నిచ్చారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటాలు, త్యాగాలు చేసిన మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్ర బోస్, భగత్‌సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల ధీరత్వాన్ని యువత పుణికిపుచ్చుకోవాలన్నారు. 'మీరు స్వతంత్ర భారతదేశంలో జన్మించడం మీ అదృష్టం. నేను వలస రాజ్యాల భారతదేశంలో జన్మించాను. మన పూర్వీకులు స్వాతంత్ర్యం కోసం పోరాడే క్రమంలో అనేక కష్టాలు, ఇబ్బందులను ఎదుర్కొన్నారు' అని 81 ఏళ్ల మాజీ ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ దేశ వ్యాప్తంగా ఇక్కడకు వచ్చిన 3,000 మంది యువ ప్రతినిధులను ఉద్దేశించి ఉద్బోధించారు. భగత్ సింగ్ లాంటి వారిని ఉరితీశారని, సుభాష్‌చంద్ర బోస్ స్వాతంత్ర్యం కోసం తన జీవితాంతం పోరాడారని, మన కోసం స్వాతంత్ర్యం సంపాదించి పెట్టేందుకు మహాత్మాగాంధీ సత్యాగ్రహం చేయాల్సి వచ్చిందని అజిత్‌దోవల్ ఉదహరించారు. ప్రతీకారం అనేది మంచి పదం కాదు కానీ అది ఒక గొప్ప శక్తిగా ఉంటుంది. కేవలం మన సరిహద్దుల వద్దనే కాకుండా దేశంపై గతంలో జరిగిన అకృత్యాలకు ప్రతీకారం తీర్చుకోవాలని, తను కూడా బలోపేతం చేసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారినుద్దేశించి భవిష్యత్ నాయకులుగా అజిత్ దోవల్ పేర్కొంటూ బలమైన నాయకత్వం అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. దీనికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిరూపించారని అజిత్ దోవల్ పేర్కొన్నారు. నాయకత్వం ప్రాధాన్యతను నెపోలియన్ ఒకసారి ఇలా చెప్పారని ఉటంకించారు. 'ఒక గొర్రె నాయకత్వంలోని 1000 సింహాలకు నేను భయపడను. కానీ..ఒక సింహం నేతృత్వంలోని 1000 గొర్రెలకు మాత్రం తప్పకుండా భయపడతాను' అని నెపోలియన్ చెప్పిన గొప్ప మాటను ఎన్ఎస్ఏ సలహాదారు దోవల్ ఈ సందర్భంగా యువతకు గుర్తు చేశారు. మనది ఒక ప్రగతిశీల సమాజం అన్నారు. మనం ఇతర నాగరికతలపై లేదా వారి దేవాలయాలపై, ఏ దేశ ప్రజలపైనా దాడి మాత్రం చేయలేదన్నారు. కానీ భద్రత విషయంలో మనకు స్వీయ అవగాహన లేకపోవడంతో చరిత్ర మనకు ఒక పాఠం నేర్పిందని, అయితే మనం ఆ పాఠం నేర్చుకున్నామా? అని అజిత్ దోవల్ ప్రశ్నించారు. మనం ఆ పాఠాన్ని గుర్తుంచుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. ఎందుకంటే యువత దానిని మర్చిపోతే అది దేశానికే విషాదకరమన్నారు. ప్రపంచంలోని ప్రతీ సంఘర్షణ భద్రతా సమస్యల నుండే పుడుతుందని అజిత్ దోవల్ చెప్పారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి మన్సూఖ్ మాండవీయ యువకుల సమావేశంలో ప్రసంగించమని ఆహ్వానించడం తనకు ఆశ్చర్యపరిచిందని అజిత్ దోవల్ చెబుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. 'మీలో చాలా మంది నాకంటే కనీసం 60ఏళ్ల చిన్నవారు. నేను మీతో ఏమి చర్చించగలనని ఆలోచిస్తున్నాను. నా యవ్వనం చాలా కాలంగా ఉంది. మీ యవ్వనంలో ఏమిటో కూడా నాకు తెలియదు' అని అజిత్ దోవల్ చమత్కరించారు. నిర్ణయాత్మకంగా ఉండడని, ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండాలనే దృఢ నిశ్చయాన్ని కూడా కలిగి ఉండాలి' అని ఆయన సూచించారు. యువత సాంకేతికత, సైన్స్‌లో ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని కోరారు.

# ఎన్నికలప్పుడే ప్రతిపక్ష నేతలపై దాడులా?

**ఇడి చర్యను ప్రశ్నించిన కపిల్ సిబల్**



**న్యూఢిల్లీ :** ఎన్నికలు జరుగుతున్నప్పుడు మాత్రమే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రతిపక్ష నాయకులపై ఎందుకు చర్యలు తీసుకుంటుందోనని స్వతంత్ర ఎంపి కపిల్ సిబల్ శనివారం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దర్యాప్తు సంస్థల అధికార పరిధిపై తన ముందు పెండింగ్‌లో ఉన్న సమీక్ష పిటిషన్లను విచారించాలని సుప్రీం కోర్టును కోరారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో ఇడి చర్య వెనుక ఉన్న ఏకైక ఉద్దేశం ప్రతిపక్ష నాయకులను వేధించడమేనని, జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్, అసెంబ్లీ ఎన్నికల సమయంలో బిహార్‌లో లాలూ ప్రసాద్, తేజస్వి యాదవ్‌పై దర్యాప్తు సంస్థలు చర్య తీసుకున్న ఉదాహరణలను ఉదహరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఐప్యాక్‌పై దాడులు చేసిన తర్వాత ఇడి ఏమి దర్యాప్తు చేస్తోందని కూడా ఆయన ప్రశ్నించారు. దర్యాప్తు సంస్థ అన్ని పత్రాలను తీసుకెళ్లలేదన్నారు. బొగ్గు అక్రమ రవాణా కేసుకు సంబంధించి కోల్‌కతాలోని రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐప్యాక్ కార్యాలయం, దాని చీఫ్ నివాసంలో గురువారం ఇడి దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా ఇడి అధికారులు అడ్డంకులను ఎదుర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆ ప్రాంగణంలోకి ప్రవేశించి దర్యాప్తునకు సంబంధించిన 'కీలక' ఆధారాలను తీసుకెళ్లారని ఇడి ఆరోపించింది. కేంద్ర మాజీ మంత్రి కూడా అయిన కపిల్ సిబల్ మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వం తప్పుడు సమాచారం ఆధారంగా ఏ రాజకీయ పార్టీపైనా లేదా నాయకుడిపైనా విచారణ జరపలేదని, 2004 నుంచి 2014 మధ్య యుపిఎ అధికారంలో ఉన్నప్పుడు ఇడికి ఎప్పుడూ ఇంతటి స్వేచ్ఛ ఇవ్వలేదని తెలిపారు. 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయబడినప్పుడు అది దేశంలో ఎక్కడికయినా, ఎప్పుడయినా వెళ్లగల సర్వవ్యాప్త విచారణ సంస్థ అని మాకు తెలియదు. ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టడం, వారి ప్రభుత్వాలను కూల్చివేసేలా చేయడం వంటివి చేయగలదు. అది సమర్థించబడినా కాకపోయినా' అని ఆయన విలేకరులతో అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న పరిణామాలపై తాను బాధపడ్డానని పేర్కొంటూ, 'మన దేశ ఐక్యత, సమగ్రతకు భంగం కలగకూడదని నేను కోరుకుంటున్నాను' అని సిబల్ అన్నారు. ఈ సంఘటనల దృష్ట్యా, కేంద్రం రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించగలదా అని అడిగిన ప్రశ్నకు, 'ఎవరయినా ఎటువంటి ఆధారం లేకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకుంటే, అది కూడా పరిణామాలను కలిగి ఉంటుంది. వారు మూడింట రెండు వంతుల మెజారిటీతో గెలిస్తే, నాలుగింట మూడు వంతుల విజయం ఉంటుంది' అని తెలిపారు. 'అన్ని సమస్యలను సుప్రీం కోర్టు పరిశీలించాల్సిన సమయం వచ్చింది. లేకపోతే, సమాఖ్య వ్యవస్థ కుప్పకూలిపోతుంది. ఇది ప్రజలకు ఏ మాత్రం నచ్చదు' అని తెలిపారు. ఎక్కడ ఎఫ్ఐఆర్ నమోదయినా ఇడి అక్కడికి చేరుకుంటోందని, ప్రతిచోటా విచారణ జరిపే హక్కు తమకు ఉందని అది భావిస్తోందని ఆయన అన్నారు. 'ఎన్నికలు జరిగే చోట మాత్రమే ఇడి రంగంలోకి దిగడం కూడా ఆసక్తికరంగా ఉంది. ఎన్నికల సమయంలో ఇడి జార్ఖండ్‌కు చేరుకున్న విషయం గుర్తుండే ఉంటుంది. బిహార్‌లో కూడా అదే జరిగింది. ఎన్నికల సమయంలో ఇడి అక్కడికి చేరుకుంది. కోర్టు ఒక ప్రక్రియను ప్రారంభించింది. దీనివల్ల లాలూ ప్రసాద్, తేజస్వి యాదవ్ ఢిల్లీకి రావాల్సి వచ్చింది. దీంతో వారి ఎన్నికల ప్రచార షెడ్యూల్ దెబ్బతింది' అని తెలిపారు. 'ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు జరగనున్నందున ఇడి అక్కడికి చేరుకుంది' అని సిబల్ అన్నారు. ఐప్యాక్‌పై దాడుల సమయంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ఆటంకం కలిగించారని ఇడి చేసిన ఆరోపణల గురించి అడగ్గా, 'ఇడి ముందుగా తాము దేనిపై విచారణ జరుపుతున్నారో చెప్పాలి. వారు బొగ్గు కుంభకోణానికి సంబంధించిన పత్రాలను కోరుకుంటే, కనీసం వార్తాపత్రికలు అలానే నివేదిస్తున్నాయి. అప్పుడు వారు కంప్యూటర్లకు సంబంధించిన సమాచారం కోరి ఉండాల్సింది. మేము ఏమీ తీసుకోము. బొగ్గు కుంభకోణానికి సంబంధించిన సమాచారాన్ని అడుగుతాము. ఎన్నికల ప్రక్రియ సమయంలో అకస్మాత్తుగా వారికి పత్రాలు సేకరించాలనే ఆలోచన వచ్చింది. వారు గందరగోళం సృష్టించాలనుకుంటున్నారు. పశ్చిమ బెంగాల్‌లో వారు (బిజెపి) గెలవలేనందున టిఎంసిని, మమతా బెనర్జీని ఎలా ఇబ్బంది పెట్టాలన్నదే వారి ఉద్దేశం' అని అన్నారు. 'ఇడి దేవుడిలా సర్వవ్యాపి. ఇడి ఈ ప్రభుత్వానికి దేవుడు. అది ఏదైనా చేయగలదు. సిబిఐ కూడా అంతే' అని కపిల్ సిబల్ వ్యాఖ్యానించారు.

## జార్ఖండ్ కార్మికులు నైజర్‌లో కిడ్నాప్..
# 8 నెలల తర్వాత భారత్‌కు


**రాంచీ:** జార్ఖండ్‌కు చెందిన ఐదుగురు కార్మికులు పశ్చిమ ఆఫ్రికా దేశమైన నైజర్‌లోని ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నారు. ఆ దేశంలో వారు కిడ్నాప్ అయ్యారు. అయితే 8 నెలల తర్వాత సురక్షితంగా భారత్‌కు చేరుకున్నారు. జార్ఖండ్‌లోని గిరిదిహ్ జిల్లా బాగోదర్‌కు చెందిన ఫల్జిత్ మహతో, రాజు కుమార్, చంద్రిక మహతో, సంజయ్ మహతో, ఉత్తమ్ మహతో గత ఏడాది ఆఫ్రికా దేశమైన నైజర్ వెళ్లారు. ట్రాన్స్‌మిషన్ లైన్లు వేసే ఒక ప్రైవేట్ కంపెనీలో వారు పని చేస్తున్నారు. కాగా, 2025 ఏప్రిల్ 27న జార్ఖండ్‌కు చెందిన ఈ ఐదుగురు కార్మికులు నైజర్‌లో కిడ్నాప్ అయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న వారి కుటుంబాలు ప్రభుత్వ సహాయాన్ని కోరాయి. సిఎం హేమంత్ సోరెన్ ఆదేశాల మేరకు రాష్ట్ర వలస కార్మికుల నియంత్రణ అధికారులు నైజర్‌లోని ప్రైవేట్ కంపెనీని సంప్రదించారు. నైజర్‌లోని భారత రాయబార కార్యాలయం, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహాయంతో కిడ్నాపర్ల చెర నుంచి వారిని విడిపించారు. మరోవైపు సుమారు 8 నెలల తర్వాత నైజర్‌లో కిడ్నాపైన జార్ఖండ్ కార్మికులు జనవరి 9న విమానంలో ముంబై చేరుకున్నారు. ఆరోగ్య పరీక్షలు, అవసరమైన ప్రభుత్వ, చట్టపరమైన లాంఛనాల తర్వాత జనవరి 14న జార్ఖండ్‌లోని వారి సొంతూరు చేరుకుంటారని ఆ రాష్ట్ర వలస కార్మికుల నియంత్రణ అధికారి తెలిపారు.

## మా వారసత్వాన్ని భ్రష్టు పట్టించేందుకు
# సొంత వ్యక్తులు చాలు..

**లాలూ కుమార్తె రోహిణి ఆచార్య**

**పాట్నా:** ఆర్‌జెడి సుప్రీం లాలూప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య మరోసారి వార్తల్లోకి వచ్చారు. నేరుగా పేరు ప్రస్తావించకుండానే తన సోదరుడు, ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. తమ వారసత్వాన్ని నాశనం చేయడానికి సొంత వ్యక్తులే సరిపోతారని, బయట వ్యక్తుల అవసరమే లేదని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఎంతో కష్టపడి కుటుంబ వారసత్వాన్ని నిలబెట్టిన వారి మూలాలను చెరిపేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలు తనను దిగ్భ్రాంతికి గురిచేసినట్టు రోహిణి ఆచార్య తెలిపారు. అజ్ఞానం అనే ముసుగు ఉన్నప్పుడు అహంకారం తలకెక్కుతుందని, అప్పుడు వినాశక శక్తులు అప్రమత్తమై ఒక వ్యక్తి ఆలోచన, నిర్ణయాలను నియంత్రిస్తుంటాయని ఆక్షేపణ తెలిపారు. కాగా, ఇటీవల ముగిసిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్‌జెడి ఘోర వైఫల్యంతో లాలూ ఫ్యామిలీలో వివాదం మొదలైంది. ఈ ఎన్నికల్లో ఆర్‌జెడి 140 సీట్లలో పోటీ చేసి కేవలం 25 సీట్లకు పరిమితం కాగా, ఎన్‌డిఎ భారీ మెజారిటీతో గెలుపొందింది. బిజెపి 89, జెడి(యు) 85 సీట్లు గెలుచుకోగా, మొత్తం 243 మంది సభ్యుల అసెంబ్లీలో ఎన్‌డిఎ 200 మార్కును దాటింది. ఫలితాలు వెలువడిన మరుసటి రోజునే తాను రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్టు, తన కుటుంబంతో తెగతెంపులు చేసుకుంటున్నట్టు రోహిణి ఆచార్య ప్రకటించారు. పార్టీ దారుణ వైఫల్యంపై నాయకత్వాన్ని ప్రశ్నించినందుకు తన సోదరుడు తేజస్వి, ఆయన సన్నిహితుడు ఆర్‌జెడి ఎంపి సంజయ్ యాదవ్ తనను అవమానించారని, దాడికి కూడా ప్రయత్నించారని సంచలన ఆరోపణ చేశారు. ఆత్మగౌరవం విషయంలో తాను రాజీపడేది లేదన్నారు. అవమానభారంతో కుటుంబాన్ని, ఇంటిని విడిచిపెట్టాల్సి వచ్చిందని, తనను అనాథను చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన పరిస్థితి ఏ ఆడకూతురికీ రాకూడదన్నారు.

## రోబో శునకాలతో ఓట్ల వేట
# ఓటర్లకు భారీ కానుకల వెల్లువ



**పుణె:** మహారాష్ట్రలోని పుణె, పింప్రిచించ్వాడ్ సహా 29 మున్సిపల్ కార్పొరేషన్లకు జనవరి 15న పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు మునుపెన్నడూ లేని విధంగా అత్యాధునిక సాంకేతికతను వాడుతున్నాయి. ముఖ్యంగా ఓట్లు అడుగుతూ వీధుల్లో తిరుగుతున్న 'రోబోటిక్ డాగ్స్' అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఈ రోబో శునకాలకు పోస్టర్లను కట్టి కొందరు ప్రచారం నిర్వహిస్తుండగా... మరికొందరు కార్యకర్తలు ఎల్ఇడి (ఎల్ఇడి ) స్క్రీన్లను బ్యాక్‌ప్యాక్‌ల మాదిరిగా తగిలించుకుని అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్నారు. జనవరి 16న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ హైటెక్ ప్రచారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రచారానికి సమయం తక్కువగా ఉండటంతో అభ్యర్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై ఎక్కువగా ఆధారపడుతున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అయ్యేలా రీల్స్, వీడియోలు, కంటెంట్ సృష్టించడానికి ఏఐని వాడుతున్నారు. ఇది ఖర్చు తగ్గించడమే కాకుండా తక్కువ సమయంలో ఎక్కువ మందికి చేరువయ్యేలా చేస్తోంది. ఓటర్ల నాడిని విశ్లేషించేందుకు, ప్రజలతో సంభాషించేందుకు చాట్‌బాట్‌లను రంగంలోకి దించారు. లోహెగావ్, విమాన్ నగర్ వంటి ప్రాంతాల్లో అభ్యర్థులు డేటా ఆధారిత ప్రెజెంటేషన్లు ఇస్తూ... ప్రతి ఆరు నెలలకోసారి తమ ప్రగతి నివేదికను సమర్పిస్తామని ఓటర్లకు హామీ ఇస్తున్నారు. ఓట్ల వేటలో అభ్యర్థులు వినూత్న హామీలతో పాటు భారీ బహుమతులను ఎరగా వేస్తున్నారు. కొందరు అభ్యర్థులు లక్కీ డ్రా ద్వారా ఎస్‌యూవీ (ఎస్‌యూవీ)కార్లు, బంగారు ఆభరణాలు ఇస్తామని ప్రకటిస్తుండగా... విమాన్ నగర్ అభ్యర్థి ఏకంగా ఐదు రోజుల థాయిలాండ్ లగ్జరీ టూర్ ఆఫర్ చేశారు. లోహెగావ్‌ధనోరి వార్డులో ఒక అభ్యర్థి 1,100 చదరపు అడుగుల స్థలాన్ని బహుమతి గా ఇస్తానని వాగ్దానం చేశారు. కొందరు అభ్యర్థులు... గృహిణులకు పైఠాని చీరలు, నగలు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈసారి పింప్రిచించ్వాడ్ (పిసిఎంసి) ఎన్నికల బరిలో ఏడుగు రు మాజీ మేయర్లు నిలవడంతో పోటీ ర సవత్తరంగా మారింది. ఎన్సీపీ (ఎస్పీ) నుంచి వైశాలి ఘోడేకర్, యోగేష్ బె హల్... బిజెపి నుంచి మాయ్ ధోరే, శకు ంతల దరడే సహా పలువురు కీలక నే తలు పోటీ పడుతున్నారు. అయితే పూ ణే ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల నే పథ్యం ఆందోళన కలిగిస్తోంది. పోలీసు లు పరిశీలించిన 2,650 దరఖాస్తులలో 1,560 మందిపై క్రిమినల్ కేసులు ఉండగా... 60 మందిపై అత్యంత తీవ్రమైన నేరాలు నమోదయ్యాయి. జనవరి 15న ఉదయం 7:30 నుండి సాయంత్రం 5:30 వరకు పోలింగ్ జరగనుంది.

## తుర్క్‌మాన్ గేట్ రాళ్లదాడి ఘటనలో...
# మరో ముగ్గురి అరెస్ట్

**మొత్తం 16కు చేరిన అరెస్టుల సంఖ్య**
**సమాజ్‌వాదీ ఎంపి సల్మాన్ పాత్రనూ పరిశీలిస్తున్నామని పోలీసులు వెల్లడి**

**న్యూఢిల్లీ :** తుర్క్‌మాన్ గేట్ రాళ్ల దాడి ఘటనలో ఢిల్లీ పోలీసులు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. దీంతో ఈ కేసులో అరెస్ట్ అయిన వారి సంఖ్యల 16కు చేరుకుంది. ఈ విషయాన్ని శనివారం ఒక అధికారి వెల్లడించారు. రాళ్ల దాడి ఘటనలో అరెస్ట్ అయిన వారిని మహ్మద్ నవేద్ (44), మహ్మద్ ఫయాజ్ (20), మహ్మద్ ఉబేదుల్లా (23), మహ్మద్ అరిబ్ (25), మహ్మద్ కాశిఫ్ (25), మహ్మద్ కైఫ్ (23), మహ్మద్ అద్నాన్ (37), సమీర్ హుస్సేన్ (40), మహ్మద్ అథార్ (20), షానవాజ్ ఆలం (55), మహ్మద్ ఇమ్రాన్ (28), మహ్మద్ ఇమ్రాన్ అలియాస్ రాజు(36), మహ్మద్ అఫ్నాన్ (20), మహ్మద్ ఆదిల్ (20), మ్మమద్ ఆమీర్ హమ్జా (22), మహ్మద్ ఉబేదుల్లా (26) ఉన్నారు. శుక్రవారం రాత్రి రాళ్ల దాడిలో పాల్గొన్న ముగ్గురిని అరెస్ట్ చేశామని, ఇప్పటి వరకు 16మందిని అరెస్ట్ చేయడం జరిగిందని, తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నదని అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సెంట్రల్) నిధిన్ వల్సన్ చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం సున్నితమైన ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించారు. శుక్రవారం ప్రార్థనల కోసం సీనియర్ అధికారులు మైదానంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అంతే కాకుండా పోలీసులు డ్రోన్ నిఘాను, విస్తృతమైన సిసిటివి పర్యవేక్షణను కూడా నిర్వహిస్తున్నారని, పరిస్థితులు ప్రశాంతంగా నియంత్రణలో ఉందని అధికారులు చెప్పారు. దర్యాప్తులో భాగంగా ఈ సంఘటనకు సంబంధించి తప్పుదారి పట్టించే లేదా ధృవీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణలపై 10 మంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను పోలీసులు గుర్తించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ఐమెన్ రిజ్వీకి సమన్లు పంపించినప్పటికీ ఇప్పటి వరకూ దర్యాప్తులో జాయిన్ కాలేదని అధికారులు చెప్పారు. ఇదిలాఉంటే పోలీసుల నుండి తనకు ఇప్పటివరకూ ఎలాంటి సమన్లు అందలేదని ఆమె (ఐమెన్ రిజ్వీ)'పిటిఐ'కి చెప్పారు. తనను తాను సామాజిక కార్యకర్తగా అభివర్ణించుకుంటూ రిజ్వీ తనను ఇప్పటివరకూ పోలీసులు కాంటాక్ట్ చేయలేదని చెప్పారు. ఒకవేళ నాకు ఏవైనా సమన్లు లేదా కాల్ వస్తే తాను పోలీసుల దర్యాప్తునకు సహకరిస్తానని రిజ్వీ తెలిపారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో కొన్ని మెస్సేజెస్ సర్క్యులేషన్‌కు సంబంధించి సమాజ్‌వాదీ ఎంపి సల్మాన్ పాత్రను కూడా పరిశీలిస్తున్నామని, ఆయనకు సమన్లు పంపాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

## విజయ్ ప్రచార వాహనం
# సీజ్ చేసిన సిబిఐ

**న్యూఢిల్లీ :** తమిళనాడులోని కరూర్‌లో తొక్కిసలాట ఘటనకు బాధ్యులను గుర్తించేందుకు చేపట్టిన దర్యాప్తును సీబీఐ వేగవంతం చేసింది. నటుడు, రాజకీయనేత, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ప్రచార వాహనాన్ని సీబీఐ స్వాధీనం చేసుకుంది. ప్రచార వాహనం డ్రైవర్ సైతం సీబీఐ అధికారుల ముందు హాజరయ్యారు. గత ఏడాది సెప్టెంబర్ 27న వేలుసామిపురంలో జరిగిన టీవీకే ర్యాలీలో తొక్కిసలాట జరిగి... 41 మంది ప్రాణాలు కోల్పోగా, 100 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఇప్పటికే టీవీకే నాయకులను న్యూఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో అధికారులు ప్రశ్నించారు. జనవరి 12న తమ ముందు హాజరు కావాలని విజయ్‌కు సైతం సమన్లు పంపారు. కాగా, కరూర్ తొక్కిసలాట మృతుల కుటుంబాలను విజయ్ అక్టోబర్ 27న మహాబలిపురంలోని ఒక రిసార్ట్‌లో కలుసుకున్నారు. కరూర్ కుటుంబ సభ్యులకు రూ.20 లక్షల చొప్పున సాయం అందిస్తామని, గాయపడిన వారికి రూ.2 లక్షలు సాయం చేస్తామని టీవీకే పలుమార్లు ప్రకటించింది. చెప్పిన విధంగానే 39 కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున మొత్తం 7.8 కోట్లు పంపించినట్టు టీవీకే సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపింది.

# ఒడిశాలో కుప్పకూలిన చార్టర్డ్ ఫ్లైట్

**న్యూఢిల్లీ :** ఒడిశాలో ప్రమాదం చోటు చేసుకుంది. రూర్కెలావద్ద ఓ చార్టర్డ్ విమానం కుప్పకూలిపోయింది. ఈ నైన్ సీటర్ విమానం రూర్కెలా నుంచి భువనేశ్వర్ వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే,అయిన వెంటనే ఫ్లైట్ కూలిపోయినట్లు చెప్పారు. ప్రమాద సమయంలో అందులో ఎనిమిది మంది ఉన్నారు. ఇద్దరు పైలట్లు కాగా ఆరుగురు ప్రయాణికులు. విమానం అయి 10 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత ఇంజిన్ విఫలమవడంతో పంట పొలాల్లో కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అధికారులు, రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. ఈ విమానం ఇండియావన్ అనే సంస్థకు చెందినదిగా అధికారులు తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల వేళ...
# ఎన్‌సిపిల ఉమ్మడి మేనిఫెస్టో

**ఒకే వేదికను పంచుకున్న అజిత్ పవార్, సుప్రియా సూలే**




**పుణె:** మహారాష్ట్రలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న వేళ అధికార పక్షంలో ఉన్న ఎన్‌సిపి, ప్రతిపక్షంలో ఉన్న ఎన్‌సిపిలు చేతులు కలిపాయి. ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి (ఎస్‌పి) శనివారం పుణె మున్సిపల్ కార్పొరేషన్‌కు జరగబోయే ఎన్నికల కోసం ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేశాయి. అజిత్ పవార్, ఆయన సోదరి, ఎన్‌సిపి (ఎస్‌పి) కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుప్రియా సూలే ఉమ్మడి విలేకరుల సమావేశంలో ఒకే వేదికను పంచుకున్నారు. అధికార మహా యుతిలో భాగమైన ఎన్‌సిపి, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీలో భాగమైన ఎన్‌సిపి (ఎస్‌పి), పుణె, పింప్రి –చించ్వాడ పరుపాలక సంఘాలకు జనవరి 15న జరగబోయే ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తున్నాయి. ఇప్పటివరకు ప్రచారానికి దూరంగా ఉన్న సూలే, ఇతర ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకులు మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు. సభనుద్దేశించి అజిత్ పవార్ మాట్లాడుతూ ఈ మేనిఫెస్టో పుణెలోని కీలక పౌర సమస్యలపై దృష్టి సారించిందని చెప్పారు. కుళాయి నీటి సరఫరా, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, గుంతలు లేని రోడ్లు, పరిశుభ్రత, హైటెక్ ఆరోగ్య సంరక్షణ సేవలు, కాలుష్య నియంత్రణ, మురికివాడల పునరావాసం వంటి హామీలను మేనిఫెస్టోలో చేర్చారు. పిఎంపిఎంఎల్, మెట్రోలో ఉచిత ప్రయాణం, 500 చదరపు అడుగుల వరకు ఉన్న ఇళ్లకు ఆస్తి పన్ను మినహాయింపు, విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ ట్యాబ్‌లను కూడా ఈ మేనిఫెస్టో ప్రతిపాదిస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో బిజెపితో కలిసి అధికారంలో ఉన్నప్పటికీ, అజిత్ పవార్ స్థానిక బిజెపి నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. రెండు ప్రభుత్వాల నుండి గణనీయమైన నిధులు పొందినప్పటికీ, పుణె, పింప్రి – చించ్వాడ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. 2017 నుండి 2022 వరకు పౌర సంస్థలలో బిజెపి అధికారంలో ఉంది.

**సుప్రియా సూలే కేంద్ర ప్రభుత్వంలో చేరవచ్చు : కాంగ్రెస్**

కాగా, ఎన్‌సిపి, ఎన్‌సిపి (ఎస్‌పి) సంయుక్త మేనిఫెస్టో విడుదల చేయడంపై కాంగ్రెస్ స్పందించింది. ఈ చర్యతో వారు ఒక్కటైనట్లు కనిపిస్తోందని కాంగ్రెస్ నాయకుడు విజయ్ వడెట్టివార్ అన్నారు. అలాగే, ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకురాలు సుప్రియా సూలే కేంద్ర ప్రభుత్వంలో చేరవచ్చనే ఊహాగానాలను ఆయన ప్రస్తావించారు. అయితే, ఈ 'పునఃకలయిక సైద్ధాంతిక ఏకాభిప్రాయం లేదా పార్టీ కార్యకర్తల పట్ల శ్రద్ధ కంటే అధికార దాహం వల్లే జరిగిందని ఆయన ఆరోపించారు. ఎన్‌సిపి, ఎన్‌సిపి (ఎస్‌పి) పునరేకీకరణపై వస్తున్న ఊహాగానాలపై స్పందిస్తూ, ఈ చర్య సిద్ధాంతం కోసమా, కార్యకర్తల కోసమా లేక కేవలం అధికారం కోసమా అన్నదే అసలైన ప్రశ్న అని కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకుడు అన్నారు. ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకులు రోహిత్ పవార్, బారామతి ఎంపి సూలే మహారాష్ట్ర క్యాబినెట్, కేంద్ర ప్రభుత్వంలో చేరే అవకాశంపై విస్తృతంగా చర్చ జరుగుతోందన్నారు. ఎన్‌సిపి (శరద్ చంద్ర పవార్) ప్రతిపక్ష మహా వికాస్ అఘాడిలో శివసేన (యుబిటి), కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా ఉంది. సంప్రదాయబద్ధంగా, ఎన్‌సిపి తన వైఖరిని మార్చుకుంటూ ఉంటుందని, అది అధికారం లేకుండా మనుగడ సాగించలేదని, అధికారం లేకుండా ఉంటే, పార్టీ కుప్పకూలిపోతుందని వడెట్టివార్ ఆరోపించారు. మరోవైపు, కాంగ్రెస్ అధికారం కోసం కాకుండా రాహుల్ గాంధీ నాయకత్వంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసం పోరాడుతోందని అన్నారు.

# అయోధ్య రామాలయంలో 'నమాజ్'

**ముగ్గురిని అదుపులోకి తీసుకున్న భద్రతా సిబ్బంది**



**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో భద్రతా వ్యవస్థ పూర్తిగా విఫలమైంది. రామ జన్మభూమి ప్రాంగణంలోకి ప్రవేశించి ప్రార్థనలు చేయడానికి ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను శనివారం నాడు భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అందులో ఒక మహిళ కూడా ఉంది. ఈ ఘటనతో అక్కడ మోహరించిన భద్రతా సిబ్బంది తక్షణమే స్పందించి చర్యలు చేపట్టింది. అధికారులు, ప్రత్యక్ష సాక్షుల ప్రకారం కశ్మీర్ నివాసులమని చెప్పుకుంటున్న ఇద్దరు యువకులు, ఒక మహిళతో కూడిన ఈ బృందం, డి1 గేటు ద్వారా రామ మందిర సముదాయంలోకి ప్రవేశించింది. ఆ ఇద్దరు యువకులలో ఒకరు ఆలయ వంటగది సమీపంలో కూర్చుని 'నమాజ్' చేయడం ప్రారంభించినట్లు సమాచారం. ఆ తర్వాత భద్రతా సిబ్బంది జోక్యం చేసుకుని విచారణ నిమిత్తం ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులు కశ్మీరీ దుస్తులు ధరించి ఉన్నారు. వారిలో ఒకరిని జమ్ముకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాకు చెందిన అబు అహ్మద్ షేక్‌గా గుర్తించారు. మహిళను సోఫియాగా గుర్తించారు. అయితే మూడవ యువకుడి గుర్తింపు ఇంకా నిర్ధారించబడలేదు. భద్రతా సిబ్బంది వారిని అడ్డుకున్నప్పుడు ఆ ముగ్గురూ మతపరమైన నినాదాలు చేశారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటన జరిగిన తర్వాత, నిఘా సంస్థలు, స్థానిక పోలీసులు, సీనియర్ పరిపాలనా అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే, జిల్లా యంత్రాంగం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కూడా ఈ విషయంపై వ్యాఖ్యానించడానికి నిరాకరించింది. జనవరి 22, 2024న రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ జరిగినప్పటి నుండి రామ మందిర ప్రాంగణానికి ప్రతిరోజూ సగటున 1.5 లక్షల మంది భక్తులు వస్తున్నారు. గతంలో జరిగిన ఉగ్రవాద బెదిరింపుల దృష్ట్యా, ఈ సముదాయంలో భద్రతా ఏర్పాట్లు విస్తృతంగా ఉన్నాయి. రామ జన్మభూమి సముదాయం భద్రతా బాధ్యతను స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్ (ఎస్ఎస్ఎఫ్) నిర్వహిస్తోంది. ఈ ప్రదేశంలో దాదాపు 200 మంది ఎస్ఎస్ఎఫ్ సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తున్నారు. భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేయడానికి అయోధ్యలో నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జి) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రతిపాదిత ఎన్ఎస్‌జి యూనిట్ ప్రత్యేక ఆయుధాలు, యాంటీడ్రోన్ వ్యవస్థలతో సన్నద్ధమవుతుంది. ఇటీవలి నెలల్లో రామ మందిరానికి అనేక బెదిరింపు సందేశాలు వచ్చాయి. వీటిలో సోషల్ మీడియా, ఫోన్ కాల్స్ ద్వారా వచ్చిన బాంబు బెదిరింపులు ఉన్నాయి. దీనిపై దర్యాప్తు జరిపిన తర్వాత యుపి ఎటిఎస్, పోలీసులు అరెస్టులు చేశారు. ఒక కేసులో బీహార్ నుండి ఒక అనుమానితుడిని అరెస్టు చేయగా, మరో కేసులో తూర్పు ఉత్తరప్రదేశ్‌లో ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నవంబర్ 2024లో, ఖలిస్తానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూ కూడా ఈ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకుని బెదిరింపు జారీ చేశాడు.

# చలికి ఢిల్లీ గజగజ

**పొగమంచుతో విమానాల రాకపోకలకు అంతరాయం**

**న్యూఢిల్లీ :** చలి తీవ్రతకు దేశ రాజధాని దిల్లీ గజగజ వణికిపోతోంది. ఉష్ణోగ్రతలు అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయాయి. రాజధానిలో శనివారం ఉదయం ఉష్ణోగ్రతలు 4.2 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. ఇప్పటి వరకూ ఈ సీజన్‌లో ఇదే అత్యల్ప ఉష్ణోగ్రతలు అని భారత వాతావరణ శాఖ తెలిపింది. కనిష్ట ఉష్ణోగ్రతలు సీజన్ సగటు కంటే 2.7 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి. సఫ్దర్‌జంగ్ అబ్జర్వేటరీలో ఉష్ణోగ్రతలు 4.2 డిగ్రీల సెల్సియస్, పాలంలో 4.5, లోధి రోడ్డులో 4.7, రిడ్జ్‌లో 5.3, అయానగర్‌లో 4.5 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రతకు నగర వాసులు వణికిపోతున్నారు. చలిమంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. మరోవైపు నగరంలో దట్టంగా మంచు కురుస్తోంది. దీంతో దృశ్యమానత సున్నాకు పడిపోయింది. ఫలితంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపింది. దిల్లీ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే అనేక విమానాలు రద్దయ్యాయి. కొన్ని ఆలస్యంగా నడుస్తుండగా... మరికొన్నింటిని దారి మళ్లించారు. గాలి నాణ్యత వెరీ పూర్ కేటగిరీలో నమోదైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం... నగరంలో గాలి నాణ్యత సూచిక 358గా నమోదైంది. నెహ్రూ నగర్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 426గా, ఆనంద్ విహార్‌లో 422, వివేక్ విహార్‌లో 408, సిరిఫోర్ట్‌లో 404గా నమోదైంది. పట్పర్‌గంజ్ 400, ద్వారకా సెక్టార్8లో 399, ఓఖ్లా ఫేజ్2లో 398, జేఎల్ఎన్ స్టేడియంలో 394, ఆర్కేపురం, చాందినీ చౌక్ వద్ద 390, పంజాబీ బాఘ్, ముంద్కాలో 368, అబావనాలో 346, ఆయా నగర్‌లో 344, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు టర్మినల్3 వద్ద 325, ప్రాంతంలో 302గా గాలి నాణ్యత సూచిక నమోదైంది.

# ఇడికి మమత ఎదురుదెబ్బ

పశ్చిమ బెంగాల్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను తారుమారు చేయటానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ప్రయోగించిన బిజెపి దుష్తంత్రాన్ని సాగనివ్వబోనని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తొడగొట్టారు. తమ పార్టీ ఎన్నికల వ్యూహాలను, అభ్యర్థుల జాబితాలను వడబోసే బాధ్యత స్వీకరించిన ఎన్నికల ఏజన్సీ ఐ–ప్యాక్ కలకత్తా కార్యాలయంపై, దాని అధినేత ప్రతీక్ జైన్ నివాసంపై ఇడి అధికారులు గురువారం ఉదయాన్నే ఆకస్మికంగా దాడిచేసి సోదాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిన మమతా బెనర్జీ ఆగ్రహోదగ్రురాలై 11 గంటల తర్వాత ఆ ప్రదేశాల్లోకి ప్రవేశించి కొన్ని ఫైళ్లు, కంప్యూటర్ డిస్క్‌లు తీసుకెళ్లారు. ఇది వివాదాస్పదమైంది. బొగ్గు కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణల కేసులో తాము సోదాలు చేస్తుండగా మమతా బెనర్జీ చొరబడి ముఖ్యమైన ఫైళ్లు ఎత్తుకెళ్లారని ఇడి ఆరోపిస్తోంది. ఈ చర్య 'అనైతికం, బాధ్యతారాహిత్యం, రాజ్యాంగ విరుద్ధం' అని బిజెపి వాపోతున్నది. తమ పార్టీ ఎన్నికల వ్యూహాల సమాచారాన్ని దొంగలించి మా పార్టీని దెబ్బతీసే దుష్టబుద్ధితో బిజెపి నాయకత్వం ఐ–ప్యాక్‌పై ఇడిని ప్రయోగించగా, పార్టీ చైర్‌పర్సన్‌గా తాను పార్టీని రక్షించుకునేందుకు ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని, తమ పార్టీకి సంబంధించిన సమాచార ఫైళ్లను తీసుకెళ్లానని, ఈ పని ఇడి లాగా దొంగతనంగా కాకుండా పట్టపగలు బాహాటంగా చేశానని మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

ఈ వివాదం హైకోర్టు ముందుకు కూడా వెళ్లింది. జస్టిస్ సువ్ర ఘోష్ కోర్టుగది జనాలగోలతో రభసగా మారటంతో ఆయన విచారణను జనవరి 14కు వాయిదా వేశారు. కోర్టు ఏమి చెబుతుందో అలా వుంచితే, ప్రతిపక్ష పార్టీలను దెబ్బతీయటానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రధాని, హోంమంత్రి దుర్వినియోగం చేస్తున్నారని కొన్ని సంవత్సరాలుగా ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తుండగా, ఎన్నికలు జరగబోతున్న రాష్ట్రాల్లోనే ముందుగా ఎన్నికల కమిషన్‌ను ప్రయోగించి పదుల లక్షల ఓట్లను తొలగించటం ఎన్నికల ఫలితాలను బిజెపికి అనుకూలంగా మార్చే దుశ్చర్యగా ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. నిశితంగా పరిశీలిస్తున్న వ్యక్తులు అదే సందేహిస్తున్నారు. ఇంతలోనే ఇటీవల తమిళనాడులో, తాజాగా పశ్చిమ బెంగాల్‌లో ఇడి సోదాలు చేబట్టటం ఎందుకు? అవినీతిని నిర్మూలించే ధర్మకార్యం ఇప్పుడే గుర్తుకొచ్చిందా? బొగ్గు కుంభకోణం, మనీ లాండరింగ్ కేసు ఎప్పటినుంచో నడుస్తోంది. ఆ అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలకు గురైన అప్పటి టిఎంసి నాయకులు బిజెపి తీర్థం పుచ్చుకున్నారని మమత అంటున్నారు. ఆ కేసులో ధన లబ్ధి కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు అందిందని ఆమె ఆరోపిస్తున్నారు. మీరు పిచ్చి వేషాలేస్తే ఆ పెన్ డ్రైవ్‌లు బయటపెడతానని శుక్రవారం కలకత్తాలో ఇడికి వ్యతిరేకంగా పెద్ద ర్యాలీ అనంతరం బహిరంగసభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి హెచ్చరించారు.

నిజాయితీతో కేసును దర్యాప్తు చేయటమే ఇడి ధ్యేయమైతే ఈ రెండు నెలలు ఆగి ఎన్నికల అనంతరం చేబట్టవచ్చుగదా? ఇక్కడే కాదు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలన్నిట్లో ఎన్నికలకు ముందు పాలకపార్టీ నాయకులు, వారి సన్నిహితుల ఇళ్లపై సిబిఐ, ఇడి దాడులు జరుగుతున్నాయి. బిజెపి దురుద్దేశం విదితం కావటం లేదా?

ఓటర్ల జాబితాల ప్రక్షాళనకూడా అటువంటిదే. ఎన్నికల కమిషన్‌కున్న హక్కును ఎవ్వరూ కాదనరు. అయితే అందుకు అది ఎంచుకున్న సమయం, ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలనే ఎంపిక చేసుకుంటున్న తీరు, కార్యనిర్వహణలో ఏకపక్ష ధోరణి కమిషన్ ఉద్దేశాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు నాలుగైదు నెలలముందు జాబితాల పరిశీలన చేబట్టి బిహార్‌ను బిజెపి–జెడియు నిలుపుకునేలా చేసింది. హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఎంచుకున్న నియోజకవర్గాల్లో ఓటర్లను వేల సంఖ్యలో చేర్చటమో, తొలగించటమో చేసి బిజెపి విజయానికి పరోక్షంగా సహకరించారన్న ఆరోపణ ఎదుర్కొంటున్నది. ఇప్పుడు ఏప్రిల్‌లోపు అసెంబ్లీ ఎన్నికలు జరిగే పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళతోపాటు 2027లో ఎన్నికలు జరిగే ఉత్తరప్రదేశ్‌ను, కాస్త ఆలస్యంగా అసోంను ఎస్ఐఆర్ కిందకు తెచ్చి చూడుమా నిజాయితీ అంటోంది ఎన్నికల కమిషన్. ఎస్ఐఆర్ చేబట్టిన రాష్ట్రాల్లో 'శాశ్వతంగా చిరునామా మారిన ఓటర్ల పేరుతో తొలగించిన ఓటర్లు 10 కోట్లు దాటారు. వారు వేరే రాష్ట్రానికి వెళ్లి ఉండాలి కదా? ఎక్కడెక్కడ ఎందరున్నారో కేంద్రంగాని, ఎన్నికల కమిషన్ చెప్పటం లేదు. ఎందుకని?

రాజ్యాంగం ఆదేశించినట్లు సక్రమంగా ఓటర్ల జాబితాలు నిర్వహిస్తూ, 'స్వేచ్ఛగా, సజావుగా' ఎన్నికల నిర్వహణ ఎన్నికల సంఘం విధి. ఈ విశ్వాసాన్ని అది త్వరితంగా కోల్పోవటానికి బిజెపి నియమించిన దాని కమిషనర్లే కారకులు. ప్రజాస్వామ్య పునాదులు పటిష్టవంతం చేయటానికి ఎన్నికల కమిషన్ పట్ల విశ్వాస పునరుద్ధరణ ఎంతైనా అవసరం.



## భయాలు వాస్తవాలను ప్రతిబింబించలేవు

మలయాళం భాషా బిల్లు, 2025 విషయంలో అనేక సందేహాలు/భయాలు ఉన్నాయి కానీ అవన్నీ నిజాలు కాదు. భయాలు వాస్తవాలను ప్రతిబింబించలేవు. లౌకికవాదం, బహుళవాదానికి సంబంధించి రాజ్యాంగబద్ధ విలువలకు కేరళ ప్రభుత్వం కట్టుబడి ఉంది. మైనారిటీలు ముఖ్యంగా కన్నడం, తమిళం మాట్లాడే వర్గీయులకు భాషాపరమైన భద్రత కల్పించడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశ్యం. 'ఏ భాషను బలవంతంగా అమలు చేయకుండా, భాషాపరమైన స్వాతంత్ర్యాన్ని కాపాడేలా కీలక నిబంధనలు ఉన్నాయి. నోటిఫై చేసిన ప్రాంతాలు, తమిళం, కన్నడం మాట్లాడే వారు తమ మాతృభాషను అధికారికంగా వినియోగించుకోవచ్చు. అంటే సెక్రటేరియట్, స్థానిక కార్యాలయాలలో వాడుక భాషలోనే సమాధానాలు లభిస్తాయి.

- కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్





## కుక్క కోసం... డ్రోన్ సాయం!




'అబ్బీ' కనిపించడం లేదన్న ఫిర్యాదు అందుకున్న వెంటనే, వెతుకులాట మొదలైంది. తలా ఒక దిక్కున పరుగులు తీశారు. చివరికి డ్రోన్ సాయంతో ఎక్కడ ఉన్నదీ గుర్తించి, రక్షించారు. వివరాల్లోకి వెళితే, న్యూజెర్సీ టర్న్‌పైక్‌పైని ఒక విశ్రాంతి కేంద్రం వద్ద తప్పించుకున్న 'అబ్బీ' అనే తొమ్మిదేళ్ల గోల్డెన్ రిట్రీవర్ మిక్స్ కుక్క దక్షిణ కరోలినాలోని ఓ ఆశ్రయం నుంచి మెయిన్‌లోని కొత్త ఇంటికి తరలిస్తుండగా ఎటో తప్పిపోయింది. ఈస్ట్ బ్రన్స్‌విక్ ప్రాంతంలో వాహనం ఆగిన సమయంలో 'అబ్బీ' పరుగెత్తి పారిపోయింది. సుమారు 25 మైళ్లు (40 కి.మీ) దూరం తిరిగిన అబ్బీ, మరుసటి రోజు అర్ధరాత్రి సమయంలో అటవీ ప్రాంతంలో కనిపించింది. కుక్కకు అమర్చిన ట్రాకింగ్ ట్యాగ్ ద్వారా అంచనా స్థానం తెలుసుకున్న వలంటీర్లు, న్యూజెర్సీకి చెందిన 'అన్‌మ్యాన్డ్ సెర్చ్ అండ్ రెస్క్యూ' డ్రోన్ బృందం సహాయంతో థర్మల్ కెమెరా ఉపయోగించారు. డ్రోన్ ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు అబ్బీని రక్షించారు. దీనితో కథ సుఖాంతమైంది.

## ఒకే ఒక్కడు...



యూరోపియన్ బాస్కెట్‌బాల్ చరిత్రలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఇటలీకి చెందిన ట్రపానీ షార్క్ జట్టు ఒక మ్యాచ్‌లో కోర్టుపై కేవలం ఒక్క ఆటగాడితోనే మిగిలిపోవడం వల్ల ఆటను వదులుకోవాల్సి వచ్చి, టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. ఫీబా ఛాంపియన్స్ లీగ్ ప్లేఇన్ దశలో భాగంగా, బల్గేరియాలో ఇజ్రాయెల్ జట్టు హాపోయెల్ నెటానెల్ హోలోన్‌తో ట్రపానీ షార్క్ తలపడింది. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న ట్రపానీ జట్టు కేవలం ఐదుగురు ఆటగాళ్లతోనే మ్యాచ్‌కు హాజరైంది. వారిలో ఇద్దరు తొలిసారి ప్రొఫెషనల్ మ్యాచ్ ఆడుతున్నారు. కాగా, మ్యాచ్ మొదటి క్వార్టర్‌లోనే పరిస్థితి చేజారిపోయింది. కారణాలు స్పష్టంగా తెలియకపోయినా, ముగ్గురు ఆటగాళ్లు ఆటను మధ్యలోనే ఆపేయగా, మరో ఆటగాడు ఫౌల్ అవుట్ అయ్యాడు. దీంతో కోర్టులో ఒక్క ఆటగాడు మాత్రమే మిగిలాడు. నేను ఆడతా అంటూ ఆ ఒంటరి ఆటగాడు ఆత్మవిశ్వాసం వ్యక్తం చేసినప్పటికీ, నిబంధనల ప్రకారం కనీసం ఇద్దరు ఉండాలి కాబట్టి, నిర్వాహకులు మ్యాచ్‌ను నిలిపివేశారు. ఆ సమయంలో స్కోర్ 38–5గా హోలోన్ ఆధిక్యంలో ఉంది. నిబంధనల ప్రకారం ఫోర్ఫిట్‌గా పరిగణించడంతో ట్రపానీకి ఆటోమేటిక్ ఓటమి నమోదై, హోలోన్ రౌండ్ ఆఫ్ 16కు అర్హత సాధించింది. కాగా, 600,000 యూరోల (సుమారు రూ.6 కోట్లకు పైగా) భారీ జరిమానా తప్పించుకోవడానికే ఈ మ్యాచ్‌లో పాల్గొన్నామని ట్రపానీ క్లబ్ వెల్లడించింది. ఇప్పటికే ఇటాలియన్ బాస్కెట్‌బాల్ సమాఖ్య నుంచి జరిమానాలు, ఆంక్షలు ఎదుర్కొంటున్న ఈ జట్టు భవిష్యత్తు ఇప్పుడు అనిశ్చితిలో పడింది. ఇటీవలే లీగ్ మ్యాచ్‌ను కూడా ఆడకూడదని నిర్ణయించుకోవడం గమనార్హం. ఈ సంఘటన యూరోపియన్ బాస్కెట్‌బాల్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

## గురుత్వాకర్షణ మౌలికం కాదు!



వినడానికి ఆశ్చర్యంగా ఉంటున్నప్పటికీ, కొన్ని సిద్ధాంతాలను అనుసరించి, గురుత్వాకర్షణ మౌలికమైనది కాదు. స్థలమంతటా క్వాంటం ఎంటాంగిల్‌మెంట్ వ్యవస్థలను పరస్పరం అనుసంధానించిన తరువాత మాత్రమే అది కనిపిస్తుంది. అంటే, సంబంధాలు ముందుగా వస్తాయి, వాటి ఫలితంగా తరువాత గురుత్వాకర్షణ ఉద్భవిస్తుంది. ఈ ప్రతిపాదన, దీర్ఘకాలంగా నమ్మిన ఆలోచనను తలకిందులు చేస్తుంది. ఈ భావన ధైర్యంగా అనిపించినప్పటికీ, కేవలం ఊహలపై కాకుండా జాగ్రత్తగా రూపొందించిన గణితంపై ఆధారపడి ఎదుగుతోంది. కణాలు ఎంటాంగిల్‌మెంట్‌కు లోనైనప్పుడు, వాటి మధ్య పంచుకున్న సమాచారం నిర్మాణాన్ని సృష్టిస్తుంది. ఆ అనుసంధానాల నుంచే జ్యామితి (జామెంట్రీ) ఉద్భవిస్తుంది. సమాచారం ఎలా పంపిణీ అయి, ఎలా అనుసంధానమై ఉందో దాని ఉపఫలితంగా గురుత్వాకర్షణ కనిపిస్తుంది. ఎంటాంగిల్‌మెంట్ లేకపోతే సజావైన స్థలం ఉండదు, వస్తువులను ఒకదానివైపు లాగడానికి గురుత్వాకర్షణ కూడా ఉండదు. భౌతిక శాస్త్రవేత్తలు ఈ ఆలోచనను బ్లాక్ హోల్స్, సమాచార సిద్ధాంతం, హోలో గ్రాఫిక్ సూత్రాల అధ్యయనాల ద్వారా పరిశీలిస్తున్నారు. సమీకరణాలు స్పేస్‌టైమ్ వక్రత ఎంటాంగిల్‌మెంట్ నమూనాలను ప్రతిబింబించగలదని చూపుతున్నాయి. ఎంటాంగిల్‌మెంట్ మారితే జ్యామితి స్పందిస్తుంది. ఈ దృష్టికోణం దశాబ్దాలుగా ఏకీకరణకు ఎదురు నిలిచిన క్వాంటం మెకానిక్స్, గురుత్వాకర్షణ మధ్య వంతెన నిర్మించడంలో సహాయపడవచ్చు. గురుత్వాకర్షణ ఎంటాంగిల్‌మెంట్ నుండి ఉద్భవిస్తే, ఈ రెండు సిద్ధాంతాలు ఒకే తీరులో ఉంటాయి. ప్రారంభ బిందువుగా ద్రవ్యం కాకుండా సమాచారం నిలుస్తుంది. పరిశోధకులు ఈ ఆలోచనలను అనుకరణలు, అధిక శక్తి భౌతిక శాస్త్రం నుండి లభించిన అవగాహనలతో పరీక్షిస్తున్నారు.

— బిఎస్ఎస్ మైత్రేయి

# మేడారం 'మహా జాతర'కు మహర్దశ



జి. లక్ష్మణ్ కుమార్
9676647807

మేడారం జాతర చరిత్రలో ప్రతి ఒక్కరికి తెలిసేలా.. వన దేవతల గద్దెలు, జంపన్న వాగు ఆధునీకరణ పనులు తరతరాలు నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేయిస్తున్నది.

ఆసియా ఖండంలోనే అతి పెద్ద ఆదివాసీ జాతరగా పేర్కొనబడిన సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతర ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘ పౌర్ణమి రోజులలో జరుగుతుంది. దశాబ్దాల కాలం నుండి బుధ, గురు, శుక్ర, శని వారాలలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నా ఆచారం. ఈ మహా జాతర ను తెలంగాణా కుంభమేళా గా పేర్కొంటారు. ఈ జాతరకు లక్షలాది మంది తరలివస్తారు. కోరిక కోర్కెలు తీర్చే అమ్మవార్లకు ఘనమైన పూజలు చేస్తారు. ఇంత పెద్ద ఎత్తున జరిగే జాతరకు ఈ సారి మేడారం పున:నిర్మాణం పనుల వలన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

తెలుగు జాతి చరిత్రలో కాకతీయ సామ్రాజాన్ని స్వర్ణ యుగంగాను, మహోజ్వల ఘట్టంగాను పేర్కొంటారు. చరిత్ర పరిశీలిస్తే కాకతీయ రాజు 

ప్రతాపరుద్రుడు ఓరుగల్లు ను రాజధానిగా చేసుకొని పరిపాలించిన కాలంలో ఆదివాసీలు తమ స్వేచ్ఛ, స్వాతంత్యల కొరకు పోరాటం చేసి తమ ప్రాణాలను పణంగా పెట్టి ఆదివాసీ హక్కులను కాపాడిన వీరవనితలుగా సమ్మక్క సారలమ్మలు చరిత్రలో ప్రసిద్దిపొందారు. వారి బలిదానాలనే నేడు మేడారం మహా జాతరగా నిర్వహిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

**గతంలో చూసిన మేడారానికి.. ప్రస్తుతానికి ఎంతో తేడా**

ఎట్లున్న మేడారం ఎట్ల మారింది. నేడు మేడారం స్వరూపం పూర్తిగా మారిపోయింది. నాటి మేడారానికి నేటి మేడారానికి ఎంతో తేడా కనిపిస్తోంది. భక్తులు మెచ్చేలా.. మురిసేలా... రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతర నిర్వహణకు అవసరమైన అభివృద్ధి పనులు భారీ స్థాయిలో చేపట్టారు.

ఆదివాసీ పెద్దలు, పూజారుల సంఘం సంపూర్ణ ఆమోదంతోనే మేడారం అభివృద్ధి పునర్నిర్మాణ పనులకు ప్రజా ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. జాతర నిర్వహణకు అవసరమైన వసతుల కల్పన, అభివృద్ధి పనులు అద్భుతంగా చేపడుతోంది. మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతరకు విస్తృత ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. మేడారం ధగ ధగా మెరుస్తోంది. ఏర్పాట్లు, అభివృద్ధి పనులను చూసి భక్తులు మురిసిపోతున్నారు. కొత్త సొగబులు.. కాంతులు వారిని కట్టిపడేస్తున్నాయి. గత పాలకులు ప్రతిసారి జాతర వచ్చిందంటే కోట్లాది రూపాయలు వెచ్చించి తాత్కాలికం గా అభివృద్ధి పనులు, వసతులు కల్పించేవారు. ప్రతీ సారి ఇదే జరుగుతుండేది.

**శాశ్వత నిర్మాణాలు..**

వందల ఏళ్లపాటు చెక్కుచెదరకుండా నిలిచేలా గద్దెల శాశ్వత పున:నిర్మాణం పనులు చేపట్టింది. జనవరి ఐదో తేదీ నాటికి పనులన్నీ పూర్తి చేసేందుకు రాత్రింభవళ్లు అధికార యంత్రాంగం శ్రమిస్తోంది. గద్దెల విస్తరణ, ఆలయ ప్రాంగణం చుట్టూ గ్రానైట్ రాతి ప్రాకార నిర్మాణం, స్వాగత తోరణాల ఏర్పాటు పనులు తుది దశలో వేగంగా సాగుతున్నాయి.

**పిల్లర్లపై సంస్కృతి, ఆచారాలు, చరిత్ర..**

మేడారం గద్దెల చుట్టూ నిర్మిస్తున్న 32 గ్రానైట్ ఫిల్లర్లపై ఆదివాసీ సంస్కృతి, ఆచారాలు, చరిత్రను తీర్చిదిద్దారు. మార్బుల్ శిలలతో గద్దెలూ జంపన్నవాగు సుందరీకరణ, డ్రైనేజీ వ్యవస్థలు, ఫ్లడ్ మేనేజ్మెంట్, 60 అడుగుల నుంచి నాలుగు లైన్లకు రోడ్ల విస్తరణ, క్యూ లైన్లు, సత్రాలు, వాచ్ టవర్లు, గ్రీనరీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మరోవైపు జాతర సజావుగా సాగేందుకు మహా కుంభమేళాలో భాగస్వాములైన నిపుణుల బృందం మేడారానికి చేరుకుని.. జాతర జరిగే ప్రాంతం, అక్కడికి దారి తీసే మార్గాలు, జాతర రద్దీ ఉండే ఉప ఆలయాలను సందర్శించి.. అధికారులకు తగిన సూచనలు..సలహాలు చేసింది. ఈసారి జాతరకొచ్చే భక్తులకు పార్కింగ్ సమస్య తలెత్తకుండా గద్దెల సమీపంలోనే ఏకకాలంలో వేల వాహనాల పార్కింగ్కు అధికారులు చర్యలు చేపట్టారు. ఆ నాలుగు రోజులూ డ్రోన్స్

ప్రత్యేక ఆకర్షణ కానున్నది. ఎక్కడ నిర్వహించాలో త్వరలో నిర్ణయం తీసుకుంటారు. జాతరపై సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు డాక్యుమెంటరీ కూడా రూపొందిస్తున్నారు.

**మేడారం సమగ్రాభివృద్ధికి రూ.251 కోట్లు మంజూరు..**

మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం రూ. 251 కోట్లతో మేడారం సమగ్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. గద్దెల విస్తరణకే రూ. 101 కోట్లు కేటాయించింది. 4,000 టన్నుల గ్రానైట్తో గద్దెల ప్రాంగణ నిర్మాణ పనులు చేపట్టారు. 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించిన 7,000కి పైగా శిల్పాలు, 930 ఏళ్ల కోయల తాళపత్ర గ్రంథాల ఆధారంగా శిల్ప రూపకల్పన చేశారు. 46 స్తంభాలతో 271 చ.మీ విస్తీర్ణంలో ప్రాకారం, 8 స్తంభాలతో వృత్తాకార గద్దె నిర్మాణం చేపట్టారు. 40 అడుగుల వెడల్పుతో 3 స్వాగత తోరణాలు, 30 అడుగుల వెడల్పుతో 5 స్వాగత తోరణాలు, 50 అడుగుల వెడల్పుతో ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న చెట్లను తొలగించకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. బండారి, మర్రి, వెదురు, వేప, ఇప్ప తదితర 12 రకాల పవిత్ర వృక్షాలు ఇక్కడ ఉన్నాయి. 140 రకాల ఆయుర్వేద మొక్కల నాటనున్నారు. పూజారుల సంఘం ఆమోదంతోనే అన్ని పనులు జరుగుతున్నాయి.

మేడారం నిర్మాణ పనులు 200 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా చేపడుతున్నారు. గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలుంటాయి. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పున ప్రధాన స్వాగత తోరణం నిర్మిస్తున్నారు. వృత్తాకారంలో ఉండే గద్దె చుట్టూ 8 స్తంభాలు, మధ్యలో వెదురు బొంగులతో తీర్చిదిద్దుతున్నారు. శిలలపై ఆదివాసుల సంస్కృతికి పెద్దపీట వేశారు. తాళపత్రాల్లోని కోయ వంశీయుల చరిత్రను ప్రాంగణం గోడలపై చిహ్నాలుగా, బొమ్మలుగా చెక్కించారు. ఇందుకోసం తెలుపు రంగు రాళ్లను ఆంధ్రప్రదేశ్లోని అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు తరలించి శిల్పులతో చెక్కించాక మేడారానికి తీసుకొచ్చారు.

**భావి తరాలకు తెలిసేలా... శిలలపై తల్లుల చరిత్ర..**

మేడారంలో కోయల ఆచార సంప్రదాయాలకు తగ్గట్టుగా సర్కారు పనులు చేపడుతూ.. సమ్మక్క సారక్క తల్లుల చరిత్ర అందరికీ తెలిసేలా శిలలపై చెక్కించారు. కోయల వద్ద దొరికిన 930 ఏండ్ల నాటి తాళపత్ర గ్రంథాల ఆధారంగా చెక్కించిన శిల్పాలు, చిహ్నాలు. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సమ్మక్క, సారక్క పగిడిద్దరాజు, గోవిందరాజు, కోయల ఇష్ట దైవాలకు ప్రతిరూపంగా భావించే పులి, జింక, దుప్పి, పావురం, ఏనుగు, నెమలి, మొసలి, పశుపక్ష్యాదులతో పాటు కోయల జీవనశైలికి, ఆచార సంప్రదాయాలకు, గొట్టుగోత్రాలకు ప్రతిరూపంగా భావించే సూర్యచంద్రులు, త్రిశూలం, నెలవంక, బండి చక్రాలు, అడ్డ, నిలువు గీతలకు స్తంభాలపై చోటు దక్కింది. అలాగే సమ్మక్క సారలమ్మ వంశస్తులైన దాదాపు 250 కోయల ఇంటి పేర్లు, వారి మూలాలను శిలలపై చెక్కడం ద్వారా వాళ్ల చరిత్రను భావితరాలు తెలుసుకునే అవకాశం దక్కుతుంది. అందు కోసమే ప్రత్యేకంగా కోయల ఇంటి పేర్లు, వారి మూలాలను శిలలపై చెక్కించేందుకు ప్రాధాన్యమిచ్చారు. గద్దెల ముందు తెల్లని గ్రానైట్ స్తంభాలతో ఏర్పాటు చేస్తున్న ప్రధాన ద్వారం, ఆయా శిలలపై సమ్మక్క సారలమ్మ పూర్వీకులతో పాటు, కోయల జీవనశైలిని తెలిపేలా చెక్కిన ఏడు వేల బొమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.

50 ఫీట్ల వెడల్పుతో ఉన్న ఈ ప్రధాన ద్వా రానికి 25 ఫీట్ల ఎత్తు, 5 ఫీట్ల వెడల్పుతో రెండువైపులా రెండేసి నిలువు స్తంభాలు, వాటిపై 80 ఫీట్ల పొడవైన అడ్డ స్తంభం, దానిమీద 60 ఫీట్ల పొడువైన మరో అడ్డ స్తంభం ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు గద్దెల చుట్టూ 25 ఫీట్ల ఎత్తు, 5 ఫీట్ల వెడల్పుతో 8 స్తంభాలు నిలుపుతున్నారు. వీటిపై సమ్మక్క సారలమ్మ తో పాటు 3,4,5,6,7 గొట్టుగోత్రాలను బొమ్మలుగా చెక్కారు. గద్దెల చుట్టూ బయటి వైపు శిలలపై ఆదివాసీల జీవన విధానం, వారి దేవతల బొమ్మలు, ఇంకా 750 కోయ ఇంటి పేర్లకు సంబంధించిన జీవన చిత్రాలను గీశారు. వీటిని చెక్కేందుకు ఏపీలోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో దాదాపు 450 మంది కళాకారులు నెలల తరబడి రేయింబవళ్లు శ్రమించారు. ఇంతటి మహాద్భుతంగా మేడారం జాతర నిర్వహణకు ప్రభుత్వం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు చేపట్టడం రికార్డే..

**నాడు మాట ఇచ్చి.. నేడు నిజం చేసి..**

గతంలో పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించిన సమయంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. ఆ సమయంలో ప్రజలు, ఆదివాసీలు మేడారంలో అభివృద్ధి పనులు , పునర్నిర్మాణ పనులు చేపట్టాలనీ, జాతరకు అన్ని హంగులు కల్పించాలని కోరారు. తాము అధికారంలోకి రాగానే తప్పకుండా మేడారంలో పునర్నిర్మాణ పనులు చేసి తీరుతామని నాడు రేవంత్ రెడ్డి మాట ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నేడు మేడారం అభివృద్ధికి నడుం బిగించారు. ఇచ్చిన మాటను నేడు నిలుపుకుంటున్నారు. మేడారం ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో నిత్యం మేడారంలో జరిగే పనులపై సమీక్ష నిర్వహి స్తూ మంత్రులు, అధికారులకు సూచనలు చేస్తూ పనులను పరుగులు పెట్టిస్తున్నారు.

జనవరి చివరిలోగా పనులు పూర్తి చేసేలా అధికార యంత్రాంగాన్ని పురమాయిస్తున్నారు. మేడారం మహా జాతరను దేశ వ్యాప్తం గా గుర్తింపు వచ్చేలా కనులపండువగా నిర్వహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రతి రోజు పనుల వేగవంతం పై అడిగి తెలుసుకుంటున్నారు. మేడారం ఆలయంలో పున: నిర్మాణం పనులు వేగవంతానికి మంత్రుల బృందం ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తున్నది. వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు ధనసరి సీతక్క, కొండా సురేఖ నిత్యం పనులను పరిశీలిస్తూ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. పనుల్లో పూర్తి నాణ్యత పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

**మేడారం మహా జాతర ప్రత్యేకత**

మన దేశంలో లెక్కలేనన్ని జాతర్లు ఉన్నప్పటికిని మేడారం జాతర ప్రత్యేకతనే వేరు. రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ ఉత్సవాను తిలకించేందుకు ఎందరో భక్తులు ఎదరు చూస్తూ ఉంటారు. 2026 జనవరి 28వ తేదీ బుధ వారం సారలమ్మ రాకతో మేడారం మహా జాతర ప్రారంభమవుతుంది. 29న గురువారం సమ్మక్క దేవత గద్దెకు రావడం, 30న శుక్రవారం భక్తులు మొక్కులు సమర్పించుకోవడం, 31వ తేదీ దేవతల వనప్రవేశంతో జాతర ముగియనుంది.

సమ్మక్క సారలమ్మలను దర్శించుకునేందుకు దేశ నలుమూలల నుంచి భక్తులు రావడం ఆనవాయితి. భక్తులను నిరుత్సాహపరచకూడదనే ఉద్దేశ్యంతో పాటు, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ప్రభుత్వం ఈ మహా జాతర పనులను పున: నిర్మిస్తుంది. ఈ జాతర నిస్సందేహంగా ఆధ్యాత్మిక శోభాయాత్ర .

**రచయిత: అసిస్టెంట్ డైరెక్టర్**
**సమాచార, పౌర సంబంధాల శాఖ, కరీంనగర్ జిల్లా**

# ప్రపంచం ముగిసిపోతుందా?

ప్రతి విషయానికీ 'సైన్స్' అనే పదం, లేదా 'నాసా' వంటి అంతరిక్ష పరిశోధనా సంస్థల పేర్లను ఉదహరించ డం.. ఒక చిన్న వాస్తవానికి అభూతకల్పనలు జోడించడం సోషల్ మీడియాలో విపరీతమవుతున్నది. దీనితో అబద్ధాలు కూడా నిజాలుగా, విస్తృత ప్రాచుర్యం పొందుతున్నాయి. అలాంటిదే ఒకటి 'ప్రపంచం ముగిపోతుందా?' అనే శీర్షికన దర్శనమిస్తున్న వందలాది వ్యాసాలు.. వేలాది పోస్టులు.. మీడియా కూడా కేవలం ప్రచారం కోసం ఇలాంటి భయంకరమైన శీర్షికలతో కథనాలను ప్రచారం చేయడం శోచనీ యం. సంచలనాలకు దూరంగా, శాస్త్రానికి దగ్గరగా ఉండి చూస్తే, 'ప్రపంచం ముగిసిపోతుంది' అంటూ వచ్చిన ల్యాబ్ అనలాగ్ పరిశోధన గురించి ముందుగా తెలుసుకోవాలి. ఈ పరిశోధన నిజమే. ఇందులో భౌతిక శాస్త్రవేత్తలు ల్యాబ్ అనలాగ్ అనే విధానాన్ని ఉపయోగించారు. ఇది నిజమైన విశ్వాన్ని నాశనంచేసే ప్రయోగం కాదు. విశ్వం ఎలా ముగిసే అవకాశాలు ఉండవచ్చో చెప్పే క్లిష్ట సిద్ధాంతాలను సురక్షితంగా అనుకరించే ఒక విధానం మాత్రమే. మరో రకంగా చెప్పాలంటే, ల్యాబ్ అనలాగ్‌లలో విశ్వాన్ని కాదు, దాని వెనుక పనిచేసే గణిత నియమాలను చిన్న, నియంత్రిత వ్యవస్థల్లో పునఃసృష్టిస్తారు. దీని వల్ల ప్రమాదం లేకుండా, లోతైన ప్రశ్నలను పరిశీలించవచ్చు. సౌర వ్యవస్థ కట్టుబాట్లలో ఉన్నంత కాలం అది పూర్తిగా నియంత్రితంగా, ప్రశాంతంగా ప్రవర్తించిందని ఈ పరిశోధనలో తేలిన ముఖ్యమైన ఫలితం. చిన్న మార్పులు జరిగితే, వ్యవస్థ కూడా మారుతున్నదని, కానీ, ఈ మార్పు అస్తవ్యస్త విధ్వంసంగా కాకుండా, అంచనా వేయగలిగే విధంగా ముందుకు వ్యాప్తి చెందాయని తెలిసింది. అంటే, చిన్న మార్పు... 'అతి పెద్ద విధ్వంసం' వంటి నాటకీయ పరిస్థితి ఇక్కడ కనిపించలేదు. ఈ విధానం ద్వారా శాస్త్రవేత్తలు, వాక్యూమ్ కూలిపోవడం వంటి అత్యంత తీవ్రమైన ఆలోచనలను కూడా భయం లేకుండా పరిశీలించగలుగుతున్నారు. ఇది విశ్వ అస్థిరతకు నిదర్శనం. వీటిని



నిజంగా జరిగే ప్రమాదం లేకుండా అధ్యయనం చేయడానికి ల్యాబ్ అనలాగ్‌లు ఒక కీలక మార్గం. ఇందులో మార్పులు (ఛేంజెస్) హద్దులు (థ్రెష్‌హోల్డ్స్), ప్రతిచర్యలు (ఫీడ్‌బ్యాక్ లూప్స్) తదితరాలను స్పష్టమైన సంకేతాలతో కొలవగలుగుతారు. ఈ ప్రయోగాల అర్థాన్ని క్వాంటం ఫ్రేమ్‌వర్క్‌లు నియంత్రిస్తాయి. అవి లేకపోతే, 'శ్వాంతం దగ్గరలోనే' వంటి శీర్షికలతో కథలు మరింత విస్తారంగా ప్రచారమయ్యే ప్రమాదం ఉంది. శాస్త్రవేత్తలు ఆ భాషను కాకుండా... డేటాను, గణితాన్ని, పరిమితులను మాత్రమే నమ్ముతారు. అందుకే శాస్త్రీయ నిర్ణయాలు సంచలనంగా కాకుండా స్థిరంగా ఉంటాయి. ఈ పరిశోధన ప్రధాన్యత వాక్యూ మ్ స్టెబిలిటీపై మన అవగాహనను పదును పెట్టడంలో ఉంది. విశ్వానికి నిజంగా హద్దులు ఉన్నాయా? ఉంటే అవి ఎక్కడ ఉన్నాయి? అనే ప్రశ్నలకు సమాధానలను శాస్త్రీయ విధానంలో గణితాన్ని ఉపయోగించి తెలుసుకునే ప్రయత్నం జరుగుతున్నది. ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాలు భవిష్యత్తు మోడల్స్‌ను మెరుగుపరచడానికి ఉపయోగపడతాయి. అంతేగానీ, 'విపత్తు ముంచుకొస్తున్నది' అని జోస్యం చెప్పడానికి కాదు. భయం కాదు, వినయం ఈ పరిశోధన వెనుక ఒక లోతైన శాస్త్రీయ సంస్కృతి ఉంది. ఎందుకంటే శాస్త్రవేత్తలు భయాన్ని వెంబడించరు. వాళ్లు తమ అంచనాలను పరీక్షిస్తారు. ఇది ఏళ్ల తరబడి చేసిన పరిశోధనలు, అధ్యయనాల ఫలితాలే తప్ప అకస్మాత్తుగా పుట్టుకొచ్చిన ఆలోచనలు కూడా కావు. స్థూలంగా చెప్పాలంటే, మనుషుల కాలప్రమాణంలో విశ్వం స్థిరంగానే ఉంది. శాస్త్రం శీర్షికలను నమ్మి కాదు.. ఆలోచనలను పరీక్షించి ముందుకు సాగుతుంది. ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు వెతుకున్నది. ఒకప్పుడు అద్భుతాలు.. అంతుచిక్కని రహస్యాలు అనుకున్న ఎన్నో విషయాలు ఇప్పుడు శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాల కారణంగానే సామాన్యమైన అంశాలుగా మారాయి. నేటి ప్రశ్న.. రేపటి సమాధానమవుతుంది.

స్థానికం LOCAL NEWS

హైదరాబాద్
ఆదివారం
11-01-2026
www.prajapaksham.in

ప్రజాపక్షం
Telugu National Daily



## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం

### జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండలంలో గల రైతులు తమ పంట పొలాలను ఫార్మర్ రిజిస్ట్రీలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ కిష్టపురం, మందిపల్లి గ్రామాలలో జరుగుతున్నటువంటి రైతు రిజిస్ట్రీ ప్రక్రియను సందర్శించి పరిశీలించారు. ప్రతి రైతు రైతు రిజిస్ట్రీ చేసుకోవాలి కేంద్ర ప్రభుత్వం అందించే అన్ని పథకాలు లబ్ధి పొందుటకు తప్పనిసరిగా ప్రతి రైతు రిజిస్ట్రీ చేసుకోవాలని తెలుపుతూ రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి కావలసిన పత్రాలను రైతులు తమ యొక్క ఆధార్ కార్డు, భూమి పాసుబుక్ వివరాలు, ఆధార్‌కు లింకు ఉన్న మొబైల్ నెంబర్‌ను తీసుకొని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద లేదా దగ్గరలోని మీసేవ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ జి.కొండయ్య, మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, ఏఈఓలు జైన్ సింగ్, రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/మాగనూర్ :** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు మాగనూరు మండల కేంద్రంలో చైనా మాంజా విక్రయాలను అరికట్టేందుకు మాగనూరు ఎస్సై అశోక్ బాబు ఆధ్వర్యంలో మాగనూర్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వివిధ పతంగులు (గాలిపటాలు) అమ్మే షాపులలో విస్తృతంగా తనికీలు చేపట్టి, చైనా మాంజా నిల్వలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. చైనా మాంజా వల్ల మనుషులకు, ముఖ్యంగా చిన్నారులకు, వాహనదారులకు, పక్షులకు తీవ్ర ప్రమాదం వాటిల్లే అవకాశముందని ఎస్సై అశోక్ బాబు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని, ఎక్కడైనా చైనా మాంజా విక్రయిస్తే అట్టి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

## సంక్రాంతికి రైతు సంబరాలు



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో రైతు సంబరాలలో భాగంగా అంతర్రాష్ట వృషభరాజుల న్యాకేటగిరి బండలాగుడు పోటిలు నిర్వహిస్తున్నట్లు గ్రామసర్పంచ్ బెట్టరిరేఖుక నాగరాజు తెలిపారు. ఈనెల 15న గురువారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో బండలాగుడు పోటిలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ.40వేలు, మూడోబహుమతి రూ.30వేలు, నాల్గో బహుమతి రూ.20వేలు, ఐదో బహుమతి రూ.10వేలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.వెయ్యి ఈనెల 14సాయంత్రం 5గంటలవరకు పేరు నమోదు చేసుకోవచ్చన్నారు.

## గ్రామ అభివృద్ధి పనులకు శ్రీకారం



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కల్వకోల్ గ్రామ అభివృద్ధిపనులకు సర్పంచ్ బంట్రోతు శ్రీనివాసులు శ్రీకారం చుట్టారు. మండలంలోని కల్వకోల్‌గ్రామంలో నేషనల్ హైవేరోడ్డు విస్తరణలో బస్టాండు దగ్గరలో ఉన్న మినీవాటర్ట్యాంక్‌ని తొలగించారు. గ్రామసర్పంచ్ రోడ్డు విస్తరణ ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి నూతన మినీ వాటర్‌ట్యాంక్ నిర్మించాలని అధికారులను కోరారు. పోచమ్మగుడి దగ్గరనుంచి కొండ్రావుపల్లి రోడ్డుకు ఇరువైపులా ముళ్లచెట్లు పెరగడంతో ద్విచక్రవాహనదారులకు, బాటసారులకు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉన్నందున శనివారం జెసిబిసాయంతో కంపచెట్లను తొలగించారు. గ్రామంలో నెలకొన్న చెత్తకుప్పలను జెసిబిసాయంతో డంపింగ్‌యార్డులో చెత్తకుప్పలను ఏర్పాటుచేశారు. సర్పంచ్‌వెంట వార్డుసభ్యులు, టిఆర్‌ఎస్‌పార్టీ నాయకులు మాజీ ఎంపిటిసి తలారి వెంకటస్వామి, కొండబాలస్వామి, వెంకటస్వామి, బిజెపి నాయకులు గువ్వలి వెంకటయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

## బాలుడు దుర్మరణం



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** బైక్ నడుపుతూ వేగం నియంత్రణ లేక అదుపుతప్పి బాలుడు దుర్మరణం పాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎఎస్ఐ శ్రీనివాసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.... పట్టణంలోని గాంధీనగర్‌కాలనీలో నివాసముంటున్న రఘుపతి పెయింటింగ్ పని, సునీత ఇంట్లోనే టైలరింగ్ చేస్తున్న వీరికి సాయిప్రణీత్ (13) మిలీనియం పాఠశాలలో 8వతరగతి చదువుతున్నాడు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో శనివారం గాంధీనగర్‌నుండి తనకు ఉన్న సైకిల్ తీసుకొని వరుసకు మామ అయినవారి ఇంటికివెళ్లి వారి ఇంటి వద్ద ఉన్న బైక్ తీసుకొని అక్కడినుండి బయలుదేరాడు. వారి ఇంటినుండి బయలుదేరిన కొద్దిసేపటికే వికాస్ ఎక్సలెంట్ స్కూల్ వద్దకు రాగానే వేగాన్ని నియంత్రించలేక బైక్‌ను అక్కడే ఉన్న ఇంటిర్యాంపుపై ఎక్కించడంతో అక్కడ ఉన్న బెంచీని ఢీకొని పక్కనే ఉన్న మురుగుకాల్వలో పడటంతో తలకు బలమైన గాయమైంది. తలకు గాయం కావడంతో అక్కడికక్కడే బాలుడు దుర్మరణం పాలయ్యాడు. బాలుడు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడకు చేరుకున్న తల్లి ఒక్కగానొక్క కొడుకు చనిపోయాడన్న విషయం తెలిసి బిపి ఎక్కువై సొమ్మసిల్లి పడిపోగా ఆమెకు అక్కడే ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## కొత్తకోటకు ఇండోర్ స్టేడియం



**ప్రజాపక్షం/కొత్తకోట:** ఎమ్మెల్యే జి.మధుసూదన్ ఆదేశాల మేరకు ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అనువైన స్థలాన్ని అధికారులు, పార్టీ నాయకులు పరిశీలించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కొత్తకోట మున్సిపల్ పరిధిలో, క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడంతో పాటు క్రీడాకారులకు మెరుగైన వసతులతో కూడిన స్టేడియం అందించాలన్న ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని, ఈ స్టేడియం యువతకు ఒక ఆరోగ్యకరమైన వేదిక మాత్రమే కాకుండా ప్రాంతీయ అభివృద్ధికి కూడా దోహదపడుతుందనే లక్ష్యంతో, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి కొత్తకోట పట్టణానికి ఇండోర్ స్టేడియంను మంజూరు చేయించడంతో, అధికారులు, మున్సిపాలిటీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థల పరిశీలన చేశారు.

## మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

### ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన

### ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** తరతరాల పురుషాధిపత్య సమాజంలో అణిచివేతకు, బానిసత్వానికి, వివక్ష సంకెళ్ళు తెంచి మహిళలకు స్వేచ్ఛ సమానత్వం ఆత్మగౌరవం అందించిన త్యాగాల చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ దేనని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. భారత గడ్డపై సిపిఐ పార్టీకి వంద ఏళ్ళ శతాబ్ది ముగింపు ఉత్సవాల పురస్కరించుకొని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా సమితి నేతృత్వంలో శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ సురవరం వెంకట్రామా రెడ్డి భవన్ ఎదుట మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన మాట్లాడుతూ భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిందని, మహిళా హక్కుల కోసం రాజీలేని సమరం నడుపుతు లింగ వివక్షతలు అసమానతలు లేని సమ సమాజ స్థాపన కోసం పోరాడుతుందని అన్నారు. సిపిఐ సీనియర్ నేత ఎం. నరేందర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్ మాట్లాడుతూ... భారత గడ్డ పై సిపిఐ పార్టీ వందేళ్లు నిండాయని అన్నారు. జాతీయ పార్టీ పిలుపు మేరకు వందేళ్ల ఉత్సవాలను ఖమ్మం జిల్లాలో ఈనెల 18న లక్షల మందితో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయబోతున్నామని జిల్లా నుండి వందలాది మంది కార్యకర్తలు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరచిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పోటీలో పాల్గొన్న మహిళలందరికీ జ్ఞాపికలు అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గాయని శ్యామల, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కె. పద్మావతి, జిల్లా అధ్యక్షురాలు జి.భార్గవి, ఇందిరా, కె. శ్రీలత, శ్రీవిద్య, సి.పూజ, భావన, అరుణ, చెన్నమ్మ, సుభద్రమ్మ, యాదమ్మ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.రాము, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి లక్ష్మ ణ్, యువజన సంఘం కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.



## మంత్రి సహకారంతో గ్రామం అభివృద్ధి

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** గ్రామంలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసుకుంటామని బొల్లారం గ్రామ సర్పంచ్ గొంది సుదర్శన్ రెడ్డి అన్నారు. గ్రామంలో రోడ్లకి ఇరువైపులా పెరిగిన కంపతార చెట్లను జెసిబితో తొలగించే పనులను చేపట్టారు. తూముకుంట ప్రధాన రోడ్డు నుంచి బొల్లారం కొర్లకుంట గ్రామాల మీదుగా కొల్లాపూర్ రోడ్డు వరకు బిటి రోడ్డు నిర్మాణం కొరకు మంత్రి జూపల్లి ఇప్పటికే నిధులు మంజూరు చేయడం జరిగిందని అట్టి పనులు కూడా త్వరలోనే ప్రారంభం అవుతాయని, దీంతో రవాణా సౌకర్యం కూడా మెరుగుపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాసులు గౌడ్ వార్డ్ మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 9వ వార్డులో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

### పట్టణ వ్యాప్తంగా ప్రతిరోజూ పరిశుభ్రత కార్యక్రమాలు

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని 7వ రోజున 9వ వార్డులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ కోనేటి పుష్పలత నర్సింలు, వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక రామ్మోహన్, మున్సిపల్ కమిషనర్ జి.లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్ల పరిశుభ్రత డ్రైనేజీల శుభ్రపరిచే పనులు చేపట్టారు. ప్రతి వార్డులో ప్రతి రోజు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అలాగే 9వ వార్డులో 10 శాతం ల్యాండ్‌ను గుర్తించి బౌండరీలను ఫిక్స్ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా జడ్చర్ల పట్టణంలోని ఇతర వార్డులలోనూ ఉన్న 10 శాతం ల్యాండ్‌ను గుర్తించి బౌండరీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చైతన్య చౌహాన్, కుమ్మరి రాజు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాలు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఈనెల 18న ఖమ్మం జిల్లాలో జరిగే సిపిఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని కామ్రేడ్ లక్ష్మ ణచారిభవనంలో ఎఐటియూసి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బండిలక్ష్మి పతి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ సిపిఐకి వందేళ్లు నిండిన సందర్భంగా మరింత ఉత్తేజంతో ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేసి కేంద్రప్రభుత్వం తీసుకొచ్చినటువంటి కార్మిక రైతు వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాలు నిర్మించాలని అన్నారు. కావున నాగర్‌కర్నూల్ జిల్లా నలుమూలల నుండి కార్మికులు , కర్షకులు, రైతులు, మహిళలు, యువజనులు, విద్యార్థులు అందరూ కలిసికట్టుగా ఖమ్మం నగరంలో జరిగే భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎఐటియూసి భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు చిన్నపాగ శ్రీనివాసులు, భాస్కర్, రామస్వామి, రాజు, మల్లేష్ పాల్గొన్నారు.

## క్రీడలతో పల్లె నుంచి ప్రపంచ స్థాయి వరకూ గుర్తింపు



### ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్:** క్రీడలతో పల్లె నుంచి ప్రపంచ స్థాయి గుర్తింపును పొందవచ్చునని, యువతి, యువకులు, విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించి రాణించాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దమందడి మండల కేంద్రంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామ క్రీడాకారుడు స్వర్గీయ పవన్ కుమార్ జ్ఞాపకార్థం నిర్వహించే జిల్లాస్థాయి క్రికెట్ క్రీడా పోటీలను వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, గ్రామీణ స్థాయిలో నిర్వహించే ఇలాంటి క్రీడా పోటీలలో యువకుల మధ్య స్నేహభావం పెంపొందించుతోందని, దాంతో పాటు దేహదారుఢ్యం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. క్రికెట్ క్రీడా ఆడుతూనే నాగర్‌కర్నూల్ లోని క్రికెట్ మైదానంలో కుప్పకూలి అక్కడే మృతి చెందిన క్రికెట్ క్రీడాకారుడు స్వర్గీయ పవన్‌కుమార్ జ్ఞాపకార్ధం ఈ క్రీడలు నిర్వహించే నిర్వాహకులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ క్రీడను నిర్వహించేందుకు సహకరించిన యువకులకు గ్రామ గ్రామ పెద్దలను సైతం ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన క్రికెట్ ఆట ఆడి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు గంగారవి, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మాజీ సర్పంచు వెంకటస్వామి, మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు సత్యరెడ్డి, మణిగిల్ల మాజీ సర్పంచు కొండా రవీందర్ రెడ్డి, పెద్దమందడి మాజీ ఉపసర్పంచు జావేద్, న్యాయవాది త్రినాథ్, రాఘవేందర్, నాయకులు నరేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు , యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## బ్రహ్మోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని చెరుకూర్ గ్రామపంచాయతీలో ప్రతి యేటా సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహించే ఈదమ్మమాంధాత మాతంగిలజాతర బ్రహ్మోత్సవాల గోడపత్రికను శనివారం గ్రామసర్పంచ్ బచ్చలకూర శ్రీనివాస్‌తో కలిసి తెలంగాణ రాష్ట్రఫుడ్ కమీషన్‌చైర్మన్ గోలిశ్రీనివాస్‌రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో జరుపుకునే గ్రామదేవతల జాతరలు పార్టీలకు అతీతంగా కులమతాలకు అతీతంగా ఐక్యమత్యంతో జరుపుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చేర్కకొండల్, నర్సింహ్మా, రమేష్, సీనియర్ నాయకులు బాలస్వామి, వెంకటేష్, బిఆర్ఎస్ మున్సిపాలిటి కార్యదర్శి వడ్డెమోనిశివకుమార్, సైదులు గౌడ్, జగన్, రమేష్, ఎస్సిసెల్ ప్రెసిడెంట్ యాదయ్య, ప్రసాద్, కిరణ్, గణేష్, రంజిత్, యాదగిరి, శ్రీరాములు, యాదయ్య, ముజాహిద్, లలితమ్మ విమలమ్మ, ఖాజ, కుర్షితబేగం, అమృతమ్మ, కళావతి, భారతమ్మ, కృష్ణయ్య, రంజిత్, గణేష్‌నాయక్, రాము, మల్లేష్ పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తిలు ఆవిష్కరించారు.

## సిపిఐ కరపత్రాల విడుదల



**ప్రజాపక్షం/అమరచింత :** ఖమ్మం జిల్లాలో ఈనెల 18 న జరగనున్న సిపిఐ పార్టీ వందేళ్ళ పండుగ కరపత్రాలను శనివారం అమరచింత మండల పరిధిలోని కొంకనివాని పల్లెలో సిపిఐ శ్రేణులు విడుదల చేశారు. ఆ పార్టీ గ్రామ కార్యదర్శి అంజి, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుతుబ్‌లు మాట్లాడుతూ దేశంలో సిపిఐ ఆవిర్భావంతోనే శ్రమజీవులకు న్యాయం జరిగిందని అన్నారు. దేశ స్వాతంత్రం కోసం, తెలంగాణ సాయుధ పోరాటం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం, చేసిన సిపిఐ పార్టీ చరిత్ర గణనీయమని పేర్కొన్నారు. కార్మిక, కర్షక, రైతు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ పరిష్కరించడంలో సిపిఐ ముందుందని వారు పేర్కొన్నారు. సిపిఐ పార్టీ వందేళ్లు పూర్తిచేసుకుని 101వ సంవత్సరంలో పెట్టిన సందర్భంగా ఖమ్మంలో జరుగుతున్న బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ గ్రామ నాయకులు శ్రీను, రాజు, రామ్‌రెడ్డి, రాజేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్న పల్లె బురుజు



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** కొన్ని వందల సంవత్సరాల క్రితం అక్కడ ఒక గ్రామం ఉండేదని చెప్పేందుకు ఇప్పటికీ ఆనవాళ్లు దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రం వీపనగండ్ల నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో, గోవర్ధన గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ఓ బురుజు నేటికీ చరిత్రకు నిదర్శంగా నిలుస్తోంది. బురుజుకు కొద్దిదూరంలో రహదారి పక్కనే ఆంజనేయస్వామి ఆలయం దర్శనమిస్తుంది. స్థానికుల కథనాల ప్రకారం, కొన్ని వందల సంవత్సరాల క్రితం అక్కడ కామదేనుపల్లి అనే గ్రామం ఉండేది అయితే అడవి జంతువుల బెడద ఎక్కువ కావడంతో అక్కడ నివసించిన అనేక కుటుంబాలు భయంతో సమీపంలోని వెలగొండ, వీపనగండ్ల గోపాలదిన్నె గ్రామాలకు తరలివెళ్లి స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. కాలక్రమేణ గ్రామంలోని ఇళ్లన్నీ కూలిపోయి, ప్రస్తుతం ఆ గ్రామానికి గుర్తుగా బురుజు ఒక్కటే మిగిలిందని గ్రామస్తులు చెబుతున్నారు. అందుకే ఆ బురుజును ఇప్పటికీ పల్లె బురుజు అని పిలుస్తుంటారు. ఇదే కాకుండా, బ్రిటిష్ పాలన కాలంలో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వీపనగండ్ల గ్రామానికి చెందిన వంగూరు కృష్ణారెడ్డిని పట్టుకునేందుకు రజాకార్లు వచ్చిన సమయంలో, వారి నుంచి తప్పించుకునేందుకు ఆయన కొన్ని రోజుల పాటు ఈ పల్లె బురుజులో దాక్కున్నారని పెద్దలు చెప్పుకుంటున్నారు. పల్లె బురుజుకు సమీపంలో ఉన్న కామదేనువుపల్లి చెరువు కింద ప్రస్తుతం సాగుభూములు విస్తరించి, రైతులు పంటలు సాగుచేస్తున్నారు. చరిత్రను గుర్తు చేసే ఈ పల్లె బురుజును సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

## మహిళ కుటుంబానికి అండగా నిలిచిన పోలీసులు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ పట్టణం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకున్న అగ్నిప్రమాద ఘటనలో, కృష్ణవేణి అనే బీద మహిళా కుటుంబం సర్వస్వాన్ని కోల్పోయింది. కృష్ణవేణి భర్త ఆంజనేయులు గతంలో మృతి చెందగా ఆమె కూలి పనులు చేస్తూ అద్దె ఇంట్లో జీవనం సాగిస్తోంది. ఆమెకు 9వ తరగతి చదువుతున్న ఒక కుమారుడు ఉన్నాడు. శనివారం ఉదయం దేవునికి దీపం పెట్టి కూలి పనికి వెళ్లిన సమయంలో, ఉదయం సుమారు 11: 30 గంటల సమయంలో ఆమె నివాసం నుండి ఒక్కసారిగా పొగలు, మంటలు రావడంతో ఇరుగుపొరుగు వారు గమనించి వెంటనే పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందగానే వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ అప్పయ్య తమ సిబ్బందితో కలిసి తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని, ఫైర్ సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ పరిస్థితిని గమనించిన వన్ టౌన్ ఇన్స్‌పెక్టర్ అప్పయ్య మానవతా దృక్పథంతో స్పందించి, బాధిత కుటుంబానికి కట్టుకునేందుకు బట్టలు, నెల రోజుల పాటు తినేందుకు సరుకులు, వండుకునేందుకు అవసరమైన వంట పాత్రలను డిఎస్పీ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందించి ఆదుకున్నారు. ఆయన చూపిన ఈ మానవీయ సహకారానికి జిల్లా ఎస్పీ డి. జానకి, స్థానికులు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో వన్ టౌన్ సబ్ ఇన్స్‌పెక్టర్ సీనయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స పొందిన పేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం పేదలకు కొండంతవరం అవి వీపనగండ్ల సర్పంచ్ మీసాల పర్వతమ్మ, ఉన సర్పంచ్ బాలపీర, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోదల బీరయ్య, అన్నారు. వీననగండ్ల గ్రామానికి చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స పొందడంతో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మంజూరు ఐనా సీఎం రీలీప్ ఫండ్ చెక్కులను బాధితులకు అందజేశారు. యస్ అశోక్ 60 వేలు, ఎత్తం నరసింహా 40, వేలు, దయ్యాపు కృష్ణయ్య 25 వేలు, దయ్యావు సంధ్యారాణి, 16 వేలు, గడ్డల రవీందర్ 13,500, మీసాల బలకిష్టి 14 వేలు, పాము మద్దిలేటి 13వేలు, గడ్డిల రవీందర్ 8,500/నక్క బాలస్వామి 9000/మొలకపల్లి అర్జునయ్య లకు 6500/ రూపాయల చెక్కులు అందజేశారు. కార్యక్రమం లో వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ

**ప్రజాపక్షం/నర్వ :** మండలం పాతర్చేడు గ్రామంలో కురువగేరిలో ఉన్న వరద కాలువలో చెట్లను జెసిబితో తొలగించి పనులు ప్రారంభించి గ్రామ అభివృద్ధికి గ్రామ సర్పంచ్ లందకాడి లింగమ్మ, మన్యం గ్రామ ఉప సర్పంచ్ వాకిటి ఆంజనేయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లంకాల మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు బోలుబండ వెంకటేష్ , ఆత్మకూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నెట్టెంపాడు వెంకటయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వార్డు మెంబర్ సభ్యులు గద్వాల కొండన్న, పోతురాజు వెంకటన్న, జులుపల్లి ఆంజనేయులు, పశువుల నరసింహులు. ఈ కార్యక్రమంలో పాల్గొని అభివృద్ధిలో ముందున్న మా గ్రామ సర్పంచుకు ప్రత్యేక అభినందనలు గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు.



## కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలు వీడనాడాలి

**ప్రజాపక్షం/వెల్దండ :** కేంద్రప్రభుత్వం కార్మికరైతు వ్యవసాయ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వీడనాడాలని వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు అన్నారు. ఈసందర్భంగా దేశవ్యాప్తంగా చేపట్టిన ఉద్యమంలో భాగంగా కార్మిక కర్షకపోరు యాత్ర వెల్దండ ప్రారంభించారు. కార్మిక కర్షక పోరుయాత్ర సందర్భంగా వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు ముందుగా వెల్దండ మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి యాత్రను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ బిజెపిప్రభుత్వం గత 11 సంవత్సరాలుగాకేంద్రంలో అధికారం చేపట్టినప్పటినుండి ఆదాని అంబానిలాంటి బడా పెట్టుబడిదారులకు 16లక్షల కోట్ల రూపాయలు ప్రజలసంపద దోచిపెట్టిందని, అదేవిధంగా కార్మికులకు నష్టం కలిగించేవిధంగా 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటిస్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చి కార్మికహక్కులను కాలరాస్తుందని అన్నారు. ఈనెల 19వరకు గ్రామ గ్రామాన క్షేత్రస్థాయివరకు బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చివరగా 19వతేదిన నాగర్‌కర్నూల్‌లో జరిగే బహిరంగసభలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నర్సింహ్మా, రైతుసంఘం జిల్లాఅధ్యక్షులు బాల్‌రెడ్డి, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, అంగన్‌వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాసమ్మ, భవననిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, హమాలీయూనియన్ నాయకులు ఆంజనేయులు, వెంకటేష్, డివైఎఫ్ఐ నాయకులుశ్రీనివాసులు, గిరిజన సంఘం జిల్లా నాయకులు లక్పతి, శివ, తిరుపతయ్య, స్వప్న, యాదయ్య, ప్రభాకర్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

## మొబైల్ పోలీసులకు అప్పగింత

**ప్రజాపక్షం/ కొత్తకోట :** అజ్జకొల్లు గ్రామానికి చెందిన ఎం.వెంకట్రాములు, కె. జగదీష్ వారి గ్రామం నుంచి కొత్తకోటకు బైక్‌పై వస్తుండగా, కొత్తకోటలోని స్ఫూర్తి స్కూల్ దగ్గర ఒక మొబైల్ ఫోను దొరికింది. అట్టి మొబైల్ ఫోన్ వారు నిజాయితీతో కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించిన వారిని కొత్తకోట సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.ఆనంద్, పోలీస్ సిబ్బంది అభినందించారు. లభించిన వస్తువులను పోలీసులకు అప్పగించడం ద్వారా మంచి పౌర భాద్యత, సమాజంలో మంచి పేరు, ప్రతిష్ట, ఇతరుల నుండి గౌరవం కలుగుతుంది అని పేర్కొన్నారు.



## సిపిఐ క్యాడర్ సమాయత్తం కావాలి

జాతీయ మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లేశ్వరి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఈనెల 18న ఖమ్మం పట్టణంలో సిపిఐ బారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు సిపిఐ క్యాడర్, సానుభూతిపరులు సమాయత్తం కావాలని జాతీయ మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి అన్నారు. శనివారం బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ కార్పోరేట్ మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఐ లౌకిక శక్తులను ఏకం చేసేందుకు ఈ బహిరంగ సభ తోడ్పడుతుందన్నారు. రైతులు, కార్మికులు పేదల సమస్యల పరిష్కారానికి సిపిఐ నిరంతరం ఉద్యమిస్తుందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నీరుగార్చేలా కేంద్ర ప్రభుత్వం మార్పులు చేయడానికి తప్పు పట్టారు. అన్ని వర్గాల ప్రజలు భారీగా హాజరై సిపిఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు సుందరి పద్మ, బండి ప్రమీల, లలిత, జ్యోతి, హాసీనా, రవళి, ఆస్మా, శైలజ, బేబి, లక్ష్మి పాల్గొన్నారు.

## ఇంటికో మనిషి, ఊరుకో బండి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/కోదాడ:** వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ ముగింపు సభలను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం కోదాడలోని సిపిఐ కార్యాలయంలో జిల్లా ఎఐటియుసి విస్తృత కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 18న ఖమ్మంలో లక్షలాది మందితో జరిగే ర్యాలీ, బహిరంగ సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక, కర్షక, పేద ప్రజల పక్షాన 100 సంవత్సరాలుగా పోరాడుతున్న ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ అని, దేశంలో ఎన్నో సూదీర్ఘ పోరాటాలు, ఆందోళనలు నడిపి నేటికి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ముంగిపు సభను జయప్రదం చేయాలని కోరారు. ఇంటికో మనిషి, ఊరుకో బండి చేయి చేయి కలుపుదాం ఖమ్మం ఖిల్లాకు నడుద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్, నాయకులు షేక్ లతీఫ్, సుధాకర్‌రెడ్డి, శ్యామల అశోక్, ఎస్.రాఘవరెడ్డి, శ్రీనివాస్, ఎస్‌కె బాబు, రాఘవులు, కాంతారావు, జాని, కొండలు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## మాదాపూర్ శివారులో గుప్త నిధుల తవ్వకాల కలకలం

ఆరుగురు అరెస్ట్





**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరిజిల్లా తుర్కపల్లి మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులో గుప్త నిధుల తవ్వకాలు కలకలం రేపాయి తుర్కపల్లి ఎస్సై మహమ్మద్ తక్యుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం తుర్కపల్లి మండలంలోని మాదాపూర్ శివారు కేవ్ల తండా శివారు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారన్నా సమాచారంతో నిందితుల గుట్టును పసిగట్టి ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో పులి కుమారస్వామి(ఈసిఐఎల్), రామినేని కృష్ణ కిషోర్, పాబోలు శ్రీనివాస్, ఆకుల నరసింహ రావు(విజయవాడ), తాత కృష్ణ కాంత్(ఖమ్మం), పల్లపు వేణు(బొమ్మలరామారం) చెందినవారు అని, వారి వద్దనుంచి ఒక హిటాచి, కారు, పూజా సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మూఢనమ్మకాలు, క్షుద్ర పూజలను నమ్మొద్దని, వాటిని ప్రోత్సహించొద్దని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుప్త నిధుల త వ్వకాలు గురించి ఎలాంటి సమాచారం ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## సామాజిక సేవకు గుర్తింపుగా శ్రీనివాస్‌రెడ్డికి డాక్టరేట్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సామాజిక సేవకు గుర్తింపుగా డాక్టరేట్ శాలిగౌరారం మండలం పెరక కొండారం గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి కి భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ వారు డాక్టరేట్ కు ఎంపిక చేసి శనివారం బెంగళూరులో హోటల్ ఎజె ఇంటర్నేషనల్ నందు యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ తంగవేణి చేతుల మీదగా అందుకున్నారు.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1965 లో స్థాపించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా నాకు సేవ చేసే అవకాశం రావడం తను చేసిన సామాజిక సేవకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ లభించడం చాలా సంతోషదాయకమని ఈ డాక్టరేట్ తో నాలోఉన్న సామాజిక సేవ అనే భావన రెట్టింపు చేసిందన్నారు.సామాజిక సేవ చేయడానికి తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులకి, నా భార్య ప్రవళిక నా కూతుర్లు ఆధ్యా,అన్విరెడ్డి,డాక్టరేట్ ఎంపిక చేసిన యూనివర్సిటీ, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# ప్రజా సమస్యలు వెలికితీస్తున్న 'ప్రజాపక్షం'



క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న పత్రిక ప్రజాపక్షం పత్రిక అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో రహదారి బంగ్లాలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రజల వారధిగా పనిచేస్తూ ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి ప్రజల సమస్యలను వెలికి తీయడంలో స్వచ్ఛందంగా కృషి చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి పింగల్ రెడ్డి, పంజాల రామాంజనేయులు గౌడ్, ఫోటోల శ్యామ్ గౌడ్, సింగల్ విండో మాజీ చైర్మన్ మెట్టు శ్రీనివాస రెడ్డి, గడ్డం బాల్‌రెడ్డి, సురకాంటి సత్తిరెడ్డి, గోలి నరేందర్ రెడ్డి, సంధిగారు బసవయ్య, గోలి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



ప్రజాపక్షం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మాడుగులపల్లి :** ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకొస్తున్న ప్రజాపక్షం దిన పత్రికను ఎస్ఐ ఎస్ కృష్ణయ్య ప్రశంసించారు. మండల కేంద్రంలో శనివారం ప్రజాపక్షం నూతనంగా2026 క్యాలెండర్ ఆవిష్కరించారు.సీనియర్ విలేకరి అమరారపు తిరుమలేష్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సంఘటనలు,ప్రజల సమస్యలు, ప్రభుత్వ కార్యక్రమాలు,రాజకీయలు,విద్య వైద్య వంటి అంశాలను ప్రజలకు చేరవేయడం, ప్రభుత్వ పాలనపై నిఘా ఉంచడం,ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజాపక్షం పత్రికను ప్రజలు ఆదరించాలని కోరారు. ఏఎస్ఐ పుట్టల వెంకటేశ్వర్లు,జమిందార్ శ్రీనివాస్,చిరుమర్తి సర్పంచ్ కూరెళ్ల నాగమణి వెంకటాచారి,రైటర్ వాంకుడోతు శ్రీనివాస్,ప్రజాపక్షం విలేకరి వల్లపుదాసు రమేష్‌పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ ధ్యేయం

కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల వ్యవధిలోనే ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలుపుకుంటుందని తెలిపారు. శనివారం కోదాడ మండలం తొగర్రాయి గ్రామంలో నిర్వహించిన గిరిజనుల ఆరాధ్యదైవాలు సమ్మక్క సారక్క జాతరలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. అమ్మవార్ల అశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, రైతాంగానికి సమృద్ధిగా వర్షాలు పడి పంటలు పండాలని కోరారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఆమె ప్రారంభించారు. పూజారి గౌని సైదమ్మ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి, గాజులు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం కాంగ్రెస్ హామీలే ప్రజల జీవితాల్లో మార్పు గృహ జ్యోతి కార్యక్రమంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క రాసిన లేఖను అందజేశారు.

## అంతర్రాష్ట్ర థార్ గ్యాంగ్ ముఠా సభ్యుడు అరెస్ట్

నిందితుడు నుండి బంగారు ఆభరణాలు స్వాధీనం




**ప్రజాపక్షం/ నల్లగొండ :** బస్సులలో బంగారు ఆభరణాలను దొంగలించే అంతరాష్ట్ర థార్ గ్యాంగ్ ముఠా సభ్యుడిని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తో నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ వెల్లడించారు.శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో దొంగల ముఠా సభ్యులను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌సి మాట్లాడుతూ15 రోజుల పాటు మధ్యప్రదేశ్‌లోని థార్ జిల్లాను జల్లెడపట్టి అంతరాష్ట్ర థార్ గ్యాంగ్ దొంగల ముఠా సభ్యుడి నీ సిసిఎస్ పోలీసులు అరెస్టు చేసి నిందితుడి వద్ద నుండి దొంగలించిన రూ.85 లక్షల విలువగల ఇంటాక్ట్ ప్రాపర్టీ 600 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.ముఠాలోని ఐదుగురు అలవాటు పడిన నేరస్తులేనని గతంలో ఆంధ్రప్రదేశ్,మహారాష్ట్ర మధ్యప్రదేశ్ రాష్ట్రంలలో నిందితులుగా ఉన్నారని, పరారీలో ఉన్నమిగితా నేరస్తులను కూడా అతి త్వరలో పట్టుకుంటామని పేర్కొన్నారు. ఈ ముఠా సభ్యులను సిసిఎస్, ఇన్స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి పర్యవేక్షణలో పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన,చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు ,సిసిఎస్ ఎస్ఐ శివ కుమార్, సిసిఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన గిరి,పుష్పగిరి, నాగరాజు,కానిస్టేబుల్స్ వెంకటేష్,సాయికుమార్,జూనేద్,శివరాజు, మహేశ్, కమల్ కిశోర్,చిన్న బాబు,ఇతర సిసిఎస్ సిబ్బందిని జిల్లా ఎప్‌పి ప్రత్యేకంగా అభినందించి రివార్డును ప్రకటించారు.

## హెల్మెట్ ధరించినప్పుడే ప్రాణరక్షణ

ఎస్‌పి శరత్‌చంద్రపవార్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ద్విచక్ర వాహన దారులు హెల్మెట్‌ను ధరించినప్పుడే ప్రాణాలకు రక్షణ ఉంటుందని జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంపులో 500 మంది ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేసి వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని హెల్మెట్ ధరించక పోతే బంక్‌లలో పెట్రోల్ పోయరాదని పెట్రోల్ బంక్ యజమానులకు సూచించారు. నో హెల్మెట్ నో పెట్రోల్ విధానాన్ని ఖచ్చితంగా పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల వాయు కాలుష్యం నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. తగిన ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనదారులు వ్యవహరించాలన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రతి ఒక్కరు ఖచ్చితంగా హెల్మెట్‌ను ధరించాలని అందుకోసం గతంలో నియోజకవర్గ వ్యాప్తంగా హెల్మెట్లను పంపిణి చేశానన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకోని హెల్మెట్లను ఉచితంగా పంపిణి చేశామన్నారు. అనంతరం హెల్మెట్ల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2వేల మందితో పట్టణంలో ద్విచక్ర వాహనాలపై హెల్మెట్‌లు ధరించి ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐలు నాగభూషణరావు, సోమనర్సయ్య, పీఎన్‌డి. ప్రసాద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఒపిఎం మాదకద్రవ్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



**ప్రజాపక్షం/చిట్యాల :** అక్రమంగా ఓపీఎం పాపి హస్క్ అనే మాదకద్రవ్యాన్ని లారీ డ్రైవర్లకు విక్రయిస్తున్న నిందితున్ని అరెస్టు చేసినట్లు నల్లగొండ డిఎస్‌పి కె శివరాం రెడ్డి తెలిపారు. శనివారం చిట్యాల పట్టణంలోని సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణ శివారులో జాతీయ రహదారి 65పై ఉన్న దూన్ పంజాబీ దాబాలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌కు చెందిన దాబా యజమాని గుర్నిత్ సింగ్ గత కొంతకాలంగా నిషేధిత మాదకద్రవ్యమైన ఓపియం పాపి హస్క్ ఉందని దానిని దాబాలోని కస్టమర్లకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి సుమారు 10 గంటలకు దాబాకు వెళ్లి యజమాని గుర్నిత్ సింగ్ నిషేధిత ఓపియం పాపి హస్క్ ను వాహనదారులకు విక్రయిస్తుండగా పట్టుబడి చేశారు.అనంతరం ఎస్ఐ మామిడి రవికుమార్ దాబా యజమానిని విచారించగా సులభంగా డబ్బు సంపాదించేందుకు గాను లారీ డ్రైవర్ల నుండి తాను ఓపిఎం పాపి హస్కును ఒక్క కిలో రూ.1800 కొనుగోలు చేసి దానిని తిరిగి కిలో రూ.6000 చొప్పున వాహనదారులకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు.కొద్దిరోజుల క్రితం 10 కిలోల ఓపియం పాపి హస్క్ కొనుగోలు చేసి అందులో సుమారు ఒక కిలో కస్టమర్లకు విక్రయించి మిగిలిన 9 కిలోల ఓపియం పాపి హస్కును దాబా లోని తన గదిలో దాచి పెట్టినట్లు తెలిపారు.దాబా యజమాని నుండి రూ.54000 రూపాయల నగదు,9 కిలోల ఓపియం పాపి హస్క్,ఒక స్మార్ట్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి సరఫరా అమ్మే వ్యక్తులపైనే కాకుండా సేవించే వ్యక్తుల పైన కూడా చట్టపరమైన శిక్షలు తీసుకుంటామన్నారు.మాదక ద్రవ్యాల ఎవరైనా విక్రయించిన సేవించిన 100 నెంబర్‌కు గాని లేదా 8712670266 నెంబర్కు గాని సమాచారం అందించినట్లయితే వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో నార్కట్ పల్లి సీఐ కె నాగరాజు, చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్,మునుగోడు ఎస్ఐ ఇరిగి రవి, సిబ్బంది ఉన్నారు.

## గంజాయి కేసులో పట్టుబడ్డ నిందితులు

నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** అక్రమ మాదకద్రవ్యాలు సరఫరా చేసినా, అమ్మినా ఎవరైనా వినియోగించిన ఉపేక్షించే లేదని కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ డిఎస్‌పి కె శివరాం రెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని టూ టౌన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయిని అక్రమంగా విక్రయిస్తూ ఉన్న ఇద్దరి నిందితుల ను రూరల్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి 4.6 కిలోల గంజాయిని, రెండు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. గంజాయి విలువ రూ.15 వేలు ఉంటుందని మొదటి నిందితుడు హైదరాబాద్ లోని అబ్దుల్ సాగర్ ధవభీ ఘాట్ మల్లేపల్లి కి చెందిన సయద్ మాజిద్, రెండవ నిందితుడు మొహమ్మద్ సోహైల్ అలీ,శివ రెడ్డి పరారీలోఉన్నాడని అతని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.నిందితులు ఇద్దరు గత రెండు సంవత్సరాల నుండి తమ స్నేహితుల ద్వారా కలిసి గంజాయి సేవించడం ప్రారంభించరని.ఆ తర్వాత గంజాయి అమ్మడం ద్వారా సులభంగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని తెలుసుకొని, గత 4 నెలల నుండి ఒడిశాలో గంజాయి అమ్మే శివ రెడ్డి ఏ పాబ్లో ఎస్కోబార్ అనే వ్యక్తితో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకొని,ఇద్దరు పలుమార్లు ఒడిశాకు పలు మార్లు వెళ్లి గంజాయిని తక్కువ ధరకు అనగా గంజాయికిలోకు రూ 3000 రూపాయల చొప్పున,సుమారు 2,3 కిలోలు గంజాయిని కొనుగోలు చేసిహైదరాబాద్ కి వచ్చి,అట్టి గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి ప్యాక్ చేసి అవసరం ఉన్న కస్టమర్లకు ఒక్కో ప్యాకెట్‌ను రూ 500. చొప్పున అధిక ధరకు అమ్మి డబ్బులు సంపాదించే వారని తెలిపారు.

# 'హస్తం' పార్టీ అస్తవ్యస్తం..!

ఎవరికి వారే యమునా తీరే...
మున్సిపల్ ఎన్నికలకు ముందే మొదలైన ముసలం...!
ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు...

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అస్తవ్యస్తంగా మారింది. నాయకులు ఎవరికి వారే యమునా తీరేగా వ్యవహరించడంతో ఆ పార్టీలో ఏమి జరుగుతుందో కూడా స్వంత పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కూడా అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. నాయకుల మధ్య సఖ్యత లేకపోవడంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన మూడు సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఆ పార్టీ నుండి పోటీ చేసిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఓటమి చెందారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డికి పార్టీ అధిష్టానం నియోజక వర్గ ఇంచార్జీగా నియామకం చేసింది. ఆయన 01 అక్టోబర్ 2025లో అకాల మరణం పొందారు. దీంతో సూర్యాపేట నియోజక వర్గంలో పార్టీ ఇంచార్జి పదవి ఖాళీగా ఉంది. పార్టీ అధిష్టానం ఈ ఇంచార్జి బాధ్యతలను ఎవరికి అప్పగించకపోవడంతో పార్టీకి పెద్దదిక్కు ఎవరన్నది నాయకులు, కార్యకర్తల్లో కూడా అయోమయం నెలకొంది. పార్టీలో గత తొమ్మిదేండ్ల నుండి దామోదర్ రెడ్డి వర్సెస్ పటేల్ రమేష్ రెడ్డి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ కోసం ఇరువురి మధ్య తీవ్ర పోటీ నెలకొనగా రమేష్ రెడ్డిని బుజ్జగించి పార్టీ అధిష్టానం దామోదర్ రెడ్డికి టిక్కెట్ ఖరారు చేసింది. పార్టీ అధికారంలోకి వస్తే మంచి పదవిని ఇస్తామంటూ ఆశ చూపి అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నామినేటెడ్ పోస్టు కట్టబెట్టింది. అయినా ఆధిపత్య పోరు మాత్రం సమసిపోలేదు. దీంతో నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ రెండుగా విడిపోయి ఎవరికి వారే కార్యక్రమాలు చేసుకుంటూపోయారు. దామోదర్ రెడ్డి మరణానంతరం ఆయన కుమారుడు సర్వోత్తమ్ రెడ్డి క్రియాశీలక రాజకీయాల్లోకి ఆరంగేట్రం చేశారు. సూర్యాపేట నియోజక వర్గంతోపాటు తుంగతుర్తి నియోజక వర్గంలో కూడా ఆయన విస్తృతంగా పార్టీ కార్యక్రమాలు చేపడుతూ పార్టీ క్యాడర్‌కు అందుబాటులో ఉంటున్నారు. పటేల్ రమేష్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ హోదాలో సూర్యాపేట నియోజక వర్గంలో ఎక్కువ సమయాన్ని కేటాయిస్తూ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఈ ఇరువురు నాయకులు పార్టీ నియోజక వర్గ ఇంచార్జీ పదవిని ఆశిస్తూ అధిష్టానం వద్ద తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.





మున్సిపల్ ఎన్నికల ముందే కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య ముసలం మొదలైంది. నాయకుల మధ్య ఎన్ని విభేదాలు ఉన్నా ఎన్నికల ముందు అవన్ని పక్కకు పెట్టి అందరూ కలిసి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాల్సిన బాధ్యత ఉంది. కానీ గత ఆనవాయితీనే దామోదర్ రెడ్డి తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పటేల్ రమేష్ రెడ్డిలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలను నిర్వహిస్తామని ప్రకటించడం, రాష్ట్ర ఎన్నికల కమీషన్ దానికి సంబంధించిన ఏర్పాట్లలో తలమునకలు కావడంతో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు తమకు ముందుగా దరఖాస్తు చేసుకుంటే సర్వే నిర్వహించి దాని ఆధారంగా టిక్కెట్లు కేటాయిస్తామని ప్రకటించారు. టిక్కెట్‌ను ఆశిస్తున్న వారి నుండి దరఖాస్తులను స్వీకరించడం కూడా మొదలుపెట్టారు. ఈ సమావేశానికి పటేల్ వర్గీయులు ఎవరూ కూడా హాజరుకాలేదు. అనంతరం మరో నాలుగు రోజుల తరువాత పటేల్ రమేష్ రెడ్డి కూడా మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. రెండు రోజుల నుండి అతను కూడా మున్సిపల్ ఎన్నికల బరిలో నిలువాలనుకునే వారినుండి దరఖాస్తులు స్వయంగా స్వీకరిస్తున్నారు. పార్టీ నాయకులు రెండు వర్గాలుగా చీలడంతో ఎన్నికల్లో టిక్కెట్‌ను ఆశిస్తున్న వారు ఎవరి వద్ద దరఖాస్తు చేసుకోవాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ఇరువర్గాల దగ్గర దరఖాస్తు చేసుకున్న వారు తమకు టిక్కెట్ వస్తుందా రాదా అనే సందిగ్ధంలో పడ్డారు.

ఇరువర్గాల వారు మున్సిపల్ సన్నాహక సమావేశాలు నిర్వహించినప్పుడు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. అసలైన కాంగ్రెస్ వాదులం మేమే అనేలా ఎవరికి వారు ప్రసంగాలు చేశారు. పటేల్ రమేష్ రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి కాంగ్రెస్ పార్టీ ఎవరి జాగీరు కాదని తీవ్రంగా హెచ్చరిస్తూ డబ్బులకు టిక్కెట్లు అమ్ముకునేందుకే దరఖాస్తుల స్వీకరణ తెరమీదకు తెచ్చారంటూ తీవ్ర ఆరోపణలు చేయడం జరిగింది. టిక్కెట్ కోసం డబ్బులు అడిగే వారిని ఉరికిచ్చి కొట్టండి అంటూ చేసిన ప్రసంగం సోషల్‌మీడియాలో వైరల్ అవుతుంది. దీనికి స్పందిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య మీడియాతో మాట్లాడుతూ పార్టీ అధిష్టానం మేరకే దరఖాస్తుల స్వీకరణ చేపట్టామని చెప్పుకొచ్చారు. నాయకులను, కార్యకర్తలను కొంతమంది గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఏదిఏమైనా మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టిక్కెట్ కేటాయించి సూర్యాపేట మున్సిపాలిటిపై మూడు రంగుల జెండాను ఎగురవేస్తామని చెప్పుకొచ్చారు.

# ముంబై.. అదిరే బోణీ

## ఢిల్లీపై పంజా విసిరిన కారీ, హర్మన్‌ప్రీత్..



డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్ బోణీ కొట్టింది. తొలి మ్యాచ్‌లో ఆఖరి ఓవర్ వరకూ పోరాడి ఓడిన ముంబై.. ఈసారి ఢిల్లీ క్యాపిటల్స్‌పై పంజా విసిరింది. హర్మన్‌ప్రీత్ కౌర్(74) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు.. నాట్ సీవర్ బ్రంట్(70) మెరుపులతో భారీ స్కోర్ చేసిన ముంబై.. ఆ తర్వాత నికోలా కారీ(3–37) చెలరేగడంతో ఢిల్లీని పడగొట్టింది. చిన్నెల్లె హెన్రీ(56) అర్ధ శతకంతో ఆశలు రేపినా.. అవతలివైపు నుంచి ఆమెకు సహకరించేవాళ్లే కరువయ్యారు. దాంతో.. 196 పరుగుల ఛేదనలో ఢిల్లీ 145కే పరిమితమైంది. మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో ముంబై ఇండియన్స్ పాయింట్ల ఖాతా తెరిచింది. ఆరంభ మ్యాచ్‌లో చేజారిన విజయాన్ని రెండో మ్యాచ్‌లో పట్టేసింది. మొదట కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(74), నాట్ సీవర్ బ్రంట్(70) అర్ధ శతకాలతో చెలరేగి జట్టుకు కొండంత స్కోర్ అందించారు. అనంతరం నికోలా కారీ(3–37), అమేలియా కేర్(3–24)ల ధాటికి ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు క్రీజులో నిలువలేకపోయారు. 50 పరుగుల తేడాతో గెలుపొందిన ముంబై ఘనంగా బోణీ చేసింది.

### కారీ ఒకే ఓవర్లో

భారీ ఛేదనలో ఢిల్లీకి పవర్ ప్లేలోనే వరుసగా షాక్‌లు తగిలాయి. ఓపెనర్ లిజెల్లే లీ(10)ని నాట్ సీవర్ బ్రంట్ ఔట్ చేసి తొలి బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత బంతి అందుకున్న నికోలా కారీ(3–22) ఒకే ఓవర్లో షఫాలీ వర్మ(8), లారా వొల్వార్డ్ట్(9)లను బౌల్డ్ చేసి ఢిల్లీని దెబ్బ కొట్టింది. ఆ తర్వాత షబ్నం ఇస్మాయిల్ ఓవర్లో జెమీమా రోడ్రిగ్స్(1) ఔటయ్యింది. స్లిప్‌లో బౌండరీ కోసం తను కట్ షాట్ ఆడగా వికెట్ కీపర్ కమలిని కుడివైపు డైవ్ చేస్తూ ఒంటిచేత్తో అద్భుతంగా బంతిని అందుకుంది. దాంతో. 33కే ఢిల్లీ నాలుగు వికెట్లు కోల్పోయింది. ఢిల్లీని గట్టెక్కించాలనుకున్న మరినే కాప్(10) ఒక సిక్సర్, ఫోర్ బాది క్రీజులో నిలబడేలా కనిపించింది. కానీ, కారీ ఓవర్లో తను కూడా క్యాచ్ ఇచ్చి డగౌట్ చేరింది. అంతే.. 46కే సగం వికెట్లు కోల్పోయింది ఢిల్లీ. ప్రస్తుతం నిక్కీ ప్రసాద్(12), చిన్నెల్లె హెన్రీ(56)లు దూకుడుగా ఆడారు. అవసరమైన రన్‌రేట్ పెరిగిపోవడంతో అమేలియా ఓవర్లో పెద్ద షాట్ ఆడాలనుకున్న నిక్కీ బౌల్డయ్యింది. ఓవైపు వికెట్లు పడుతున్నా హెన్రీ మాత్రం బౌండరీలతో చెలరేగింది. కారే ఓవర్లో భారీ సిక్సర్‌తో అర్ధ శతకం పూర్తి చేసుకున్న తను.. అమేలియా బౌలింగ్‌లో పెద్ద షాట్ ఆడబోయి బండరీ వద్ద కారీ చేతికి దొరికింది. హెన్రీ వికెట్‌తో ఢిల్లీ ఓటమి ఖాయమైంది. 19వ ఓవర్లోనే 145కు ఆలౌటైన ఢిల్లీ 50 పరుగుల తేడాతో భారీ ఓటమిని మూటగట్టుకుంది.

## జెమ్మీకి సునీల్ సర్‘ప్రైజ్’



భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ నుంచి టీమ్ ఇండియా మహిళా క్రికెట్ స్టార్ జెమీమా రోడ్రిగ్స్‌కు అరుదైన బహుమతి లభించింది. గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అరుదైన బ్యాట్ ఆకారంలో ఉన్న గిటార్‌ను జెమీమాకు గవాస్కర్ బహుమతిగా ఇచ్చారు. శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఈ ప్రత్యేక బహుమతి ఇచ్చి జెమీమాను ఆశ్చర్యపరిచారు. ఇక ఈ గిటారుతో వీరిద్దరూ ఫొటోలకు ఫోజులిస్తూ సందడి చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. కాగా, గతేడాది జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై సెమీఫైనల్‌లో జెమీమా 127 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడి జట్టును ఫైనల్‌కు చేర్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో టీమ్ ఇండియా కనుక కప్పు గెలిస్తే.. జెమీమా గిటార్ వాయిస్తుంటే తాను పాట పాడుతానని గవాస్కర్ వాగ్దానం చేశారు. ఇక ఫైనల్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించి కప్పు గెలిచింది. దీంతో అప్పుడు ఇచ్చిన హామీని గవాస్కర్ ఇప్పుడు నెరవేర్చుకున్నారు.

## ఓడిన సింధు



హైదరాబాద్: స్టార్ షట్లర్ పివి సింధు.. మలేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీస్‌లో ఓటమి పాలైంది. చైనా క్రీడాకారిణి వాంగ్ జిహి చేతిలో ఆమె పరాజయాన్ని చవి చూసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ టూ ప్లేయర్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 16–21, 15–21 స్కోరుతో సింధుపై సునాయాస విజయాన్ని నమోదు చేసుకున్నది. చైనీస్ ప్లేయర్ దూకుడు ముందు సింధు తేలిపోయింది. కాలికి గాయం కావడం వల్ల గత అక్టోబర్ నుంచి ఆటకు దూరంగా ఉన్న పివి సింధు చాలా గ్యాప్ తర్వాత తొలి టోర్నమెంట్ ఆడింది. రెండో గేమ్‌లో 11–6 స్కోరుతో లీడింగ్‌లో ఉన్నా.. ఆ తర్వాత తన పట్టు కోల్పోయింది. సింధు ఓటమితో మలేషియా ఓపెన్ టోర్నీలో ఇండియన్ ప్లేయర్ల స్టోరీ ముగిసింది. వాస్తవానికి సింధు ఈ మ్యాచ్ ఆరంభంలో తన సామర్థ్యానికి తగినట్లు ఆడింది. హార్డ్ హిట్టింగ్ చేసింది. క్రాస్ కోర్టు స్మాష్‌లతో ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టింది. ఓ దశలో52 తేడాతో తొలి గేమ్‌లో ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కానీ ఆ తర్వాత వాంగ్ ఊపందుకున్నది. ఓ దశలో 13–13 పాయింట్లతో తీవ్ర పోటీపడ్డారు. ఇక 15–14 స్కోరు ఉన్నప్పుడు వాంగ్ తన ప్రతాపాన్ని చూపింది. సింధుపై తీవ్ర వత్తిడి తెచ్చింది. ఏకధాటిగా షాట్లతో చెలరేగింది. ఆ జోరుకు పీవీ సింధు చేతులెత్తేసింది. రెండో గేమ్ ఆరంభంలో కూడా సింధు దూకుడుగా ఆడినా.. రెండో హాఫ్‌లో వాంగ్ తన స్ట్రోక్ ప్లేతో ప్రత్యర్థిని చిత్తు చేసింది.




## ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్): సెన్సెక్స్ 83,576.24 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 85,762.01 పాయింట్లు. నష్టం 2185.77 పాయింట్లు). జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్): నిఫ్టీ 25,683.30 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 26,328.55 పాయింట్లు. నష్టం 645.25 పాయింట్లు). (ఈ వారం భారత ఈక్విటీ మార్కెట్ అంతర్జాతీయ మొదట సానుకూల వాతావరణంలో కొనసాగినప్పటికీ, వారాంతంలో తీవ్ర పతనం తప్పలేదు. మొదటి వాణిజ్య దినం నూతన సంవత్సర మొదటి వారంలో సెన్సెక్స్, నిఫ్టీ రెండూ పూర్వ రికార్డులతో పాటు స్థిరంగా ఉన్నప్పటికీ, వారాంతంలో తీవ్ర నష్టాలు సంభవించాయి. జనవరి 4–6: సంవత్సర ప్రారంభంలో సెన్సెక్స్ 26,300కు పైగా నిఫ్టీ రంగం పాజిటివ్ భావనతో కొనసాగినప్పటికీ, మధ్యలో విశ్లేషకులు కొన్నిసార్లు స్వల్ప లాభాల వద్ద నిలిచాయి. జనవరి 7–9: వారంలో చివరి మూడు రోజుల్లో సూచీలు వరుసగా దిగిపోయాయి. ముఖ్యంగా 8వ రోజు సెన్సెక్స్ – 780 పాయింట్లతో తీవ్రత తగ్గిపోయినట్లు కనిపించింది. 9వ రోజున కూడా సెన్సెక్స్– 604 పాయింట్లతో భారీ నష్టంతో ముగిసింది. నిఫ్టీ సైతం ఇదే రీతిలో పతనాన్ని చవిచూసింది).

## స్పష్టమైన అడుగులు..

ఈ వారం తీవ్ర హెచ్చుతగ్గులతో అయోమయానికి గురైన బంగారం, వెండి మార్కెట్‌కు ఇప్పుడు స్పష్టమైన దిశ కనిపిస్తోంది. మార్కెట్ నిపుణుల అంచనాల ప్రకారం విలువైన లోహాలు కొత్త అప్‌ట్రెండ్‌లోకి ప్రవేశించే సంకేతాలు బలపడుతున్నాయి. శనివారం హైదరాబాద్ రిటైల్ మార్కెట్లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర ఒక్కరోజులోనే రూ.1,000 పెరిగి రూ.1,29,000కు చేరగా, పౌన్ బంగారం ధర రూ.800 పెరిగి రూ.1,03,200గా నమోదైంది. వెండి ధర కిలోకు రూ.7,000 పెరిగి రూ.2,75,000కు చేరింది. ప్లాటినం 10 గ్రాములకు రూ.1,020 పెరిగి రూ.65,580గా ఉంది. అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ఔన్స్ ధర 4,460 డాలర్ల నుంచి 4,509 డాలర్ల వరకు ఎగబాకింది. దేశీయంగా ఎంసిఎక్స్ మార్కెట్లో కూడా బంగారం ఉదయం నష్టాలను తుడిచిపెట్టి 10 గ్రాములకు రూ.1,38,875 వద్ద ముగిసింది, వెండి రూ.2,52,002 వద్ద స్థిరపడింది. ఈ వారం మొత్తం మీద అంతర్జాతీయ మార్కెట్లో బంగారం దాదాపు 4 శాతం లాభాన్ని నమోదు చేసింది. అమెరికా డిసెంబర్ ఉద్యోగ గణాంకాలు అంచనాలకు తక్కువగా రావడం, ఉద్యోగ సృష్టి మందగించడం, ఆర్థిక మందగమన సంకేతాలు కనిపించడం వల్ల ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది వడ్డీ రేట్లు కనీసం 50 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చన్న అంచనాలు పెరిగాయి. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం వంటి వడ్డీ లేని ఆస్తులపై డిమాండ్ పెరగడం సహజం కావడంతో ధరలకు బలమైన మద్దతు లభిస్తోంది. దీనికి తోడు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కూడా పెట్టుబడిదారులను సురక్షిత పెట్టుబడుల వైపు మళ్లిస్తున్నాయి. ఈ అన్ని అంశాల సమిష్టి ప్రభావంతో సమీప కాలంలో బంగారం, వెండి ధరలు మరింత బలపడే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

## ఇక... రిస్క్ ఆధారిత బీమా


భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) రిస్క్ ఆధారిత డిపాజిట్ బీమా ప్రీమియం వ్యవస్థకు ఆమోదం తెలిపింది. దశాబ్దాలుగా అమలులో ఉన్న ఫ్లాట్‌రేట్ విధానానికి బదులుగా, బ్యాంకుల ఆర్థిక స్థిరత్వం (సౌండ్నెస్), రిస్క్ ప్రొఫైల్‌కు అనుసంధానమైన కొత్త విధానాన్ని తీసుకురానుంది. ఈ విధానం 2026–27 ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి వస్తుంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఫ్లాట్‌రేట్ ప్రీమియం విధానాన్ని రద్దు చేసి, బ్యాంకుల ఆర్థిక బలం, రిస్క్ స్థాయిని బట్టి ప్రీమియం నిర్ణయించే రిస్క్‌బేస్డ్ ప్రీమియం (ఆర్‌బిపి) మోడల్‌ను ప్రవేశపెట్టింది. 1962 నుంచి డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డిఐసిజిసి) ఫ్లాట్ రేట్ ఆధారిత డిపాజిట్ బీమా పథకాన్ని నిర్వహిస్తోంది. ప్రస్తుతం బ్యాంకులు ప్రతి రూ.100 అంచనా డిపాజిట్లపై 12 పైసలు ప్రీమియంగా చెల్లిస్తున్నాయి. కాగా, ఫ్లాట్‌రేట్ విధానంలో అన్ని బ్యాంకులు ఒకే రేటు చెల్లించాల్సి రావడం వల్ల, ఆర్థికంగా బలమైన బ్యాంకులు ప్రమాదకర స్థితిలో ఉన్న బ్యాంకులకు పరోక్షంగా సబ్సిడీ ఇస్తున్న పరిస్థితి ఏర్పడుతోంది. రిస్క్ ఆధారిత విధానం ద్వారా ప్రతి బ్యాంకు తన రిస్క్ స్థాయికి అనుగుణంగా బీమా ఖర్చు భరించాల్సి ఉంటుంది. దీంతో మంచి పాలన, సరిపడా మూలధనం (క్యాపిటల్ అడిక్వసీ), జాగ్రత్తైన రిస్క్ మేనేజ్‌మెంట్‌కు ప్రోత్సాహం లభిస్తుంది.ఈ మార్పు అతిగా రిస్క్ తీసుకునే ధోరణిని తగ్గించి, మార్కెట్ క్రమశిక్షణను మెరుగుపరుస్తుంది. అదే సమయంలో డిపాజిటర్ల రక్షణలో ఎలాంటి తగ్గదల లేకుండా, దేశంలోని ఆర్థిక స్థిరత్వాన్ని మరింత బలపరుస్తుంది.




‘బిజినెస్’ శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై ‘ప్రజాపక్షం’ ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

## ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కండి

### హైదరాబాద్ జిల్లా సిపిఐ కార్యదర్శి స్టాలిన్ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ వందేళ్ల పోరాట స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలను నిర్మించి, పాలకవర్గాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పైన రాజీలేని పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ పిలుపునిచ్చారు. ఈనెల 18న ఖమ్మంలో జరగనున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు ర్యాలీ, బహిరంగ సభకు లక్షలాదిగా తరలివచ్చి, జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ శాతాబ్ది ఉత్సవాల ప్రచారజాత హైదరాబాద్‌లోని టోలిచౌకి లేబర్ అడ్డ నుండి శనివారం ప్రారంభమైంది. ప్రచార జాతను ఖైరతాబాద్ నియోజకవర్గంలోని గురుబ్రహ్మనగర్,యాకత్ పుర నియోజకవర్గంలోని గౌలిపుర డివిజన్ లో ఛత్రినాక చౌరస్తా ,సరళదేవి నగర్, ఐఎస్ సదన్ డివిజన్ లో సింగరేణి కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించింది. సిపిఐ వందేళ్ల ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని సిపిఐ నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రలు పంపిణీ చేశారు. కాగా ఛత్రినాక చౌరస్తాలో బహిరంగ సభకు చెందిన గోడ పత్రిక ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని, కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దుచేసి, గతంలో కార్మిక వర్గం సాధించుకున్న చట్టాలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ నియోజకవర్గ కార్యదర్శి షేక్ శంషుద్దీన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అహ్మద్ ఎఐటియుసి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అబ్బాస్,జాకీర్,కౌసర్, షఫీ,హైమద్, షాకీర్ షరీఫ్,అరుణ్ , బ్రహ్మ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎఐవైఎఫ్ ఖైరతాబాద్ కార్యదర్శి భగత్ సింగ్ సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సునీత, ఈశ్వరమ్మ, చెన్నమ్మ ,లావణ్య, శ్రీనివాస్, ఛత్రినాక చౌరస్తా లో జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడ్డమీది చంద్ర మోహన్ గౌడ్, డివిజన్ నాయకులు జి.ప్రభాకర్,నాగరాజు, అరుణ్, సాయి, తిరుపతి, దేవేందర్, అశోక్, చంద్రా యాన్ గుట్ట చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ బాధ్యులు మహమ్మద్ సలీం, కన్వీనర్ ఇమ్రాన్, సరళదేవి నగర్‌లో సిపిఐ సంతోష్ నగర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## రేషన్‌షాప్, ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి

### మంత్రి పొంగులేటికి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ వినతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రేషన్‌షాప్ ఏర్పాటు చేయడంతో పాటు పేదలకు ఇండ్ల స్థలాలను మంజూరు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. ఈ మేరకు అక్కడి ఆటోనగర్ కాలనీలో సీసీరోడ్డు శంకుస్థాపనకు విచ్చేసిన మంత్రికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఏదులాపురం పాత పంచాయతీపరిధిలోని పేదలు ఇండ్ల స్థలాలు లేక ఏండ్లుగా గుడిసెలు, కిరాయి ఇళ్లలో మగుతున్నారన్నారు. అలాగే వరంగల్‌క్రాస్‌రోడ్ పరిశర ప్రాంతాల్లో రేషన్‌పాప్ లేకపోవడంతో బియ్యం కోసం అవస్థలు పడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంపటి సురేందర్, సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు దండి రంగారావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు

- ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. యూసఫ్ డిమాండ్
- మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలి




**ప్రజాపక్షం / వరంగల్ :** రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలు నిత్యం పెరుగుతూ ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల జీతాలు మాత్రం పెరగటం లేదని, గత 15 సంవత్సరాలుగా రాష్ట్రంలో కనీస వేతనాలను సవరించకపోవడం వలన ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయుచున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ అన్నారు. వరంగల్ పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో కలకుంట్ల రాజు అధ్యక్షతన తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయుచున్న కార్మికులకు కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెబుతున్నప్పటికీ ఆసుపత్రుల్లో కనీస హక్కులు కానీ, చట్టాలను కానీ అమలు కావటం లేదని అందుకు ఉదాహరణ నేటికి కూడా కార్మికులకు పండగ సెలవులు, జాతీయ సెలవులు, ఆర్థిక సెలవులు అమలు కావటం లేదన్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ గత 12 సంవత్సరాల క్రితం అప్పుడున్నటువంటి రాష్ట్ర ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగి బేసిక్ వేతనం ఇవ్వాలని నిబంధన ఉన్నప్పటికీ ఆ నిబంధనలను తుంగలో తొక్కి అతి తక్కువ జీతాలు ఫిక్స్ చేయడం తీవ్ర అన్యాయమని వారు విమర్శించారు. 2004 సంవత్సరం నుండి ఔట్‌సోర్సింగ్ విధానం కొనసాగుతున్నప్పటికీ అప్పటి నుండి 2014 వరకు కూడా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగి బేసిక్ వేతనమే ఉన్నదని కెసిఆర్ ప్రభుత్వం ఆ నిబంధనలను తుంగలో తొక్కి మూడు కేటగిరీలుగా విభజించి కనీస వేతనం కూడా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించకుండా తీవ్ర అన్యాయాన్ని చేయడం జరిగిందన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేయుచున్న కాంట్రాక్ట కార్మికులు 78 రకాల క్యాడర్లు ఉన్నప్పటికీ వారికి క్యాడర్ చేసి బేసిక్ వేతనం ఇవ్వాలని అనేక సంవత్సరాలుగా పోరాడుతున్న ఈ ఒక్క క్యాడర్ కూడా కనీస వేతనం అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉన్నదన్నారు. ఇఎస్ఐ ఆసుపత్రిలో పనిచేయుచున్న కార్మికులు కార్మిక శాఖ పరిధిలో ఉన్నప్పటికీ వీరికి కనీస వేతనాలు అందకుండా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం రాబోవు రోజుల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్నటువంటి అన్ని రకాల కార్మికులకు కనీస వేతనం 26 వేలుగా నిర్ణయించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షులు చెన్నకేశవులు, ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ కన్నా, శంకర్ సంధ్య, కాల్యాణి, లావణ్య. సతీష్, చారి, శోభ, సులోచన, వహీద్, రజిత, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం

### హలో కామ్రేడ్ ... చలో ఖమ్మం

### సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు

**ప్రజాపక్షం/అమరచింత :** కార్మిక, కర్షక, ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేసేది సిపిఐయేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయరాములు పేర్కొన్నారు. శనివారం అమరచింత మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో మండల జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ రాములు మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి పార్టీ 1925 నుండి నేటి వరకు ప్రజా సమస్యలపై ఉద్యమాలు నడిపిస్తూ సిపిఐ ముందుండి పోరాటం చేస్తోందన్నారు. ఆనాడు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసి భూమి లేని నిరుపేదలకు భూములను పంచిన ఘనత సిపిఐకే దక్కుతుందని ఆయన తెలిపారు. సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఖమ్మంలో ఈ నెల 18న జరిగే వందేళ్ల సిపిఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని ఆసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం, సహాయ కార్యదర్శి భాస్కర్, అమరచింత పట్టణ సమితి కార్యదర్శి రవీందర్, సభ్యులు శ్యాంసుందర్, కె. తిరుపతయ్య, కథలప్ప, నిస్సార్ , లక్ష్మీ నారాయణ, ఇబ్రాయిల్, సౌలు, భారతి, గీతమ్మ, రఘు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## జన చైతన్యమే శతాబ్ది ఉత్సవాల లక్ష్యం




### ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాట కార్యాచరణ : బాగం

### ఖమ్మంలో కాగడాల ప్రదర్శన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** జనచైతన్యమే లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు ఖమ్మం జిల్లా నుండి భారీ జన సమీకరణతో పాటు ఇంటింటికి, ప్రతి వ్యక్తికి శతాబ్ది ఉత్సవ సందేశాన్ని అందిస్తున్నామన్నారు. శనివారం శతాబ్ది ఉత్సవాల ప్రచార కార్యక్రమంలో భాగంగా కాగడాల ప్రదర్శన నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని గిరి ప్రసాద్ విగ్రహం వద్ద నుండి ప్రారంభమైన ప్రదర్శన జెడ్‌పి సెంటర్ వరకు సాగింది. ఈ ప్రదర్శనుద్దేశించి హేమంతరావు మాట్లాడుతూ వందేళ్ల పరిణామ క్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ అనేక నిర్భందాలను ఎదుర్కొందని, 1925 డిసెంబర్ 26న సిపిఐ ఆవిర్భావం నుండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలోను తదనంతరం స్వాతంత్ర్య భారతదేశంలో నికరంగా నిలబడి ప్రజల కోసం పోరాడిన పార్టీ సిపిఐ మాత్రమేనని హేమంతరావు తెలిపారు. శతాబ్ధి ఉత్సవాలు కాన్పూర్‌లో ప్రారంభమయ్యాయని ముగింపు సభలు ఖమ్మంలో జరుగుతున్నాయని, ఈ సభలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో పాటు సిపిఐ యావత్తు నాయకత్వం 45దేశాల నుండి విదేశీ ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. 19న సిపిఐ జాతీయ కార్యవర్గం, 20న భారతదేశ పరిస్థితులు వామపక్షాలు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సెమినార్ జరుగుతుందని, ఈ సెమినార్‌కు సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజా, వామపక్షాల నేతలు ఎంఎ బేగి, దీపంక ర్ భట్టాచార్య, తదితరులు పాల్గొంటారని హేమంతరావు తెలిపారు. ఈ ప్రదర్శనలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్కే.జానిమియా, సిద్దినేని కరుణకుమార్, సింగ్ నర్సింహారావు, పగడాల మల్లేష్, శ్రీనివాసరావు, సాంబశివారెడ్డి, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ద్వారానే పేదలకు న్యాయం

### నిజామాబాద్ సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.ఓమయ్య

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** సిపిఐ ద్వారానే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన ఏకైక పార్టీ సిపిఐ అని సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.ఓమయ్య అన్నారు. శనివారం పార్టీ కార్యాలయ ఆవరణలో సిపిఐ వంద సంవత్సరాలు ఆవిర్భావ దినోత్సవం ముగింపు ఉత్సవాల సందర్భంగా ఛలో ఖమ్మం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఐ పార్టీ ఆవిర్భవించిన అనంతరం భారతదేశ ప్రజల అభ్యున్నతి కోసం కార్మికులు, కర్షకులు, మహిళలు, విద్యార్థుల ప్రతి ఒక్కరి సమస్యలపై నిరంతరం పోరాటంతో పాటు ప్రజలందరికి కూడు, గూడు, గుడ్డ ఉండాలని, ప్రభుత్వ రంగ సంస్థలు బలోపేతం కావాలని, ని రుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న పార్టీ సిపిఐ అని అ న్నారు. తెలంగాణ ప్రాంత ప్రజలకు పది లక్షల ఎకరాల భూమి పంచిన చరిత్ర గిలిగిన పార్టీ సిపిఐ అన్నారు. ఖమ్మంలో ముగిం పు ఉత్సవాలకు ఐదు లక్షల మందితో బహిరంగ సభ జరుగుతుందని, సభకు నిజామాబాద్ జిల్లాలోని ప్రజలు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని జ యప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు హనుమాండ్లు, అనిల్, దేవేందర్, భాగ్యలక్ష్మి , ఫెరోజ్, అలీ ఇమ్రాన్, సురేష్, భానుచందర్, రఘురాం నాయ క్ తదితరులు పాల్గొన్నారు.






## సిసి రోడ్లు సమస్యకు పరిష్కారం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని దశలవారీగా పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి అన్నారు. శనివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని డిసి కాలనీలో పర్యటించారు. భూగర్భ డ్రైనేజీ, సిసి రోడ్లు పనులను పరిష్కరించినందుకు ఎమ్మెల్యేను డిసి ఎంప్లాయిస్ కో ఆపరేటవ్ హౌసింగ్ సొసైటీ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన, రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, డిసి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## కీసరగుట్టలో ఈటల ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు ప్రసిద్ధ శైవ క్షేత్రమైన కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి దేవాలయంలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి సన్నిధిలో నమఃశివాయ పంచాక్షరి మత్ర జప కార్యక్రమం నిర్వహించారు..ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, నాయకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటేష్‌శర్మ, ఇఓ సుధాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నక్క కిషోర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ ఓ వరం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నిరుపేదలు ఖరీదైన వైద్యం పొందటానికి సిఎం రిలీఫ్ ఫండ్ ఓ వరంలాంటిదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబిత, అనిల్ కిషోర్‌ల సమక్షంలో గ్రీన్‌ఫీల్స్ కాలనీ యాదమ్మనగర్ ప్రాంతానికి చెందిన శంకరమ్మకు సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.30 వేల చెక్కును ఆయన అందచేసారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటి పనులను మూడుచింతలపల్లి మాజి ఉపసర్పంచ్ వంగ వెంకటరమణరెడ్డి శనివారం పరిశీలించారు. మూడుచింతలపల్లిలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు మాజి ఉపసర్పంచ్ వంగ వెంకటరమణరెడ్డి ముందుకు వచ్చి లబ్దిదారులకు ఆర్థికంగా చేయూతనిస్తున్నా డు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లకు లబ్దిదారులు పనులు మొదలు పెట్టడం లేదని అన్నారు. దీంతో లబ్దిదారులను కలిసి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగిందని చెప్పారు. ఇందిరమ్మ ఇంటి పనులు ప్రారంభించడానికి తమ వద్ద డబ్బులు లేక పనులు మొదలు పెట్టలేదని లబ్దిదారులు వాపోయారు. తాను స్వయంగా ముందుకు వచ్చి గ్రామంలో ఐదు ఇండ్లను దత్తత తీసుకుని ఇంటికి రూ.లక్ష చొప్పున ఇవ్వడానికి ముందుకు వచ్చానని చెప్పారు.



**సంక్రాంతి పండగకు ముగ్గుల పోటీలు**

కాగా వచ్చే సంక్రాంతి పండగకు మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని అన్ని వార్డులకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు మూడుచింతలపల్లి మాజి ఉపసర్పంచ్ వంగ వెంకటరమణరెడ్డి అన్నారు. ముగ్గుల పోటీల్లో గెలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులు అందజేస్తానని అన్నారు. ఇట్టి అవకాశాన్ని మండలంలోని మహిళలు అందరు వినియోగించుకోవాలని కోరారు.

## చంద్రయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు మండల పరిధి కొతలాపూర్ గ్రామానికి చెందిన పెద్దేముల్ చంద్రయ్య ఆనారోగ్యంతో మృతి చెందారు. చంద్రయ్య అంత్యక్రియలకు గాను తాండూరు పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు బివిజి పౌండేషన్ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. పెద్దేముల్ చంద్రయ్య మృతి చెందిన విషయాన్ని గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న డాక్టర్ సంపత్‌కుమార్ అంత్యక్రియాల కోసం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోతి గోపాల్, అవుసుల రాజయ్య, సుర్వ సురేష్, ఈడిగి రాజు, తదితరులుఉన్నారు.



## సరస్వతి శిశు మందిర్‌లో సంక్రాంతి సంబరాలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడ శ్రీ సరస్వతీ శిశుమందిర ఉన్నత పాఠశాలలో సంక్రాంతిని పురస్కరించుకుని సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎఎస్ రావు నగర్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీ మహిపాల్‌రెడ్డి, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షులు కవిత చల్లాలు పాల్గొన్నారు. వేడుకలో భాగంగా విద్యార్థులు మన తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా వేసిన ముగ్గులను, సంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి గొబ్బెమ్మలు పెట్టి భోగి మంటలు, నృత్యాలు చూసి వారిని అభినందించారు. ముగ్గులలో గెలుపొందిన వారికి కవిత చల్లా నగదును అందజేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల సమితి సభ్యురాలు మల్లిఖార్జున్‌రెడ్డి, సత్యనారాయణ, వినోద్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు రాధిక తదితరులు పాల్గొన్నారు.

### ఎల్లంపేట, మూడుచింతలపల్లి, ఆలియాబాద్

# మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్

### తోటకూర వజ్రేష్‌యాదవ్ ధీమా



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో మేడ్చల్ జిల్లాలోని ఎల్లంపేట, మూడుచింతలపల్లి, ఆలియాబాద్ మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ ధీమా వ్యక్తం చేసారు. రాష్ట్రంలో అధికారం చేపట్టాకా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలితాలే దీనికి కారణం కానున్నదన్నారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో పార్టీ కింది స్థాయి నుండి బలోపేతమైందని, పార్టీకి చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు కార్యకర్తలను సమన్వయం చేసుకొంటూ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో కి తీసుకొని వెళ్లటం ద్వారా అన్ని స్థానాలను భారీ మెజార్టీ పొందేలా ప్రణాళికాయుక్తంగా ముందుకు వెళ్లనున్నామన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మేడ్చల్ జిల్లాలోని 9 మున్సిపాలిటీలు విలీనమైన తర్వాత మిగిలిన మూడుచింతలపల్లి, ఎల్లంపేట, ఆలియాబాద్ మున్సిపాలిటీల్లోని 68 వార్డులతో పాటు మూడు చైర్మన్ స్థానాలను కాంగ్రెస్ దక్కించుకొంటుందన్న విశ్వాసాన్ని ఆయన ఘంటాపథంగా ప్రకటించారు.

**మంత్రి హోదాలో మల్లారెడ్డి చేసిందేమీ లేదు**

జిల్లా మంత్రిగా వెలగబెట్టిన ప్రస్తుత మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తన విద్యా సంస్థల అభివృద్ధి మినహా ఏనాడూ జిల్లా పురోగతి గురించి కానీ ప్రజల గురించి కానీ పట్టించుకొన్న పాపాన పోలేదని డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ దుయ్యబట్టారు. మంత్రి హోదాలో అసెంబ్లీలో కానీ ఎంపి హోదాలో పార్లమెంట్ లో కానీ ఏనాడైనా ఎప్పుడైనా జిల్లా గురించి ప్రస్తావించారా అని ఆయన ప్రశ్నించారు. సోషల్ మీడియాలో వివిధ వేషధారణలు, నాట్యాలతో, మాటలు తన విద్యా సంస్థలకు మల్లారెడ్డి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించటం ప్రజాప్రతినిధిగా జిల్లాను వెనుకంజయ్యేలా చేసారన్నారు. జిల్లాలో ఏ ఒక్క ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలు, సాంకేతిక విద్యా సంస్థలు ఏర్పాటు చేసిన పాపాన పోలేదన్నారు.

తన విద్యా సంస్థల కోసం మంత్రి గా అధికారాన్ని అడ్డుపెట్టుకొని యథేచ్ఛగా భూకబ్జాలకు పాల్పడటం మినహా జిల్లాకు ఏం చేసారన్న విషయం ఒక్కటైనా ఉందా అన్న విషయాన్ని ప్రజలకు ధైర్యంగా చెప్పకుండా ఈ ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకొని ఓట్ల కోసం వస్తాడంటూ వజ్రేష్‌యాదవ్ ఎద్దేవా చేసారు. తన విద్యాసంస్థల నుండి వస్తున్న డ్రైనేజి కలుషిత నీరు గుండ్లపోచంపల్లి, తూంకుంట చెరువుల్లో కలుస్తున్నా ఏమీ చేయలేని దద్దమ్మగా మల్లారెడ్డి జిల్లాలో మిగిలిపోయారని, తన బావమరిది, బంధువులు బినామిలుగా ప్రభుత్వ భూము లు, చెరువులు, అటవీ భూములను కబ్జా చేయటం, అక్రమ కట్టడాలు చేయటమే లక్ష్యంగా మల్లారెడ్డి మంత్రిగా వ్యవహరించారే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

జవహర్‌నగర్ డంపింగ్‌యార్డును తొలగించాలన్న డిమాండ్‌ను ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ఘట్‌కేసర్‌లో 100 పడకల ఆస్పత్రి అనటమే తప్ప కనీసం దానికి స్థలాన్ని సైతం కేటాయించలేక పోయారన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో జిల్లాలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సీట్లన్నిటిని మల్లారెడ్డి మంత్రి హోదాలో అంగట్లో సరుకుల్లా అమ్మి సొమ్ము చేసుకొన్నాడన్న విషయం బహిరంగరహస్యమే అని విమర్శించారు.

తెలంగాణా రాష్ట్రం సిద్ధించాక ప్రజలను కానీ అభివృద్ధిని కానీ దశాబ్దకాలం పాటు వంచించిన బిఆర్‌ఎస్ పార్టీకి కాలం చెల్లిందని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పూర్తిగా కనుమరుగైపోక తప్పదని వజ్రేష్‌యాదవ్ జోస్యం చెప్పారు.

## ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు కృషి

### ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి




**ప్రజాపక్షం/శామీర్‌పేట:** రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలే మూలకారణమని, బస్సులు, లారీలు, కార్లు నడిపే డ్రైవర్లు అతివేగంగా నడపకూడదని, రహదారులపై ప్రయాణిస్తున్న ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలను పాటించాలని జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. శనివారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మార్గదర్శకత్వంలో అలియాబాద్ మున్సిపాలిటి మజీద్‌పూర్ చౌరస్తాలోని బ్లాక్ స్పాట్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడుపరాదని, డ్రైవింగ్ సమయంలో ఫోన్లు మాట్లాడకూడదని స్పష్టంగా తెలిపారు. సీటు బెల్ట్ తప్పకుండా ధరించాలని, రోడ్డు భద్రత వలనే రోడ్డు ప్రమాదాలు తగ్గించవచ్చని పేర్కొన్నారు. మజీద్‌పూర్ చౌరస్తాలో గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్, సరిపడా స్ట్రీట్ లైట్లు, రహదారి మార్కింగ్ లు, సూచిక బోర్డులు, ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ సాదుల శ్రీనివాస్, మేడ్చల్ ట్రాఫిక్ సిఐ మధుసూదన్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లావణ్యరెడ్డి, ఆర్‌అండ్‌బి జిఎం వెంకట్‌రెడ్డి, డిఇ శంకర్, ఎఇ రంజిత్, ఎల్‌ఐడిఐపిఎల్ సీనియర్ ఇంజనీర్ నరేష్, మేనేజర్ వెంకటేష్, మోహన్ రావు, జిహెచ్‌ఎంసి రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థిని అభినందించిన బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి

### జాతీయ స్థాయిలో రాణించాలి

**ప్రజాపక్షం/తాండూరు:** జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో రాణించి మంచి పేరు ప్రతిష్టలు తీసుకోవాలని తాండూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్‌బిఎల్ సిఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అక్షర హైస్కూల్ విద్యార్థిని శ్రీలక్ష్మి అండర్ 14 విభాగంలో ఖోఖో జాతీయ స్థాయి పోటిలకు ఎంపికయ్యింది. ఈ నెల 14న రాజస్థాన్‌లో జరిగే పోటీలలో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించడం అభిందనీయమన్నారు. జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన శ్రీలక్ష్మి , పాఠశాల యాజమాన్యం, కోచ్‌లతో కలసి శనివారం బుయ్యని శ్రీనివాస్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి శ్రీలక్ష్మి ని అభినందించడంతో పాటు విద్యార్థినికి కావాల్సిన ఆర్థిక సహాయం అందజేశారు.

## బాల కార్మికులకు విముక్తి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు హోటళ్లు, కిరాణం, బైక్ మెకానిక్,షాపుల వద్ద పనులు చేస్తున్న పిల్లలను గుర్తించి వెట్టిచాకిరి నుండి కాపాడేందుకు ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలు కుషాయిగూడ డివిజన్ పోలీసులు శనివారం నిర్వహించారు. చదువులు మానేసిన 18 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలను అదుపులోకి తీసుకుకుని స్కూల్స్,హాస్టల్సలో చేర్పిస్తామని కుషాయిగూడలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఖలీల్, ఎన్‌జిఓ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు జన్మదిన వేడుకలు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఘనంగా జరిగాయి. ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని రామచంద్ర సిసిపిఎల్ దగ్గర కాంగ్రెస్ సీనియర్ నేత జిఎన్‌వి సతీష్ కుమార్, పిట్టల నాగరాజుల ఆధ్వర్యంలో మైనంపల్లి వాణి భారీ కేక్‌ను కట్‌చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నేరేడ్‌మెట్‌లో త్వరలో గోశాల

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నేరేడ్‌మెట్‌లో త్వరలో గోశాల ఏర్పాటు చేస్తున్నామని శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బిర్రు బాలమల్లయ్య తెలిపారు. శనివారం నేరేడ్‌మెట్ చౌరాస్తాలో శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం క్రమం తప్పకుండా పేదలకు సహకారం అందించాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంతో పాటు సందర్భానుసారంగా నిత్యావసర వస్తువులు, దుప్పట్లను పంపిణీ చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో డేవిడ్, మోజెస్, సంజు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

# ఏకరూప పన్నులు అమలు చేయండి

**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచితంగా డివిజనులను విభజించి చేతులు దులుపుకున్నారని, కాలనీల విభజన అస్తవ్యస్తంగా జరిగిందని, కొత్తగా ఏర్పాటైన డివిజన్‌లో ఏకరూప పన్నుల విధానాన్ని అమలు చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యులు పి.సబితాఇంద్రారెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆర్‌కెపురం డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షులు పెండ్యాల నగేష్ అధ్యక్షతన గ్రీన్‌హిల్స్‌కాలనీని పార్టీ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ డివిజన్‌ల విభజన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం శివారు ప్రాంతాల కాలనీవాసులకు ఉచిత మంచినీరు ఎప్పుడు అందిస్తారని అన్నారు. ఉద్యమకారులకు ప్రత్యేక ప్రాధాన్యత స్తాను అని స్వార్థంకోసం కెసిఆర్ ఎప్పుడూ పనిచేయలేదని అన్నారు. కెసిఆర్‌ను అవమానించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని, దానికి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. డివిజన్‌ల విభజన సరిగ్గాలేదని, ప్రభుత్వం ఎన్నికుట్రలు చేసినా బిఆర్‌ఎస్ గెలుపును కెసిఆర్‌కు కానుకగా ఇవ్వాలని అన్నారు. ఇద్దరూ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారని డివిజన్ల విభజనలో కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తుందన్నారు. పన్నులు ఒకే విధంగా ఉండాలని, 20వేల లీటర్ల నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అబద్దాలు చెప్పాను ఇచ్చిన మాట అమలు చేస్తా అని, ఏమైనా బిఆర్‌ఎస్ గెలుపుతోనే కాంగ్రెస్‌కు జవాబు చెప్పాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గం ప్రధాన కార్యధర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్, బిజేపి ఇద్దరు శత్రువులను తరిమికొట్టాలన్నారు. ఎక్కువ మంది ఉద్యమాకారులు ఉన్న డివిజన్‌లో పార్టీ బలంగా ఉందన్నారు. అందరు కలిసి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, టికెట్ ఎవ్వరికి వచ్చిన పని చేసి బిఆర్‌ఎస్ జెండా ఎగరవేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, మాజీ ఎంపిపి జిల్లెల కృష్ణారెడ్డి, పటేల్ సునితారెడ్డి, ఊర్మిళారెడ్డి, రామాచారి, కొండ్రు శ్రీనివాస్, సాజీద్, రామ్ నర్సింహగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జాహిద్, శ్యాంగుప్తా, తదితరులు పాల్గొన్నారు.

### అనధికార ప్రకటనల తొలగింపునకు

## జిహెచ్‌ఎంసి ప్రత్యేక డ్రైవ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) పరిధిలోకి పలు మున్సిపాలిటీల విలీనానంతరం, నగరంలోని వివిధ ప్రాంతాల్లో అనధికార ప్రకటనలు ఉన్నాయని గుర్తించినట్లు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. మున్సిపల్ నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో, అనధికార హోర్డింగ్‌లు, బ్యానర్లు తదితర ప్రకటనలను గుర్తిం చి తొలగించేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఇప్పటికే పలు అక్రమ హోర్డింగ్‌లు, బ్యానర్లు, ఇతర అనుమతిలేని ప్రకటనలను తొలగించినట్లు కమిషనర్ తెలిపారు. ప్రజా భద్రతతో పాటు నగర సుందరీకరణను దృష్టిలో పెట్టుకుని, జిహెచ్‌ఎంసి పరిధి అంతటా ఈ డ్రైవ్‌ను దశలవారీగా, నిరంతరంగా కొనసాగిస్తామని ప్రకటించారు. అనధికార ప్రకటనలపై పర్యవేక్షణ, నియంత్రణ, చర్యల కోసం ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రకటనదారులు, ప్రకటన ఏజెన్సీలు, భవన యజమానులు తప్పనిసరిగా మున్సిపల్ నిబంధనలను పాటిస్తూ, అవసరమైన అనుమతులు పొందిన తరువాత మాత్రమే నిర్మాణాలు, ప్రకటనలు ఏర్పాటు చేయాలని సూచించారు.

## అంబర్‌పేట ఎస్‌ఐ భానుప్రకాశ్‌రెడ్డి అరెస్ట్

### రికవరీ సొమ్ము, సర్వీస్ రివాల్వర్ మిస్సింగ్ కేసులో దర్యాప్తు వేగవంతం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలోని అంబర్‌పేట ఎస్‌ఐ భానుప్రకాశ్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. చోరీ కేసులో రికవరీ చేసిన సొమ్మును వాడుకున్నారని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు సర్వీస్ రివాల్వర్ మిస్సింగ్ కేసులోనూ దర్యాప్తు కొనసాగుతోంది. విజయవాడలోని ఓ లాడ్జిలో తాను చదువుకునే పుస్తకాల దగ్గర పెట్టుకున్నప్పుడు అది మిస్ అయిందంటూ ఎస్‌ఐ చెప్పడంతో హైదరాబాద్ పోలీసులు విజయవాడలోని లాడ్జి, అందులో పనిచేసే బాయ్స్, హోటల్ యజమానిని ప్రశ్నించారు. సిసిటివి ఫుటేజ్ కూడా పరిశీలించారు. కానీ అక్కడ తుపాకీకి సంబంధించిన ఆనవాళ్లు కనిపించలేదు. ఆయన ట్రైనింగ్ తీసుకునే సమయంలో విపరీతంగా బెట్టింగ్ ఆడేవాడని, ఆ తర్వాత తన ఇంట్లో బంగారం తీసుకొచ్చి కూడా బెట్టింగ్‌లో పెట్టాడని సమాచారం. డబ్బుల కోసం రివాల్వర్ అమ్మేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో సేకరించిన పక్కా ఆధారాల మేరకు ఆయనను అదుపులోకి తీసుకుని రిమాండ్ నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించారు.




## ఫొటో, వీడియో గ్రాఫర్‌ల అసోషియేషన్‌కు సిఐ శ్రీనాథ్ అభినందనలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఉమ్మడి శామీర్‌పేట మండల ఫోటో వీడియో గ్రాఫర్ల నూతన కమిటి సభ్యులకు శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ అభినందనలు తెలిపారు. శనివారం ఉమ్మడి శామీర్‌పేట మండల ఫోటో వీడియో గ్రాఫర్ల అసోషియేషన్ అధ్యక్షుడు మామిండ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటైన కమిటీకి ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అధ్యక్షుడు మామిండ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి శామీర్‌పేట మండల కేంద్రంలో సుమారు 100 మంది కుటుంబాలు ఫోటో స్టూడియోలను జీవనాధారంగా పెట్టుకుని ఉపాధి పొందుతున్నామని చెప్పారు. లక్షల రూపాయలతో కెమరాలు కొనుగోలు చేసి క్వాలిటీ కెమెరాలతో ఫోటోలు తీస్తు వినియోగదారులకు తక్కువ ధరలకు అందిస్తున్నామని అన్నారు.

కాగా ఇటీవల పలు జిరాక్స్, కిరాణా షాపుల్లో మొబైల్ ఫోన్‌ల ద్వార పాస్ ఫోటోలు, ఫుల్ ఫోటోలు తీస్తు ప్రింట్ కూడ ఇస్తున్నారని ఆవేదన చెందారు. వాటిని నియంత్రించడానికి మున్సిపల్ అధికారులు, పోలీసులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కనకాల లక్ష్మ ణ్, ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి సాయిబాబాగౌడ్, సహాయ కార్యదర్శి గుండ్లపల్లి నర్సింహగౌడ్, కోశాధికారి కమాటి రాజు, ముఖ్య సలహాదారులు అర్విన ప్రసాద్ కట్ట , నక్క మహేందర్‌గౌడ్, వల్లపు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## వీధి దీపాలు ఏర్పాటు... ఎమ్మెల్యే మల్లారెడ్డికి ధన్యవాదాలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** అలియాబాద్ ప్రధాన చౌరస్తా నుంచి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వరకు వీధి దీపాలు లేకపోవడంతో మాజీ ఎంపిటిసి సగ్గు శ్రీనివాస్ మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి గతంలో వినతిపత్రం సమర్పించారు. శనివారం అలియాబాద్ ప్రధాన చౌరస్తా నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు వీధి దీపాల ను బిగిస్తున్నారు. ఈ సందర్భంగా అలియాబాద్ మాజీ ఎంపిటిసి సగ్గు శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ప్రధాన రోడ్డు మార్గాన వీధి దీపాలు లేక నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుండేవని చెప్పారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి వినతి పత్రం ఇచ్చామని నిధులు మంజూరు చేయడంతో వీధి దీపాలు బిగిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డికి, అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మహానగరి
GREATER HYDERABAD
హైదరాబాద్
ఆదివారం
11-01-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily


## సిపిఐ నాయకులకు ఘన సన్మానం



ప్రజాపక్షం/ సరూర్‌నగర్ : ఖమ్మంలో ఈనెల 18న జరగబోయే సిపిఐ పార్టీ బహిరంగ సభకు కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాత రాజు నర్సింహా పిలుపునిచ్చారు. శనివారం భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ సరూర్‌నగర్ మండల కార్యాలయంలో శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సీనియర్ నాయకులు మహ్మద్ ఇస్మాయిల్, ఇస్తారిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతికుమార్, జిల్లా సమితి సభ్యులు రమావత్ సక్రు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## రైతుగా యాప్‌లో నమోదు చేసుకోండి



ప్రజాపక్షం/రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లాలో రైతు నమోదు కార్యక్రమం ప్రగతిని జిల్లా వ్యవసాయాధికారి(డిఎఒ)డి ఉష, జిల్లా హార్టికల్చర్ అధికారి కె సురేష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పురోగతిని పరిశీలించటం జరిగింది. జిల్లాలోని మహేశ్వరం, కందుకూరు మండలంలోని వివిధ గ్రామాలను సందర్శించి రైతు నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) కార్యక్రమం ఉద్దేశాన్ని రైతులకు వివరించారు. యాప్‌లో రైతులపేర్లు నమోదు ప్రక్రియను పరిశీలించిన అధికారులు రైతులకు ఈ రిజిస్ట్రీ వల్ల కలిగే లాభాలను వివరించారు. రైతు ఈ యాప్‌లో నమోదు చేస్కోని కేంద్రం, రాష్ట్ర అందించే వివిధ ప్రభుత్వ పథకాలకు ఈ రైతు ఐడి కీలకం కబట్టి రైతులంత ఇట్టి నమోదు కార్యక్రమంలో నమోదు చేస్కోవల్సిందిగా వ్యవసాయ అధికారులు సూచించారు. ఇంకా నమోదు చేస్కోని రైతులు సంబందిత వ్యవసాయ విస్తరణ అధికారిని గాని మీసేవ ద్వారగాని సంప్రదించి నమోదు చేసుకోవలని తెలియజేయటం జరిగింది.ఈ కార్యక్రమలో ఆయా మండలాలకు సంబంధించిన వ్యవసాయ అధికారులు బాబు,వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంత్రి పండుగ ప్రజల జీవితాలలో కొత్త మార్పు తీసుకవస్తుంది:ఎమ్మెల్యే



ప్రజాపక్షం / హయత నగర్ : ప్రజల జీవితంలో నిత్యం కాంతులు విరిసిల్లేలా ఆనందంగా గడపాలని ప్రజలంత సంతోషంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలని ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సంబారాల్లో భాగంగా శనివారం గడ్డి అన్నారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు గండి సన్నీ ఆధ్వర్యంలో గౌతమి నగర్ కాలనీలోని శ్రీసాయి గ్రామర్ స్కూల్ వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీల్లో భాగంగా ముఖ్య అతిథిగా ఎల్‌బినగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి పాల్గొన్నారు. దానిలో భాగంగా ముందుగా గంగిరెద్దుల విన్యాసాలు అనంతరం చిన్నారుల హరిరామదాసులు వేషాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సుదీర్ రెడ్డి మాట్లాడుతూ ముందస్తుగా తెలుగు రాష్ట్ర ప్రజలకు భోగి,సంక్రాంతి,కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజల జీవితంలో నిత్యం కాంతులు విరిసిల్లేలా ఆనందంగా గడపాలని కోరారు. ప్రతి ఇంటా సుఖశాంతులు, సౌభ్రాతృత్వం, సౌభాగ్యం వెల్లివిరియాలని కోరారు.అనంతరం బహుమతులు అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో సీనియర్ నాయకులు బిచేనేపల్లి వెంకటేశ్వరరావు, రమేష్ ముదిరాజ్,డివిజన్ అధ్యక్షులు శ్రీశైలంయాదవ్,రమణారెడ్డి,రవీందర్ రెడ్డి,విజయలక్ష్మి,వాణి,శిరీష వాసులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిపించాలి : చల్లా



ప్రజాపక్షం/రంగారెడ్డి: రానున్న మున్సిపల్ ఎన్నికలలో జిల్లాలోని అత్యధికంగా స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు డిసిసి అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి అధ్యక్షతన జిల్లాలోని శాసనసభ్యులు, ముఖ్య నాయకుల సమావేశం రంగారెడ్డి పెద్దగోల్కొండలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికలలో జిల్లాలోని అన్ని మున్సిపల్ స్థానాలలో అత్యధికంగా కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, అన్ని చైర్మన్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలిచేలా శాసనసభ్యులు, ముఖ్య నాయకులు కృషి చేయాలని దిశానిర్దేశం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలోటిపిసిసి ప్రచార కమిటీ అధ్యక్షులు మధుయాష్కీ గౌడ్,ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్,రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్, చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య, మాజీ శాసనసభ్యులు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యువత విద్యతోపాటు క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాపక్షం/కేశంపేట: యువత విద్యతోపాటు క్రీడాల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీ ఎంపిపి వై.రవీందర్ యాదవ్ సూచించారు. శనివారం మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన క్రికెట్ ప్రీమియర్ లీగ్7 ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వై.రవీందర్ యాదవ్ మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. యువత నచ్చిన రంగాన్ని ఎంచుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని, గ్రామీణ స్థాయిలో ఏర్పాటు చేసే టోర్నమెంట్‌లను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టోర్నమెంట్ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినంధించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మెన్ జగదీశ్వర్ గౌడ్, మాజీ వైస్ చైర్మెన్ అంజిరెడ్డి, సర్పంచులు మంజుల జంగయ్య, రామకృష్ణ, రాజు, మాజీ సర్పంచ్ యాదగిరి రావు, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, ఆంజనేయులు, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ‘కుకింగ్ గ్యాస్ వర్కర్స్’కు పిఎఫ్, ఇఎస్ఐ ఇవ్వాలి

### కనీస వేతనం రూ.26వేల చెల్లించాలని ఎఐటియుసి డిమాండ్




ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర కుకింగ్ గ్యాస్ ఏజెన్సీస్‌లో గ్యాస్ సిలీండర్స్ వినియోగదారులకు పంపిణీ చేస్తున్న ‘కుకింగ్ గ్యాస్ వర్కర్స్’కు నెలకు కనీస వేతనంగా రూ.26వేలను చెల్లించాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్, హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కుక్కింగ్ గ్యాస్ ఏజెన్సీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) శనివారం సదస్సు జరిగింది. యూనియన్ అధ్యక్షులు హనుమాండ్లు అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఎస్.బాల్‌రాజ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కుక్కింగ్ గ్యాస్ సరఫరా చేస్తున్న కార్మికులకు వస్తున్న ఆదాయం మేకతోక బెత్తడులా ఈ మూలకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ఏజెన్సీలలో పనిచేస్తున్న వర్కర్లకు ప్రావిడెంట్ ఫండ్, ఇఎస్ఐ, ప్రమాద నష్టపరిహారం చెల్లించాలని ఆయన గ్యాస్ ఏజెన్సీలను కోరారు. ప్రతి సిలీండర్ దిగుమతికి రూ. 33.43పైసలు చెల్లించాల్సివుండగా గ్యాస్ ఏజెన్సీలు కేవలం రూ.10లు చెల్లించి చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. ప్రతిరోజు గ్యాస్ ఏజెన్సీలలో పనిచేసే డెలివరీ బాయ్స్ గ్యాస్ డిపో నుండి సిలీండర్లను లోడింగ్ చేసుకొని ఏజెన్సీ ఆఫీసుకు, అక్కడి నుండి వినియోగదారుల ఇండ్లలో సిలీండర్లు వేసేందుకు చేస్తున్న పని కష్టతరమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ఏజెన్సీలకు ఇస్తున్న గ్యాస్ డెలివరీ బాయ్స్‌కు ఇవ్వాల్సిన డబ్బులను నేరుగా వారి ఖాతాలో జమచేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్యాస్ ఏజెన్సీలే యూనిఫాములను ఇవ్వాలని, మెయింటెనెన్స్ ఖర్చులు కూడా భరించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా రాష్ట్ర వ్యాపిత విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాపిత ఆందోళనలకు శ్రీకారం చుట్టాలని సదస్సు తీర్మానించింది. ఈ సదస్సులో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు వై.ఓమయ్య, నందూరి కరుణ కుమారి, ఎఐటియుసి కార్యవర్గ సభ్యుడు మారగోని ప్రవీణ్ కుమార్, ఎస్‌కె. నయీం, ఎ.అనిల్ కుమార్, బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ ఏజెన్సీల నుండి కార్మికులు పాల్గొని, ప్రసంగించారు.

## ‘ఆర్ట్ క్యాంప్’ కళాకారుడి నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుంది

### చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ‘టూ ఇన్ వన్’ చిత్ర కళా ప్రదర్శన



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆర్ట్ ఎగ్జిబిషన్ కళాభిమానులకు గొప్ప అనుభూతిని కలిగిస్తుందని, ఆర్ట్ క్యాంప్ కళాకారుని నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ పట్టణ రవాణ సలహాదారులు ఎన్.వి.ఎస్. రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శనివారం ‘పరిచయ్ ఆర్ట్ ఫౌండేషన్’ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక చిత్రకళా ప్రదర్శన, ఆర్ట్ క్యాంప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్ట్ ఎగ్జిబిషన్ కళాభిమానులకు గొప్ప అనుభూతిని కలిగిస్తుందన్నారు. ఆర్ట్ క్యాంప్ కళాకారుని నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. సాధారణంగా ఆర్ట్ ఎగ్జిబిషన్, ఆర్ట్ క్యాంప్‌లు వేర్వేరుగా జరుగుతుంటాయని, కానీ ఈ రెండింటినీ కలిపి ఒకే వేదికపై నిర్వహించడం అరుదైన సందర్భమన్నారు. చిత్రకారుడు ఒక కళాఖండాన్ని సృష్టించే ప్రక్రియను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఈ ‘టూ ఇన్ వన్’ ప్రదర్శన ద్వారా కళాభిమానులకు, కొనుగోలుదారులకు కలిగిందని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్ మెట్రో రైలు నిర్మాణ సమయంలో తాను ఎదుర్కొన్న సవాళ్లను ఎన్‌విఎస్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ‘మెట్రో రైలును పట్టాలెక్కించడానికి పడిన శ్రమ, సంకల్ప బలం వెనుక ఎంతటి కృషి ఉందో, అలాగే చిత్రకారుడు తన ఆలోచనలను అందమైన చిత్రంగా మలచడం వెనుక కూడా అంతే నైపుణ్యం, కష్టం ఉంటాయి. ఆ కృషి ఈ ప్రదర్శనలో స్పష్టంగా కనిపిస్తోంది’ అని ఎన్‌విఎస్ రెడ్డి అభినందించారు. ఆ కృషికి ప్రతిఫలంగా నేడు విస్తృతమైన హైదరాబాద్ మెట్రో రైల్ నెట్‌వర్క్‌ను మనం చూస్తున్నామని అన్నారు. అదే విధంగా ఒక చిత్రకారుడు కూడా తన ప్రతిభను సానబెట్టి, ఆలోచనలను అందమైన చిత్రాలుగా మలచడం వెనుక ఎంతో నైపుణ్యం, కృషి అవసరమని తెలిపారు. చిత్రకళలో విశేష ప్రతిభ కలిగిన 12 మంది చిత్రకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రముఖ కళాకారుడు జయవంత్ నాయుడును ఎన్‌విఎస్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అత్యంత సునిశితమైన నైపుణ్యంతో కళాభిమానులను కట్టిపడేసేలా చిత్రకళను ప్రదర్శించినందుకు నిర్వాహకులను, చిత్రకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్, కర్ణాటకకు చెందిన పలువురు ప్రముఖ కళాకారులు పాలొని తమ కళాఖండాలను ప్రదర్శించారు. వారిలో బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి, ధన్ ప్రసాద్, కప్పరి కిషన్, కిషోర్ ఘోష్, డాక్టర్ మల్లికార్జున బగోడి, ప్రీతీ సమ్యుక్త, పి.జె. స్టాలిన్, పి.రవి శంకర్, శంకర్ గైధానే, సయ్యద్ రయీస్ అహ్మద్, బిరదార్, విమల మారోజు ఉన్నారు.

## కుక్క చర్మానికి చేప చర్మంతో అంటుకట్టుట చికిత్స విజయవంతం




ప్రజాపక్షం/హైదరాబాద్: తీవ్రమైన, విషపూరిత ఇన్‌ఫెక్షన్‌తో యాభై శాతం చెడిపోయిన కుక్క చర్మానికి చేప చర్మంతో అంటుకట్టుట విధానం విజయవంతంగా నిర్వహించడం ద్వారా కుక్కకు కొత్త జీవితాన్ని ఇచ్చినట్లు హైదరాబాద్‌లోని పెట్స్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, చీఫ్ వెటర్నరీ డాక్టర్ వెంకట్ యాదవ్ చెప్పారు. ఈ చికిత్స భారతీయ పశువైద్యంలో ఒక నూతన ఆవిష్కరణ అని, అధునాతన జంతు సంరక్షణ వైద్యంలో ఒక పురోగతిని సూచిస్తుందని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ వెంకట్ ఈ వినూత్న చికిత్స గురించి వివరించారు. విషపూరిత ఇన్‌ఫెక్షన్‌తో ఉన్న కుక్క చర్మానికి ఇప్పటివరకు పశువైద్య విధానంలో అందుబాటులో ఉన్న చికిత్సను పరిమితంగా చేశారని, అయితే వినూత్నంగా అత్యాధునిక పునరుత్పత్తి పద్ధతులను అవలంభించి ప్రాసెస్ చేయబడిన చేప చర్మాన్ని కుక్కకు ఇన్‌ఫెక్షన్ సోకిన చోట (అంటుకట్టే విధానంతో) అమర్చినట్లు వివరించారు. సమావేశంలో ప్రభుత్వ వెటర్నరీ కళాశాల మాజీ ప్రిన్సిపల్, పశువైద్యరంగంలో ప్రముఖులైన ప్రొఫెసర్ లక్ష్మ ణ్ మాట్లాడుతూ కుక్కకు చేప చర్మం అంటుకట్టుట విధానం పశువైద్య గాయాల చికిత్సలో ‘గేమ్ ఛేంజర్‘ అని, ఈ చికిత్సను విజయవంతంగా నిర్వహించడం ప్రపంచ స్థాయి పశువైద్యంలో కొత్త శకానికి నాంది పలికిందన్నారు. పశువైద్య నిపుణులు డాక్టర్ షిరీన్ మాట్లాడుతూ ఈ చికిత్స ద్వారా జంతువులలో కాలిన గాయాలు, ఇన్‌ఫెక్షన్లు, సంక్లిష్ట గాయాల కేసులకు సంరక్షణ ప్రమాణాలను పునర్ నిర్వచించవచ్చన్నారు. ‘‘పెంపుడు జంతువులు మానవుల మాదిరిగానే మెరుగైన వైద్యం, అర్హత కలిగినవన్నారు.

## పంచాయతీల అభివృద్ధికి రూ.10కోట్ల నిధులు

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్/కొందుర్గు :గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం రూ.10కోట్ల నిధులు మంజూరు చేసిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం తక్షణంగా రూ.10కోట్ల నిధులు సంక్రాంతి పండుగ సందర్భంగా విడుదల చేసిందని వివరించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులను ప్రోత్సహించేందుకు గాను తొలివిడుతలో ఈ నిధులను మంజూరు చేసిందని తెలిపారు. ప్రస్తుతం మంజూరు చేసిన నిధులతో డివిజన్‌లోని కొత్తూరు, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ, కేశంపేట, నందిగామ మండలాల్లో అత్యవసరమైన పనులు గుర్తించి చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా ముందుకు వె ళ్తుందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తి లేదని సూచించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లేడు చౌదరి గూడ మండల పార్టీ అధ్యక్షు డు రాజు, సీనియర్ నేతలు బస్వం పాల్గొన్నారు.

### యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలి

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం కొందుర్గు మండల కేంద్రంలో 6వ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత క్రీడా నైపుణ్యాన్ని నిరూపించుకునేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయని వివరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహాకారంతో స్టేడియంతోపాటు రూ.200కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను సైతం మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం విద్య, క్రీడలపై మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, కెపిఎల్ ఆర్గనైజ్ టీం శంకరన్నకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మెన్ దామోదర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ సయ్యద్ సాధిక్, మాజీ వైస్ ఎంపిపి రాజేష్ పటేల్, సర్పంచ్ చౌదపురం ప్రభాకర్, ఉప సర్పంచ్ చంద్రశేఖర్, నేతలు కేకే కృష్ణ, రాములు గౌడ్, కావలి యాదయ్య, మహేందర్, బోరింగ్ యాదయ్య, భీమారం మాణేయ్య పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడలకు మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని లింగారెడ్డి గూడ గ్రామంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ ఎంపిపి చల్లా వెంకటేశ్వర్, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ ఎంసి ప్రవీణ్‌కుమార్, ఉప సర్పంచ్ అశోక్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, విద్య, క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించేందుకు యువత కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాన్ని కేవలం మౌలిక వసతులకే పరిమితం కాకుండా యువతకు క్రీడల ద్వారా అవకాశం కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. గ్రామంలో క్రీడా వాతావరణం పెంపోందించేందుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్, గ్రామస్తులు కందూరి అంజయ్య గౌడ్, పంతులు లక్ష్మయ్య, రమేష్ గౌడ్, లక్ష్మి కాంత్‌రెడ్డి, భూపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, యాదయ్య, గంటెల శంకరయ్య, హరికృష్ణ, మంగలి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ‘కైదమ్మ కుంట’ను సుందరశోభిత వనంగా తీర్చిదిద్దుతాం



ప్రజాపక్షం/మియాపూర్: హఫీజ్పెట్ డివిజన్ పరిధిలోని కైదమ్మ కుంట చెరువు సుందరికరణ, పునరుద్ధరణ పనులను ప్రజా లెక్కల కమిటీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. పరిశ్రమల సహకార నిధులతో, మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టిన ఈ చెరువు పునర్జీవన కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు దిశానిర్దేశకంగా నిలవనుందని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కైదమ్మ కుంట చెరువు పునరుద్ధరణతో ప్రాంత ముఖచిత్రమే మారుతుందని, వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం కలిసి పనిచేస్తే సహజ వనరుల సంరక్షణ సాధ్యమవుతుందని, ఈ చెరువు అభివృద్ధి రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తు సుస్థిర అభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా సమస్యగా మారిన చెరువుకు శాశ్వత పరిష్కారం చూపుతూ, స్వచ్ఛమైన సుజల జలంతో అపురూప దృశ్యకావ్యంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని అన్నారు. చెరువు కట్ట బలోపేతం, అలుగు మరమ్మత్తులు, మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేక కాల్వ నిర్మాణం, చెరువు చుట్టూ కంచె ఏర్పాటు, నడక మార్గం ఏర్పాటు వంటి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపడతామని తెలిపారు. చెరువు చుట్టూ చెట్లు నాటి ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి ముగ్గుల పోటీలు

### కేశంపేట మాజీ జడ్పిటిసి సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి

ప్రజాపక్షం/కేశంపేట: తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి ముగ్గుల పోటీలనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని కేశంపేట మాజీ జడ్పిటిసి సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామంలో ఉన్న వీఐపి పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ముగ్గుల పోటీలు, బోగి మంటలు, కనుమ కోలాహంతో చిన్నారులు ఆటపాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ సంస్కృతి ఉట్టిపడే విధంగా పండుగలను నిర్వహించుకునేందుకు ప్రజలందరు కృషి చేయలని కోరారు.

# ఉద్యమాలకు ఊపిరిపోసిన ఎర్రజెండా

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఒరుగంటి యాదయ్య



ప్ర్రజాపక్షం/తుర్కయంజాల్ : వందేళ్ల చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ భారతదేశం లోని అనేక ఉద్యమాలకు ఎర్ర జెండా ఊపిరి పోసిందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఒరుగంటి యాదయ్య అన్నారు. శనివారం సిపిఐ తుర్కయంజాల్ కార్యదర్శి అనంతుల కాటంరాజు గౌడ్ అధ్యక్షతన జీపుజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఒరుగంటి యాదయ్య హాజరై జీపు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26న కాన్పూర్లో ఆవిర్భవించిందని, 2025 డిసెంబర్ 26 నాటికి భరత నేలపై సిపిఐ పార్టీకి వందేళ్లు అవుతున్నదని తెలిపారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా శతాబ్ది వార్షికోత్సవాలు జరుగుతున్నాయని, అందులో భాగంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు ఇంటికో మనిషి ఊరుకో బండి ఖమ్మం రండి అనే కార్యక్రమాన్ని సిపిఐ చేపట్టిందని పేర్కొన్నా రు. నాటి రాజరిక వ్యవస్థలకు వ్యతిరేకంగా, భూస్వాముల ఆగడాలు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిలబడిన ఎర్రజెండా ప్రజలకు అండ గా పోరాడిన పార్టీగా ఘ నమైన చరిత్ర గలిగిన సిపిఐ పార్టీని ప్రజలు వందేళ్లుగా భారత నేల పై తెలుగు రాష్ట్రాల నేలపై కాపాడిన ప్రజలకు సిపిఐ కా ర్యకర్తలకు, శ్రేణులకు ఆయన విప్లవ అభినందనలు తెలియజేశారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బాట లు వేసిన పార్టీ సిపిఐ పార్టీ ఆ పోరాటంలో లక్షలాది ఎకరాలను పేదలకు పంచి వేల గ్రామాలను వి ముక్తి చేసిన చరిత్ర కమ్యూనిస్టులదని ఆ సాయిధ పోరా ట ఉద్యమంలో వేలాదిమంది కమ్యూనిస్టులు అమరులై ప్రాణ త్యా గం చేశారని ఆయన కొనియాడారు. జనవరి 18న జరి గే బహిరంగ సభకు పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయ న పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. శివకుమార్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో సిపిఐ పార్టీని బలపరచడానికి అభివృద్ధి చేయడానికి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు శ్రేణులు నిరంత రం ప్రజలలో ఉండి ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ పార్టీని ప్రజలకు చేరువ చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వట్టి విజయ , తదితరులు పాల్గొన్నారు.

‘మన శంకర వరప్రసాద్ గారు’ సినిమా విడుదలకు రెండు రోజుల ముందే ప్రీమియర్ షో టికెట్ ధరను 600గా నిర్ణయించారు. వారం రోజుల పాటు సింగిల్ స్క్రీన్లలో రూ.50, మల్టీప్లెక్స్ థియేటర్లలో రూ.100 పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ప్రభాస్ నటించిన రాజాసాబ్ సినిమా టికెట్ ధరల విషయంలో మీనావేశాలు లెక్కించిన ప్రభుత్వం చిరంజీవి సినిమా విషయంలో మాత్రం టికెట్ ధరలు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది.

# ఫుల్ ఫన్..



- డైరెక్టర్ రామ్ అబ్బరాజు

శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ’నారి నారి నడుమ మురారి’. జనవరి 14న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ రామ్ అబ్బరాజు మీడియాతో ‘చిట్ చాట్’ నిర్వహించారు. ఇది పండగ లాంటి సినిమానే. కాకపోతే శర్వా బైకర్. ఇంతకుముందే సినిమా విడుదల కావాల్సింది. అయితే కొన్ని కారణాలవల్ల అది వాయిదా పడింది. దీంతో మాకు సంక్రాంతికి వచ్చే మంచి అవకాశం దొరికింది. మంచి యూత్ ఫుల్ ఫన్ ఉన్న ఎంటర్టైన్మెంట్ ఇది. చిన్నప్పటి నుంచి సంక్రాంతికి ఎన్నో సినిమాలు చూస్తూ పెరిగా. ఇప్పుడు డైరెక్టర్ గా ఫస్ట్ టైం సంక్రాంతికి నా సినిమా రావడం అనేది నాకు చాలా ఆనందాన్ని కలిగిస్తోంది. క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్‌తో అందరి ఆడియన్స్‌ని అలరించడం ఇష్టం. నేను తీసిన వివాహ భోజనంబు, సామజవరగమన, ఇప్పుడు ఈ సినిమా కూడా చాలా మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్. అందరూ కలిసి హాయిగా చూసి ఎంజాయ్ చేసేలా వుంటుంది. ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి అంటే ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని ఫీలింగు వస్తుంది. కానీ ఇందులో చాలా కొత్త పాయింట్ ఉంది. సామజవరగమన ట్రైలర్‌లో చూస్తే అసలు విషయం మేము రివిల్ చేయలేదు. ఇంటర్వెల్ దగ్గర అసలు విషయం వస్తుంది. అది ఒక కొత్తదనాన్ని తీసుకొచ్చింది. ఈ సినిమాలో కూడా ఒక కొత్త కాన్సెప్ట్ ఉంది. మేము ఇప్పుడే రివిల్ చేయడం లేదు. బిగ్ స్క్రీన్ పై చూడాల్సిందే. శర్వానంద్ బైకర్ సినిమా చేశారు. ఆ సినిమా కోసం చాలా కొత్తగా మేకోవర్ అయ్యారు. అది మాకు కలిసి వచ్చింది. మేము ఫస్ట్ ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్,తర్వాత ప్రెసెంట్ సీన్స్ చేశాం. ఆ రెండిటికీ పర్ఫెక్ట్ గా లుక్ సెట్ అయింది. రన్ రాజా రన్, ఎక్స్ ప్రెస్ రాజా, మహానుభావుడు.. తర్వాత ఆయన చేసిన ఎంటర్‌టైనర్ ఇది. చాలా ఫ్రెష్‌గా కనిపిస్తారు. నరేష్ గారు అద్భుతమైన యాక్టర్. ఆయన అన్ని రకాల పాత్రలు చేస్తూ అలరిస్తున్నారు. నా సినిమాల్లో ఫాదర్ క్యారెక్టర్స్‌కి అయిన పర్ఫెక్ట్‌గా షూట్ అయ్యారు. ఈ సినిమాలు కూడా చాలా అద్భుతంగా ఆయన పాత్ర ఉండబోతుంది.



## మేమంతా హ్యాపీగా ఉన్నాం

రెబల్ స్టార్ ప్రభాస్ ‘రాజా సాబ్’ శుక్రవారం థియేటర్స్‌లోకి వచ్చి బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ రిద్ధి కుమార్ మాట్లాడుతూ.. ‘రాజా సాబ్’ సినిమాను ప్రేక్షకులు, ఫ్యాన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. మా సినిమాకు ప్రతి ఒక్కరి నుంచి దక్కుతున్న ఆదరణ చూస్తుంటే హ్యాపీగా ఉంది. ఈ సినిమా కోసం మూడేళ్ల కష్టపడ్డాం. టీమ్ మొత్తం చాలా ఎఫరట్స్ పెట్టింది. మా ప్రయత్నానికి రిజల్ట్ గా ప్రేక్షకులు మంచి సక్సెస్ ఇచ్చారు. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా మా మూవీని అప్రిషియేట్ చేస్తూ చాలా మెసేజ్‌లు వస్తున్నాయి అన్నారు. హీరోయిన్ నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. ‘రాజా సాబ్’ సినిమా బ్లాక్ బస్టర్ ఓపెనింగ్స్‌తో బాక్సాఫీస్ జర్నీ స్టార్ట్ చేసింది. ప్రేక్షకులు మా సినిమాను ఇష్టపడుతున్నారు. ఈ సంక్రాంతికి పర్ఫెక్ట్ ఫ్యామిలీ మూవీ ఇది. పిల్లలతో కలిసి మీరు ఈ సినిమాను ఎంజాయ్ చేయొచ్చు. ప్రేక్షకులు ‘రాజా సాబ్’ కనెక్ట్ అయ్యింది. మొసలి ఎపిసోడ్ క్లైమాక్స్.. ఇలా చాలా ఎపిసోడ్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. థియేటర్స్‌లో డార్లింగ్ డార్లింగ్ అని అంతా అంటున్నారు. ‘రాజా సాబ్’ సక్సెస్‌తో మేమంతా హ్యాపీగా ఉన్నాం అన్నారు.

## ‘రాజా సాబ్’.. ఫస్ట్‌డే రూ.112 కోట్లు

రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన ‘రాజా సాబ్’ మూవీ థియేటర్స్‌లోకి వచ్చి బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది. ఈ సినిమాకు వరల్డ్ వైడ్ భారీ ఓపెనింగ్స్ వచ్చాయి. ‘రాజా సాబ్’ ప్రపంచవ్యాప్తంగా 112 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లు దక్కించుకుంది. హారర్ ఫాంటసీ జానర్‌లో హయ్యెస్ట్ ఓపెనింగ్స్ అందుకున్న చిత్రంగా ‘రాజా సాబ్’ నిలుస్తోంది. ఈ చిత్రంలోని హారర్, ఫాంటసీ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా తీశారు.‘రాజా సాబ్’ చిత్రాన్ని హారర్ ఫాంటసీ జానర్ దర్శకుడు మారుతి రూపొందించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టర్ బ్యానర్‌పై గ్రాండ్‌గా మూవీని నిర్మించారు టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రంలో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ అందంతో ఆకట్టుకున్నారు.

## ఎప్పటికీ గుర్తుండిపోతుంది

- అనిల్ రావిపూడి



మెగా స్టార్ చిరంజీవి అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా ’మన శంకర వర ప్రసాద్ గారు’. వెంకటేష్ ఇందులో మరో కీలకమైన పాత్రను పోషించారు. 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అనిల్ రావిపూడి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈసారి కొద్దిగా రిలాక్స్‌గా ఉన్నాను. నెర్వస్ పర్సంటేజ్ కొంచెం తగ్గింది. దానికి కారణం చిరంజీవి. ప్రీరిలీజ్ ఈవెంట్లో హుక్ స్టెప్ సాంగ్ రిలీజ్ చేశాం. ఆ పాటకి చిరంజీవి వేసిన డాన్స్, ఆ ఈవెంట్‌లో ఆయన ముందు నేను వెంకటేష్ చేసిన అల్లరి ఇదంతా తెలియకుండా ఒక పాజిటివ్ వైబ్ తీసుకొచ్చేసింది. దీంతో చాలా రిలాక్స్ అయ్యాను. ఆ సాంగ్ వెనుక ఒక కథ ఉంది. నిజానికి ఆ ప్లేస్‌లో ఒక మెలోడీ మాస్ ట్యూన్ అనుకున్నాము. మీసాల పిల్ల, శశిరేఖ ఈ రెండు పాటలు కూడా మెలోడీ సాంగ్స్. చిరంజీవి ఇంట్రడక్షన్ సాంగ్ కూడా మళ్లీ మెలోడీ అయితే ఎలా అని ఆలోచించాను. సాంగ్ అంత సంతృప్తికరంగా లేదని చిరంజీవికి చెప్పాను. సాంగ్ షూట్ చేస్తున్నప్పుడు వర్షం పడి షూటింగ్ ఆగిపోయింది. నేచర్ సిగ్నల్ ఇచ్చిందని చిరంజీవి చెప్పారు. ఆయనే సిగ్నల్ ఇచ్చారు కదా అని.. అప్పుడు ఈ సాంగ్ ని ఆలోచించడం మొదలుపెట్టాం. శశిరేఖ ప్లేస్‌లో రిలీజ్ అవ్వాల్సిన పాట ఇదే. మొత్తం షూట్ అయ్యాక లాస్ట్ షెడ్యూల్లో ఈ సాంగ్ షూట్ చేశాం. ఫైనల్‌గా మెగా మ్యాజిక్ జరిగింది. భీమ్స్ అద్భుతమైన ట్యూన్ ఇచ్చాడు. చాలా కొత్తగా చేశారు. ఆట సందీప్ ఎప్పటినుంచో చిరంజీవి పాటకి కొరియోగ్రఫీ చేయాలని చూస్తున్నాడు. ఈ సినిమాకి అవకాశం వచ్చింది. ఆ అవకాశాన్ని నిలబెట్టుకున్నాడు. అద్భుతమైన కొరియోగ్రఫీ చేశాడు. హుక్ స్టెప్ అనే పదం ఇచ్చింది పాట రాసిన రామజోగయ్య గారే. భీమ్స్ ఎక్కువగా కొత్త, లోకల్ టాలెంట్‌ని ఎంకరేజ్ చేస్తుంటాడు. సంక్రాంతికి వస్తున్నాంలో బ్లాక్ బస్టర్ పొంగల్ పాట పాడింది కూడా లోకల్ సింగర్స్. ఈ సినిమాలో మీసాల పిల్ల సాంగ్ కోసమే ఉదిత్, హుక్ స్టెప్ బాబాసాహెల్ పాడారు. కొరియోగ్రాఫర్స్‌లో భాను మాస్టర్, విజయ్, ఆట సందీప్ అద్భుతంగా ప్రూవ్ చేసుకున్నారు. మన లోకల్ టెక్నీషియన్స్ అందరు కూడా వెలుగులోకి వస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది. ఇప్పటి వరకు టీజర్, ట్రైలర్లో ఎక్కడా కూడా రివిల్ చేయాలని ఒక ఎమోషనల్ పాయింట్ ఈ సినిమాలో ఉంది. అది మీరు స్క్రీన్ మీద చూడాలి. కామెడీతో పాటు ఒక బలమైన ఎమోషనల్ రైడ్ ఉంటుంది. చిరంజీవి, నయనతార, పిల్లల మధ్య వచ్చే సన్నివేశాలు చాలా హృద్యంగా ఉంటాయి. భార్యాభర్తల మధ్య ఒక సమస్య వచ్చినప్పుడు వాళ్ళు ఎలా దాన్ని హ్యాండిల్ చేస్తారనేది చాలా కొత్త కోణంలో ఈ సినిమాలో చూపించడం జరిగింది. అది కచ్చితంగా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. నేను సొంత ప్రొడ్యూసర్ లాగా ఫీల్ అయి సినిమా చేస్తుంటాను. ఒక పది రూపాయలు సంపాదించకపోయిన పర్లేదు కానీ బయటకు వచ్చే సమయానికి సేఫ్‌గా ఉండాలి. ప్రొడ్యూసర్ హ్యాపీగా ఉంటే చాలు. లక్కీగా నేను చేసిన నిర్మాతలు అందరికీ రిలీజ్ ముందు రిలీజ్ తర్వాత చాలా హ్యాపీ. నేను చిన్నప్పటి నుంచి చిరంజీవి పాటలుకి డాన్స్ చేస్తూ పెరిగాను.ఆయన్ని డైరెక్ట్ చేస్తున్నప్పుడు నా ఫీలింగ్‌ని మాటల్లో చెప్పలేను. ఒక్కసారిగా నా బాల్యంలోకి వెళ్ళిపోయాను. చిరంజీవి, వెంకటేష్ అంటే నాకు చాలా గౌరవం. మా ముగ్గురు చాలా మంచి అనుబంధం ఉంది. నాగార్జునతో ఎప్పుడు సినిమా చేస్తున్నారు? అని అందరూ అడుగుతున్నారు. నేను కూడా అదే నేను అదే ఫీల్ అవుతున్నాను. ఆయనతో కూడా సినిమా చేయాలని కోరుకుంటున్నాను. ఆ సినిమా చేస్తే నలుగురు అగ్ర కథానాయకులతో సినిమా చేసిన రికార్డు నాకే ఉండిపోతుంది.

## ‘మా ఇంటి బంగారం’ టీజర్ విడుదల



సమంత ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం ‘మా ఇంటి బంగారం’. అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. ఇది హై వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా మెప్పించనుంది. సమంతను సరికొత్త పాత్రలో ఆవిష్కరించారు. రాజ్ నిడిమోరు క్రియేట్ చేసిన ‘మా ఇంటి బంగారం’ను నందినీ రెడ్డి డైరెక్ట్ చేశారు. ‘ఓ బేబి’ తర్వాత సమంత, నందినీ రెడ్డి కాంబోలో వస్తోన్న రెండో చిత్రమిది. టీజర్‌ను గమనిస్తే కామెడీతో నవ్వించే సినిమా ఉన్నట్లుండి రియలిస్టిక్ ఫ్యామిలీ యాక్షన్ థ్రిల్లర్‌గా జరిగే మార్పును మనం స్పష్టంగా గమనించవచ్చు. టీజర్‌లో సమంతను సాధారణమైన గృహిణి పాత్రలో చూపించారు. అయితే ఆమె తన అత్త గారింటికి వెళ్లిన తర్వాత పరిస్థితులు తలకిందులవుతాయి. నవ్వుతూ మృదు స్వభావిగా కనిపించే ఆమె ఉన్నట్లుండి ఎదురు దాడి చేసేంత శక్తివంతురాలిగా మారుతుంది. ఇందులో సమత స్టైలిష్‌గా కాకుండా రియాలిటీకి దగ్గరగా ఉండేలా చూపించారు. ఆమె యాక్షన్ సన్నివేశాల్లో వేగంగా కదలటమే కాదు.. ఆమెలోని ఎమోషన్స్‌ను కూడా లోతుగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు మేకర్స్. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంత రూత్ ప్రభు, రాజ్ నిడిమోరు, హిమాన్క్ దువ్వూరు కలిసి నిర్మిస్తున్నారు.

## ‘శ్రీనివాసమంగాపురం’ ఫస్ట్ లుక్




సూపర్ స్టార్ కృష్ణ మనవడు, దివంగత రమేష్ బాబు కొడుకు, మనహేష్ బాబు సోదరుడి కుమారుడు అయిన ఘట్టమనేని జయకృష్ణ హీరోగా పరిచయమవుతున్న సినిమా శ్రీనివాస మంగాపురం. అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అశ్వని దత్ సమర్పిస్తున్నారు. ఇటీవలే షూటింగ్ ప్రారంభించుకున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. హీరో జయ కృష్ణ ఒక చేయితో బైక్ నడుపుతూ, మరో చెయ్‌తో గన్ పట్టుకుని కలుస్తున్న పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జయకృష్ణ సరసన రాషతడని హీరోయిన్‌గా నటిస్తోంది. జీవి ప్రకాష్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని వైజయంతి ఫిలిమ్స్, స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యాక్షన్ నేపథ్యంలో సాగే రొమాంటిక్ లవ్ స్టోరీగా ఈ సినిమాను అజయ్ భూపతి తెరకెక్కిస్తున్నారు. సూపర్ స్టార్ కృష్ణ వంశం నుంచి నాలోగో తరం హీరోగా వస్తున్న జయకృష్ణ ప్రతి సన్నివేశంలో చాలా బాగా నటిస్తున్నారని దర్శకుడు అజయ్ భూపతి తెలిపారు.

## ఎన్‌సిఎల్‌టి సీనియర్ కౌన్సిల్‌గా హరీష్ రెడ్డికి పదోన్నతి



ప్రజాపక్షం/హైదరాబాద్ : నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో సీనియర్ కౌన్సిల్‌గా హైదరాబాద్ మన్సూరాబాద్‌కు చెందిన సీనియర్ న్యాయవాది కె.హరీష్ రెడ్డి పదోన్నతి పొందారు. గత ఆరేళ్లుగా ఎన్‌సిఎల్‌టి కౌన్సిల్‌గా సేవలు అందిస్తున్న హరీష్‌ను సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమిస్తూ కేంద్ర న్యాయవ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ నుంచి కంపెనీ లా ట్రిబ్యునల్‌కు సంబంధించిన కేసులలో కేంద్ర ప్రభుత్వం తరపున ఆయన వాదనలు వినిపిస్తారు. హరీశ్ రెడ్డికి రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, కార్యదర్శి కార్తిక్ శుభాకాంక్షలు తెలిపారు.

## రూ.2.58 కోట్లు టోకరా

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల పేరిట సైబర్ నేరగాళ్లు మోసానికి తెరలేపారు. ట్రేడింగ్‌లో చిట్కాలు చెబుతామని మొదట వాట్సాప్ మెసేజ్ పంపించారు. తమ చిట్కాలు పాటిస్తే ట్రేడింగ్‌లో 500 శాతం లాభాలు వస్తాయని తెలిపారు. సెబీ సర్టిఫైడ్ డాక్యుమెంట్స్ అంటూ కొన్ని నకిలీ కాపీలను కూడా చూపించారు. ఈ విషయాలపై అవగాహన లేకపోవడంతో ఆమె తన భర్త మొబైల్ నెంబర్‌ను వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేయించారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మిన బాధితురాలు భారీగా పెట్టుబడులు పెట్టారు. 19 లావాదేవీల్లో రూ.2.58 కోట్ల మేర బదిలీ చేశారు. ఆ తరువాత పెట్టుబడులను నిలిపివేయడంతో నిందితులు బెదిరింపులకు దిగారు. ఇన్వెస్ట్‌మెంట్‌ను నిలిపివేస్తే అప్పటివరకూ పెట్టిన పెట్టుబడి పోతుందని బెదిరించారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు చివరకు పోలీసులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు ప్రజలు భయపడవద్దని, అలాంటి పరిస్థితి ఎదురైనా సమయంలో డయల్ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.




## హైదరాబాద్ బుక్‌ఫెయిర్ విజయవంతం

**రికార్డు స్థాయిలో రూ.8 కోట్ల విలువైన పుస్తకాలు విక్రయం**
**సోషల్ మీడియా యుగంలోనూ పుస్తక పఠనం తగ్గలేదు**
**బుక్ ఫెయిర్ అధ్యక్షులు డాక్టర్ యాకుబ్ షేక్, కార్యదర్శి ఆర్.శ్రీనివాస్**

ప్రజాపక్షం/హైదరాబాద్: దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను గత ఏడాది డిసెంబర్ 19 నుంచి 29 వరకు విజయవంతంగా నిర్వహించినట్టు హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు డాక్టర్ యాకుబ్ షేక్, కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సోషల్ మీడియా యుగంలోనూ పుస్తక పఠనం తగ్గలేదని, చదువరుల సంఖ్య అంతకంతకూ పెరిగిందనడానికి హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో రూ.8 కోట్లకు పైగా విలువైన పుస్తకాలు విక్రయించడం నిదర్శనమన్నారు. ఇంత పెద్ద స్థాయిలో పుస్తకాలు అమ్ముడుపోవడం ఒక రికార్డని తెలిపారు. యువత అధిక సంఖ్యలో తరలివచ్చి పుస్తకాలు కొనుగోలు చేశారని, లిటరరీ ఫెస్టివల్ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను త్వరలో పూర్తిస్థాయి ’లిటరరీ ఫెస్టివల్’గా తీర్చిదిద్దుతామని డాక్టర్ యాకూబ్ తెలిపారు. బుక్ ఫెయిర్‌లో రూ. 1.57 కోట్ల ఆదాయం రాగా, రూ.1.31 కోట్ల ఖర్చు వచ్చిందని, వీటి వివరాలు త్వరలో అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చుతామని కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ చెప్పారు. సామాజిక బాధ్యతలో భాగంగా చేపట్టిన ’పల్లెకు పుస్తకం’ కార్యక్రమం ద్వారా సేకరించిన వేలాది పుస్తకాలను గ్రామాల్లోని గ్రంథాలయాలకు అందిస్తామన్నారు. బుక్‌ఫెయిర్ నిర్వహణకు సహకరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, భాషా సాంస్కృతిక విభాగం, సంబంధిత అధికారులు, పోలీసులు, ఇతర శాఖల సిబ్బందికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బుక్‌ఫెయిర్ ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి, బి.శోభన్ బాబు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శులు కె.సురేష్, ఎం.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మేడారంలో వైద్య సేవల కోసం ఏర్పాట్లు

**3 ఆసుపత్రులు, 30 మెడికల్ క్యాంపులు**
**జాతరకు వెళ్లే మార్గాల్లో మరో 42 క్యాంపులు**
**35 అంబులెన్సులు.. 3,199 మంది సిబ్బందితో వైద్య సేవలు**
**ఏర్పాట్లపై అధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష**



ప్రజాపక్షం/హైదరాబాద్ : మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు శనివారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రూపొందించిన ప్రణాళికను మంత్రి పరిశీలించారు. ఇప్పటికే లక్షల మంది భక్తులు ముందస్తుగానే జాతరకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే గద్దెల వద్ద, జంపన్న వాగు సమీపంలో, ఆర్‌టిసి బస్ స్టాండ్ వద్ద 3 వైద్య శిబిరాలను ప్రారంభించామని అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందున జాతర పరిసరాలలో మరిన్ని మెడికల్ క్యాంపులను ముందస్తుగానే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. భక్తులు మేడారం బయలుదేరిన దగ్గరి నుంచి.. అమ్మవార్లను దర్శించుకుని క్షేమంగా ఇళ్లకు చేరేంత వరకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మేడారం చేరుకునే అన్ని రూట్లలోనూ మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.

### 50 పడకల ప్రధాన ఆసుపత్రి ఏర్పాటు

జాతరలో అత్యవసర వైద్య సేవల కోసం మేడారంలోని టిటిడి కల్యాణ మండపంలో 50 పడకలతో కూడిన ప్రధాన హాస్పిటల్ (శ్రీ సమ్మక్క సారలమ్మ వైద్యశాల) ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీనికి అదనంగా జంపన్న వాగు, ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద 6 పడకల సామర్థ్యంతో రెండు మినీ హాస్పిటళ్లు, జాతర పరిసరాల్లో 30 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### 8 ప్రధాన మార్గాల్లో క్యాంపులు

వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చే 8 ప్రధాన మార్గాల్లో ఎక్కడా వైద్య సేవలకు లోటు రాకూడదని మంత్రి సూచించారు. ఇందుకోసం 42 ఎన్ రూట్ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా హనుమకొండ–మేడారం రూట్‌లో అత్యధికంగా 9 క్యాంపులు, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే భక్తుల కోసం 6 క్యాంపులు, భద్రాచలం రూట్‌లో 5 క్యాంపులు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.3,199 మందితో వైద్య సైన్యం గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భారీగా వైద్య సిబ్బందిని మోహరించాలని మంత్రి ఆదేశించారు. పూర్వ వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి మొత్తం 3,199 మంది సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఇందులో72 మంది స్పెషలిస్టులు, 42 మంది లేడీ డాక్టర్లతో కలిపి 544 మంది వైద్యులు విధుల్లో ఉంటారు. వీరికి తోడుగా 2,150 మంది పారామెడికల్ సిబ్బంది (నర్సులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు) షిఫ్టుల వారీగా 24 గంటల పాటు సేవలు అందించనున్నారు.

### అత్యవసర సేవలకు 35 అంబులెన్సులు

గుండెపోటు, ప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో గోల్డెన్ అవర్లో చికిత్స అందించేలా 35 అంబులెన్సులను సిద్ధం చేశామని ధికారులు తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైతే పేషెంట్లను ములుగు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు, వరంగల్ ఎంజీఎంలకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ రెండు హాస్పిటళ్లలో నెల రోజుల పాటు డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

### మందుల కొరత లేకుండా చర్యలు

చిన్నపిల్లల మందుల దగ్గరి నుంచి పాముకాటు విరుగుడు ఇంజెక్షన్ల వరకు 248 రకాల మందులు, సర్జికల్ సామాగ్రిని ద్వారా ముందస్తుగానే సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే జనవరి 25వ తేదీ నుంచి అన్ని వైద్య శిబిరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. తక్షణమే మేడారం వెళ్లి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్‌ను మంత్రి ఆదేశించారు.

## శాంతించని ఇరాన్

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా పిలుపునిచ్చారు. ‘వీధి పోరాటమే మన లక్ష్యం కాదు... సిటీ సెంటర్లు స్వాధీనం చేసుకోవాలి’ అంటూ వీడియో సందేశమిచ్చారు. నా దేశానికి నేను తిరిగి వచ్చే రోజు ఎంతో దూరం లేదన్నారు. ఖమేనీకి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలను మెచ్చుకున్నారు. ‘నా ప్రియమైన సహచరులారా! మీ ధైర్యం, ఆత్మస్థైర్యం ద్వారా ప్రపంచ మన్ననలు అందుకుంటున్నారు. నాయకత్వాన్ని ఎదిరించడం అభినందనీయం. రహస్య స్థావరంలో కూర్చొని ఈ దృశ్యాలను చూసిన అధినేత వెన్నులో వణుకు పుట్టింది. మన పోరాటం తదుపరి దశలో ఆర్థిక ఒత్తిళ్లపై దృష్టి పెట్లాలి. ఇంధనం, గ్యాస్, విద్యుత్, రవాణా వంటి కీలక ఆర్థిక రంగాల ఉద్యోగులు, కార్మికులు దేశవ్యాప్త సమ్మెలకు సన్నద్ధం కావాలని కోరుతున్నా’ అని పెహ్లావి పేర్కొన్నారు. శని, ఆదివారాలు సాయంత్రం 6 గంటల నుంచి పెద్ద సంఖ్యల్లో వీధుల్లోకి రావాలని, జెండాలు, చిత్రపటాలు ప్రదర్శించాలని సూచించారు. ‘మన లక్ష్యం కేవలం వీధుల్లో రావడం, బలాన్ని ప్రదర్శించడమే కాదు. సిటీ సెంటర్లను మన నియంత్రణలోకి తీసుకోవడం’ అని వక్కాణించారు. వేర్వేరు మార్గాల ద్వారా నగరాల్లో ప్రధాన కేంద్రాలకు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. త్వరలోనే దేశానికి వస్తున్నా.. మీతో కలిసి పయనిస్తా అంటూ వీడియోలో పేర్కొన్నారు.

### చిక్కుల్లో ఇరాన్ : ట్రంప్

ఇరాన్ పెద్ద సమస్యలో చిక్కుకున్నదని ట్రంప్ అన్నారు. ఆందోళనకారులపై కాల్పులు జరిపితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, సైనిక దాడులు చేస్తామని మరోమారు ఇరాన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ‘ఇరాన్ చిక్కుల్లో పడింది. కొన్ని నగరాలను ప్రజలు స్వాధీనం చేసుకుంటున్నట్లు కనిపిస్తోంది. కొన్ని వారాల ముందు ఈ స్థాయి ఉద్రిక్తతలు నెలకొంటాయని ఎవరూ ఊహించలేదు’ అని ట్రంప్ అన్నారు. చాలా ప్రమాదకరమైన ప్రాంతంగా ఇరాన్ ఉందని, ఆందోళనకారులంతా క్షేమంగా ఉంటారని ఆశిస్తున్నానని అమెరికా అధ్యక్షుడు చెప్పుకున్నారు.

## భారీ ఆపరేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఆపరేషన్ జరిగింది. గత కొంతకాలంగా ఈ సర్వే నెంబర్‌లోని భూమిపై అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు, తప్పుడు పత్రాలతో సుమారు 43 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు హైడ్రా గుర్తించింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు పడటం గమనార్హం. విచారణ అనంతరం ఆక్రమణకు గురైన 15 ఎకరాలకు పైగా భూమిని స్వాధీనం చేసుకుని, దాని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు గతంలోనే ఇదే సర్వే నెంబర్‌లో 5 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మియాపూర్ బాచుపల్లి ప్రధాన రహదారి సమీపంలో చెరువు కట్టపై అక్రమంగా నిర్మించిన 18 షెట్టర్లను కూల్చివేశారు. సర్వే నెంబర్ 159కి చెందిన పత్రాలను చూపిస్తూ, సర్వే నంబర్ 44లోని ఎకరన్నర భూమిని కబ్జా చేసిన ఇమ్రాన్ అనే వ్యక్తిపై అధికారులు ఇప్పటికే కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న భూమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేస్తూ హైడ్రా అధికారులు అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను కాపాడటంలో హైడ్రా ప్రదర్శిస్తున్న వేగం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువైన ప్రజా ఆస్తిని కబ్జాదారుల నుంచి విడిపించడం పట్ల అధికారులపై ప్రశంసలు కురుస్తున్నాయి.

### రాంపల్లిలో 4 ఎకరాల భూమి జలమండలి స్థలం స్వాధీనం

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా దూసుకుపోతున్న హైడ్రా తాజాగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జలమండలికి చెందిన భూమిని కాపాడింది. కీసర మండలం రాంపల్లి గ్రామ పరిధిలో అన్యాక్రాంతం కాకుండా జలమండలికి చెందిన సుమారు 4.01 ఎకరాల భూమిని హైడ్రా అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. రాంపల్లి గ్రామం సర్వే నెంబరు 388లో 4.01 ఎకరాల భూమిని ప్రభుత్వం జలమండలి అవసరాల కోసం కేటాయించింది. అయితే, ఈ భూమిని స్వాధీనం చేసుకునే క్రమంలో అధికారులకు స్థానికుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. జలమండలి అధికారులు ప్రహరీ గోడ నిర్మించేందుకు ప్రయత్నించగా, స్థానికులు పనులను అడ్డుకుంటూ ఆటంకాలు సృష్టించారు. భూమి స్వాధీనంలో ప్రతిష్టంభన ఏర్పడటంతో జలమండలి అధికారులు హైడ్రా సహాయాన్ని కోరారు. సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించింది. రెవెన్యూ రికార్డులను తనిఖీ చేసి, సదరు భూమి జలమండలికి కేటాయించిన ప్రభుత్వ స్థలంగా ధృవీకరించుకుంది. శనివారం భారీ భద్రత మధ్య 4.01 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయించింది. అక్కడ వివాదాలకు తావులేకుండా, అది ‘జలమండలికి చెందిన భూమి’ అని స్పష్టం చేస్తూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president Palla Venkat Reddy, Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 Editor : Makkena Subbarao, Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com